మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - బుధవారం 14 అక్టోబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 279 || పేజీలు:12 || వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

కొత్త కోడలికి 25 రకాల బతుకమ్మల వాయినం

2

50 సార్లు ఫేలయ్యిండు.. ఆఖరికి సాధించిండు

2

సింగరేణి కార్మికులకు దసరా ధమాకా..

ఒక్కొక్కరికీ రూ.1.53 లక్షల లాభాల వాటా

38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లబ్ధి

29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు రూ. 5,500 బోనస్

ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి శ్రీధర్ బాబు

కార్మికుల సొంతింటి కల సాకారానికి 'నెహ్రూ హౌసింగ్ కాలనీ' ఏర్పాటు

పెండింగ్ ఉద్యోగాల భర్తీ..

బీఆర్ఎస్ సర్కార్ తప్పుడు విధానాల వల్లే సింగరేణికి తీవ్ర నష్టాలు

హైదరాబాద్,అక్టోబర్13(మనం న్యూస్): రాష్ట్రంలోని సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా భారీ కానుకను ప్రకటించింది. సంస్థ ఆర్జించిన లాభాల్లో గత ఏడాది మాదిరిగానే ఈసారీ 34 శాతం వాటాను కార్మికులకు పంచాలని నిర్ణయించింది. దీనిద్వారా అర్హులైన ప్రతి పర్మినెంట్ ఉద్యోగానికి సగటున రూ.1,53,912 చొప్పున లాభాల వాటా దక్కనుంది. అలాగే, సుమారు 29 వేలకు పైగా ఉన్న కాంట్రాక్టు కార్మికులకు గత ఏడాదితో సమానంగా ఒక్కొక్కరికీ రూ.5,500 చొప్పున

...మిగతా 2లో

ఢిల్లీలో ఇండి కూటమి నేతల భేటీ

సర్‌పై పోరాట కార్యాచరణ ఖరారు!

పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 13 (మనం బ్యూరో): సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల ఢిల్లీ పర్యటన ముగిసింది. ఓటర్ల సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇండీ కూటమి నేతలు జంతర్‌మంతర్ వద్ద భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్లన్లు ఢిల్లీకి తరలివెళ్లారు. సీఎం రేవంత్‌తో పాటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్య నేతలు నిరసన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. మంగళవారం లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ నివాసంలో ఇండి కూటమి నేతల భేటీలోనూ సీఎం రేవంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో సర్‌పై పోరాటానికి సంబంధించి అనుసరించాల్సిన భవిష్యత్ కార్యాచరణ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టాల్సిన

...మిగతా 2లో

మొదటి ప్రాధాన్య ఓటు మనకే పడాలె

ఎమ్మెల్సీ ఎన్నికలకు 77 మంది ఇంచార్జ్‌లు

కొడంగల్ నియోజకవర్గ

ఇన్‌చార్జిగా అనుముల తిరుపతి రెడ్డి

ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి కీలక సమీక్ష

ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన

హైదరాబాద్, అక్టోబర్ 13 (మనం బ్యూరో):

రాష్ట్రంలో త్వరలో జరుగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. రెండు ఎమ్మెల్సీ స్థానాలకు కలిపి మొత్తం 77 మంది ఇంచార్జిలను నియమించింది. ఇందులో హైదరాబాద్ స్థానానికి 43, నల్గొండ స్థానానికి 34 మందికి బాధ్యతలు అప్పగించింది. ఇదిలా ఉండగా, ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయిలో పార్టీ నేతల బాధ్యతలపై ప్రధానంగా చర్చించినట్లు

...మిగతా 2లో

కొత్త ఓటరు నమోదుకు రేపు, ఎల్లుండి ప్రత్యేక క్యాంపులు

హైదరాబాద్, అక్టోబర్ 13: తెలంగాణలో ఓటర్ల నమోదు, జాబితా సవరణ కోసం ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 15, 16 తేదీల్లో అన్ని పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్త ఓటర్లు, యువత తమ పేర్లను ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఈ ప్రత్యేక క్యాంపులు చక్కటి అవకాశం. ఇందుకోసం దరఖాస్తుదారులు 'ఫారం-6' ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించనున్నారు. అలానే ఫారం-6 నింపడంలో దరఖాస్తుదారులకు బీఎల్ఓలు సహకారం అందిస్తారు. ఒకవేళ ఓటర్ల జాబితాలో పేర్లు, చిరునామాలు తదితర వివరాల్లో ఏవైనా తప్పులుంటే, వాటి సవరణ కోసం తక్షణమే అధికారులను సంప్రదించాలని ఈసీ స్పష్టం చేసింది. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు ఉండేలా చూసుకోవాలని అధికారులు కోరారు.

పండుగ ఆఫర్ పేరిట జనాల జేబులు లూటీ

కరీంనగర్‌లో సీఎంఆర్ షాపింగ్ మాల్ బాగోతం

రూ.5 వేల షాపింగ్ చేస్తే సిల్వర్ కాయిన్ ఇస్తమంటూ ప్రకటన

కొన్న తరువాత కాయిన్ బదులు కూపన్ చేతిలో పెడుతున్న వైనం

ఇది పచ్చి మోసమంటూ వినియోగదారుల ఆగ్రహం

ఈ వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు

హైదరాబాద్,అక్టోబర్ 13(మనం న్యూస్): బతుకమ్మ, దసరా పండుగలొచ్చాయంటే ఇళ్లలో సందడి ఎలా ఉంటుందో.. వ్యాపార సంస్థల మోసాలకు అంతే వేదికవుతుంది. పండగ సంబరాల్లో మునిగితేలే అమాయక ప్రజల బలహీనతను, ఆనందాన్ని క్యాష్ చేసుకునేందుకు కరీంనగర్‌లోని 'సీఎంఆర్ షాపింగ్ మాల్' నిర్వాహకులు తెగబడుతున్న వైనం విస్మయానికి గురిచేస్తోంది. పండుగ ఆఫర్‌ల పేరుతో కస్టమర్‌లను నమ్మించి, నిలువునా మోసం చేస్తున్న తీరుపై ఇప్పుడు జిల్లావ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

ఆకర్షించే ప్రకటనలు.. ఆచరణలో వంచన!

ఇళ్లలో పండుగ సంరంభం మొదలుకాగానే.. సరికొత్త బట్టలు, వస్తువులు కొనుగోలు చేయడానికి సామాన్యులు షాపింగ్ మాల్స్‌కు క్యూ కడుతుంటారు. ఇదే అదునుగా భావించిన కరీంనగర్ సీఎంఆర్ మాల్ యాజమాన్యం మెరిసే ప్రకటనలతో ప్రకటనల హోరు మోగించింది. 'రూ.5 వేల షాపింగ్ చేస్తే వెండి నాణెం (సిల్వర్ కాయిన్) ఉచితం!'అంటూ భారీ బోర్డులు, ఆకర్షణీయమైన ప్రకటనలతో

...మిగతా 2లో



పోస్టుమెట్రిక్ విద్యార్థులకు రూ.204.40 కోట్ల భరోసా

32,976 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ నిధులు విడుదల

హైదరాబాద్,అక్టోబర్13(మనం న్యూస్): రాష్ట్రంలోని ఎస్సీ విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద 32,976 మంది విద్యార్థులకు మొత్తం రూ.204.40 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన 40 శాతం వాటాగా రూ.101.44 కోట్లు, కేంద్ర ప్రభుత్వం 60 శాతం వాటాగా రూ.102.96 కోట్లు విడుదల చేసినట్లు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.కళాశాలల నుంచి అందుతున్న పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ,

...మిగతా 2లో

చినిగిపోని..తడిసినా చెడిపోని మీసేవ సర్టిఫికెట్‌లు

హైదరాబాద్,అక్టోబర్13(మనం న్యూస్): ప్రభుత్వ ధ్రువపత్రాల భద్రత, మన్నిక పెంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. చినిగిపోకుండా, నీళ్లు పడినా దెబ్బతినకుండా ప్రత్యేకంగా రూపొందించిన కొత్త మీసేవ సర్టిఫికెట్ పేపర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లోజరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజ్ ఠాకూర్, విజయరమణారావు, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్ టి. రవికిరణ్, అధికారులు, ప్రింటింగ్ ఏజెన్సీలు,

...మిగతా 2లో

గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి భేటీ

రాష్ట్రాభివృద్ధికి ఊతమిచ్చే కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్ర మంత్రి సానుకూలత

ఎన్‌హెచ్ 65 విస్తరణ పనులకు నవంబర్‌లో టెండర్ ప్రక్రియ పూర్తి

2

రామ్‌లీలాలో నిరసనలు చేయలేరు

డిసెంబర్ 29, 30, 31 తేదీలు తప్ప ఏడాదంతా బుక్కైన మైదాన్

ఛార్జీ కూడా ఎక్కువే.. రోజుకు రూ.1.21 లక్షలు

9

ఐసీసీపై ట్రంప్ వ్యాఖ్యలు అత్యంత క్రూరమైనవి

నోబెల్ శాంతి బహుమతి విజేత నవీ పిళ్లై

దహేగ్, అక్టోబర్ 13: అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ)పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ చేసిన ప్రతికూల వ్యాఖ్యలను నోబెల్ శాంతి బహుమతి విజేత నవీ పిళ్లై ఖండించారు. ట్రంప్ వ్యాఖ్యలు పూర్తిగా చట్టవిరుద్ధమైనవని, అత్యంత క్రూరమైనవని ఆమె అన్నారు. ప్రపంచ దేశాలు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టును, అంతర్జాతీయ న్యాయ వ్యవస్థను రక్షించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. పిళ్లైకు నోబెల్ శాంతి బహుమతి ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఆమె పనిచేసిన అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపై అమెరికా ఆంక్షలు ప్రకటించింది. అమెరికాకు అత్యంత ఆప్త మిత్ర దేశమైన ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడిందని పేర్కొంటూ ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అరెస్టుకు గతంలో ఐసీసీ వారెంట్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నోబెల్ శాంతి బహుమతి కోసం ప్రయత్నించి భంగపడిన ట్రంప్ ఆ బహుమతి ఐసీసీకి

...మిగతా 2లో

చివరి నిమిషంలో ప్రశ్నపత్రం తయారీతో

పేపర్ లీకేజీలను అరికట్టొచ్చు

ఏఐతో గంటల్లోనే క్వశ్చన్ పేపర్ తయారు చేయొచ్చు

పరీక్షల సంస్కరణలపై ఏర్పాటైన టాస్క్ ఫోర్స్ చీఫ్ నందన్ నీలేకని

ఢిల్లీ, అక్టోబర్ 13: ప్రశ్నపత్రాల లీకేజీ కట్టడిపై ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, పరీక్షల సంస్కరణలపై ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్‌కు నేతృత్వం వహిస్తున్న నందన్ నీలేకని కీలక వ్యాఖ్యలు చేశారు. ముందుగానే తయారు చేసిన పేపర్ కు బదులు.. ఒక పెద్ద క్వశ్చన్ బ్యాంక్ నుంచి చివరి నిమిషంలో ప్రశ్నపత్రాన్ని రూపొందించడమనేది ఈ సమస్యను అరికట్టేందుకు ఒక మార్గమని చెప్పారు. ఢిల్లీలో 'బ్లూమ్ బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్ 2026' కార్యక్రమంలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. పరీక్ష జరిగే రోజే కృత్రిమ మేధతో పరీక్ష పత్రాన్ని రూపొందించగలమా? అని అడగ్గా.. ఆయన అవునని సమాధానమిచ్చారు. అసలు ఈ సమస్య

...మిగతా 2లో

లద్దాఖ్‌పై చైనా వ్యాఖ్యలను తిప్పికొట్టిన భారత్

ఢిల్లీ, అక్టోబర్ 13: లద్దాఖ్ లోని 28 వ్యూహాత్మక ప్రాంతాలు, భౌగోళిక ప్రదేశాలకు ప్రామాణిక పేర్లను ఖరారు చేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయాన్ని చైనా వ్యతిరేకించింది. ఆ ప్రాంతాలు తమవేనని వాదించింది. అయితే, చైనా వ్యాఖ్యలను భారత్ తిప్పికొట్టింది. లద్దాఖ్ తమ దేశంలో అంతర్భాగమని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ స్పష్టం చేశారు. లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాన్ని తమ దేశం ఎప్పుడూ గుర్తించలేదని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ ఓ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. లద్దాఖ్లోని ప్రాంతాలకు పేర్లు పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అయితే, చైనా అభ్యంతరాలను భారత్ ఖండించింది. లద్దాఖ్ అనేది భారత్ లో అంతర్భాగమని, ఆ దేశం ఎంతగా వాదించినా.. ఈ వాస్తవాన్ని మార్చలేదని పేర్కొంది. 'సర్వే ఆఫ్ ఇండియా' మ్యాప్ ఆధారంగా లద్దాఖ్ లోని ప్రదేశాలను కచ్చితంగా గుర్తించేందుకు, ప్రజల్లో వాటిపై అవగాహనను పెంపొందించేందుకు వీలుగా పేర్లు పెట్టినట్లు రణధీర్ ఓ ప్రకటనలో తెలిపారు.

స్టార్ లింక్‌కు అనుమతులు

నిలిపేయండి

కేంద్రానికి స్వదేశీ జాగరణ్ మంచ్ విజ్ఞప్తి

ఢిల్లీ, అక్టోబర్ 13: దేశంలో స్టార్ లింక్ బ్రాడ్ బ్యాండ్ సేవలను ప్రారంభించేందుకు అవసరమైన అనుమతులను నిలిపివేయాలని ఆరెస్సెస్ అనుబంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అనుమతుల జాప్యం విషయంలో భారత ప్రభుత్వంపై,

...మిగతా 2లో

స్టార్ లింక్‌కు అనుమతులు నిలిపేయండి

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారులపై సార్ లింక్ అధిపతి ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. మస్క్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని స్వదేశీ జాగరణ్ మంచ్ జాతీయ కో-కన్వీనర్ అశ్వినీ మహాజన్ తప్పుబట్టారు. జాతీయ భద్రతకు సంబంధించిన ఆందోళనలను కారణంగా చూపుతూ స్టార్ లింక్ ను నిరోధించే హక్కు భారత్ కు ఉందని మహాజన్ పేర్కొన్నారు. తద్వారా అమెరికా వంటి వాణిజ్య భాగస్వాములకు సైతం ఒక సందేశం పంపొచ్చని అభిప్రాయపడ్డారు. స్టార్లింక్ సేవలు కమర్షియల్ సేవల ప్రారంభానికి మస్క్ అనుమతులు మాత్రమే కోరని, భారత ప్రభుత్వం దాన్ని ఆమోదించడం గానీ, తిరస్కరించడం గానీ చేయలేదని పేర్కొన్నారు. అనుమతుల జాప్యంపై ఆరా తీయాలే తప్ప... భారత ప్రభుత్వం, వ్యాపారులు లక్ష్యంగా విమర్శలు చేయడం తగదని అభిప్రాయపడ్డారు. అవసరమైన అనుమతులు పొందకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్న ప్రయత్నం కనిపిస్తోందన్నారు. క్రెయిన్, ఇరాన్, రష్యా, చైనా, తైవాన్..తదితర దేశాల్లో స్టార్ లింక్ విషయంలో భద్రతాపరమైన ఆందోళనలు ఉన్నాయని మహాజన్ పేర్కొన్నారు. జాతీయ భద్రతా కారణాలు చూపుతూ స్టార్ లింక్కు అనుమతులు నిరాకరించడం వల్ల దేశీయంగా అభివృద్ధి చేసిన శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను మారుమూల గ్రామాలకూ అందించడడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ఒక్కొక్కరికీ రూ.1.53 లక్షల లాభాల వాటా

(మొదటి పేజీ తరువాయి)

దసరా బోనస్‌ను చెల్లించనున్నారు. మంగళవారం ప్రజాభవన్‌లోజరిగిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ఈ కీలక నిర్ణయాలను అధికారికంగా ప్రకటించారు. ఈ ఏడాది సింగరేణి సంస్థ రూ.1,754 కోట్ల నికర లాభాలను ఆర్జించిందని, ఇందులో 34 శాతం చొప్పున రూ.596 కోట్లను నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కూడా ప్రజా ప్రభుత్వం సమాన ప్రాధాన్యతనిస్తోందని ఈ సందర్భంగా భట్టి స్పష్టం చేశారు.

కార్మికుల సొంతింటి కల..

దసరా పండుగ వేళ సింగరేణి శ్రామిక లోకంలో ఆనందోత్సాహాలు నింపేలా ప్రభుత్వం పలు కీలక సంక్షేమ, అభివృద్ధి హామీలను కూడా ప్రకటించింది. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా సమగ్ర కార్యాచరణను రూపొందించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో ఇప్పటివరకు మైనింగ్ జరగని ప్రాంతాలను గుర్తించి, ఆధునిక వసతులతో కూడిన లేఔట్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మిశ్రమ ఆర్థిక విధానాలను ప్రోత్సహించిన దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరు మీద 'నెహ్రూ హౌసింగ్ కాలనీ'ని ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. అంతేకాకుండా, గతంలో రెవెన్యూ శాఖకు తిరిగి అప్పగించిన భూముల్లో మిగిలిన సుమారు 1,250 ఎకరాలకు సంబంధించి జీవో నంబర్ 76 ప్రకారం అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని భట్టి స్పష్టం చేశారు.

పెండింగ్ ఉద్యోగాల భర్తీ..

కార్మికులను వేధిస్తున్న పెండింగ్ సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం కఠినమైన గడువులను విధించింది. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఉద్యోగాల దరఖాస్తులను రాబోయే 15 రోజుల్లోగా పూర్తి చేసి అర్హులకు నియామక పత్రాలు అందజేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్మికుల పేర్ల మార్పులకు సంబంధించిన సమస్యలతో పాటు, కరోనా కాలంలో,ఇతర స్థానిక కారణాల వల్ల విధులకు హాజరుకాక ఉద్యోగాలు కోల్పోయిన వారిని వన్‌టైమ్ ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని,మెడికల్ ఇన్‌వాలిడేషన్ కోసం కార్మికులు సుదూర ప్రాంతాలలోని కొత్తగూడెం వెళ్లే ఇబ్బందులను తప్పించేలా, సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రులలోనే ప్రతి నెలా నిర్ణీత రోజున మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేశారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఆరు నెలలకోసారి తప్పనిసరిగా సేఫ్టీ కిట్లు అందించాలని, అలాగే ఉద్యోగుల మాదిరిగానే కార్మికుల అలవెన్సులపై పడే ఆదాయపు పన్నును కూడా సంస్థే భరించేలా చర్యలు తీసుకోవాలని భట్టి అధికారులను ఆదేశించారు.

కార్మికుల ఆరోగ్య రక్షణకు..

సింగరేణి ప్రాంత ప్రజలు, కార్మికుల కుటుంబాల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. సింగరేణి పరిధిలోని ఏరియా ఆసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఆధునీకరించి, నిపుణులైన వైద్యులను నియమించడంతో పాటు అత్యవసర వైద్య సేవల కోసం కార్డియాక్, క్యాథ్ ల్యాబ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. బొగ్గు గనులు, ఓవర్‌బర్డెన్ డంప్‌ల దుమ్ము వల్ల ప్రభావితమవుతున్న పాత జిల్లాల్లోని ప్రతి గ్రామానికి ప్రత్యేక బృందాలను పంపి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని,విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు, విద్యార్థులకు శుద్ధమైన తాగునీటిని అందించేందుకు ఆర్‌వో వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

తప్పుడు విధానాల వల్ల..

గత పదేళ్ల పాలనలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాల వల్లే సింగరేణి సంస్థ తీవ్ర నష్టాలను చవిచూసిందని డిప్యూటీ సీఎం విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి పాల్గొనే అవకాశం కల్పించకపోవడం, కొత్త బ్లాక్‌లను సాధించడంలో విఫలం కావడం వల్లే సంస్థ వ్యాపార విస్తరణకు ఆటంకం ఏర్పడిందని ఆరోపించారు. ఇప్పటికే సుమారు 14 బ్లాక్‌లు మూతపడటంతో ఉత్పత్తిపై ప్రభావం పడిందని భట్టి తెలిపారు. ఈ దుస్థితిని మార్చేందుకు ప్రస్తుత ప్రజా ప్రభుత్వం తాడిచెర్ల-2, కోయగూడెం బ్లాక్-3, మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్, నైని వంటి కొత్త బొగ్గు బ్లాక్‌లను దక్కించుకునే దిశగా వేగంగా అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. మార్కెట్‌లోనెలకొన్న తీవ్రమైన పోటీని తట్టుకునేలా, సింగరేణి ఆర్థిక ప్రయోజనాలను కాపాడుతూనే బొగ్గు ధరలను హేతుబద్ధీకరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని,పదేళ్ల పాటు అధికారంలో ఉండి సింగరేణిని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తూ పోరుబాట పట్టడం హాస్యాస్పదమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రంగా ఎద్దేవా చేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల సమస్యలను గాలికి వదిలేసిన వారు, ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చి ఏముఖంతో ఆందోళనలు చేస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమం, సంస్థ పురోభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ప్రజా ప్రభుత్వాన్ని అడ్డుకోవాలని చూస్తే కార్మికులు తగిన బుద్ధి చెబుతారని శ్రీధర్ బాబు హెచ్చరించారు. ఈ సమావేశంలో కోల్ బెల్ట్ ప్రాంతానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీలను అరికట్టొచ్చు

(మొదటి పేజీ తరువాయి)

ఎందుకు తలెత్తుతోందో దాని మూల కారణాలను గుర్తించి, ఒక క్రమబద్ధమైన విధానంతో పరిష్కరించవచ్చు. దీని కోసం సాంకేతికత వినియోగం అవసరం. మా కమిటీ ఇలాంటి వ్యవస్థాపరమైన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుంది. అదేవిధంగా అన్ని పరీక్షలను కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు మార్చే అంశాన్ని కూడా పరిశీలిస్తోంది. మా సూచనలను అమలు చేయడానికి ప్రధాని ఎంతో ఆసక్తిగా ఉన్నారని భావిస్తున్నాను'' అని నీలేకని తెలిపారు. సాంకేతికతను పెద్దఎత్తున అమలు చేస్తున్నప్పుడు.. అది ప్రజలందరికీ ఎలా ప్రయోజనకరంగా ఉంటుందనే దానిపై తాను ఎల్లప్పుడూ దృష్టి పెడతానని అన్నారు.

కొత్త కోడలికి 25 రకాల బతుకమ్మల వాయినం

జగిత్యాల, అక్టోబర్ 13: బతుకమ్మ పండుగ సందర్భంగా జగిత్యాల జిల్లా మెట్ పల్లిలో 25 రకాల బతుకమ్మలను కొత్త కోడలికి వాయినం ఇచ్చారు. పల్లవి-అరవింద్‌లకు 5 నెల్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లయ్యాక వచ్చిన తొలి బతుకమ్మ కావడంతో అత్తింటివారు.. పూలు, బత్తాయి, కాగితం, వెండి, నాణేలు, చాక్లెట్లు, బిస్కెట్లు, గాజులు, మెహందీ, ముత్యాలు, పసుపుకుంకుమ ఇలా పలు రకాల వస్తువులతో 25 రకాల బతుకమ్మలను తయారు చేశారు. నూతన దంపతులకు కొత్త బట్టలు పెట్టి బతుకమ్మ వాయినం ఇచ్చారు.

సర్‌పై పోరాట కార్యాచరణ ఖరారు!

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాలపై చర్చించారు. ప్రస్తుతం అన్ని కార్యక్రమాలు ముగియడంతో నేతలంతా తిరిగి దేశ రాజధాని ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రికి హైదరాబాద్ చేరుకున్నారు. బుధవారం పాలనాపరమైన సమీక్షా సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనే అవకాశం ఉంది.

50 సార్లు ఫేలయ్యిండు.. ఆఖరికి సాధించిండు

హైదరాబాద్, అక్టోబర్ 13: లక్ష్యమేదైనా దాన్ని సాధించే వరకు పట్టు వదలకూడదు అనడానికి నిలువెత్తు నిదర్శనం నల్గొండ జిల్లా రామన్న పేటకు చెందిన సాయిచరణ్. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 50 సార్లు పరీక్ష రాశారు. లక్ష్య సాధనలో వైఫల్యాలు ఎదురైనా కుంగిపోకుండా పట్టుదలతో ఏకంగా 12 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం తెలంగాణ పోలీస్ అకాడమీలో 46 వారాల శిక్షణను పూర్తి చేసుకుని డీఎస్పీగా విధుల్లో చేరబోతున్నారు.

ఐసీసీపై ట్రంప్ వ్యాఖ్యలు అత్యంత క్రూరమైనవి

(మొదటి పేజీ తరువాయి)

దక్కడాన్ని జీర్ణించుకోలేకపోయారు. అంతర్జాతీయ న్యాయసూత్రాలను బలోపేతం చేసినందుకు నవీ పిళ్లైకు నోబెల్ శాంతి బహుమతి దక్కింది. దక్షిణాఫ్రికాలో జాతి వివక్ష అంతానికి జీవితాన్ని అంకితం చేసిన నల్లసూరీడు నెల్సన్ మండేలాకు న్యాయ సహాయం అందించడంతోపాటు గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడిందని నిర్ధరించిన కమిటీలో ఆమె సభ్యురాలిగా పనిచేశారు. మూడు అంతర్జాతీయ న్యాయస్థానాల్లో న్యాయమూర్తిగా వ్యవహరించారు. ''ఈ రకమైన పనికి గుర్తింపు లభించడం అద్భుతం. నాకే కాదు నా సహచరులకు కూడా'' అని పిళ్లై అన్నారు.

చినిగిపోని..తడిసినా చెడిపోని మీసేవ సర్టిఫికెట్‌లు

(మొదటి పేజీ తరువాయి)

సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.కొత్త మీసేవ సర్టిఫికెట్ పేపర్‌లో 15 అత్యాధునిక భద్రతా ఫీచర్‌లను పొందుపరిచారు. నకిలీ సర్టిఫికెట్ల తయారీ, అనధికార నకళ్లను అరికట్టేలా వీటిని రూపొందించారు. భద్రతా కారణాలతో ఈ ఫీచర్ల పూర్తి వివరాలను వెల్లడించడం లేదు. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ పేపర్ సులభంగా చినిగిపోదు. నీళ్లు పడినా త్వరగా దెబ్బతినదు. సాధారణ వినియోగం, మడతపెట్టడం, ఎక్కువ కాలం భద్రపరచడం వల్ల కలిగే నష్టాన్ని తగ్గిస్తుంది. దీంతో సర్టిఫికెట్లను ఏళ్ల తరబడి మంచి స్థితిలో దాచుకునే అవకాశం ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో వాటికి లామినేషన్ చేయించాల్సిన అవసరం కూడా తగ్గుతుంది.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు విద్య, ఉద్యోగ, ఇతర అధికారిక అవసరాలకు ఉపయోగించే సర్టిఫికెట్‌లు ప్రజల జీవితంలో ఎంతో ముఖ్యమైనవని పేర్కొన్నారు. కొన్ని పత్రాలను జీవితాంతం భద్రంగా ఉంచుకోవాల్సి ఉంటుందని, అలాంటి ధ్రువపత్రాలు త్వరగా పాడవకుండా చూడటంతో పాటు వాటి విశ్వసనీయతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అందించే ప్రభుత్వ సేవల్లో నాణ్యత, భద్రత, సౌలభ్యాన్ని మరింత పెంచే దిశగా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి వివరించారు. కొత్త సెక్యూరిటీ పేపర్‌తోసర్టిఫికెట్‌ల మన్నిక పెరగడంతో పాటు నకిలీలను అరికట్టేందుకు వీలవుతుందని, ప్రభుత్వ ధ్రువపత్రాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణలో మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక రకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. 2011 నుంచి మీసేవ సర్టిఫికెట్ల ముద్రణకు ప్రత్యేక సెక్యూరిటీ పేపర్‌ను వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న పేపర్ స్థానంలో మరింత నాణ్యత, భద్రత, మన్నిక కలిగిన కొత్త పేపర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యంగా జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు దీర్ఘకాలం భద్రపరచాల్సిన ఇతర ప్రభుత్వ పత్రాలకు ఇది ఎంతో ఉపయోగపడనుంది.

మొదటి ప్రాధాన్య ఓటు మనకే పడాలె

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో విజయం సాధించే బాధ్యతను ఇన్‌చార్జిలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఎన్నికలను ఎవరూ తేలికగా తీసుకోవద్దనీ, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు, నేతలు ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలనీ, ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం మంత్రులు ప్రత్యేక బాధ్యతలు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలలో ఆయా ఎమ్మెల్యేలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించగా, ఎమ్మెల్యేలు లేని ప్రాంతాల్లో ఎంపీలు, ఎమ్మెల్సీలకు అప్పగించారు. కొడంగల్ నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జిగా అనుముల తిరుపతి రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. కాగా, రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది. దీంతో ఎన్నికల నిర్వహణ, ఓటర్ల నమోదు, ప్రచార సమన్వయంపై దృష్టి సారించింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రాబోయే ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందనీ, అందుకే రెండు స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పని చేయాలని నేతలకు సీఎం దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం. ఎన్నికల్లో మొదటి స్థానానికే ప్రాధాన్యం ఉంటుందనీ, రెండో స్థానానికీ అదే స్థాయి గుర్తింపు ఉండదని సీఎం నేతలకు స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర పార్టీ నేతలు తమకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వహించడంపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది.

గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి భేటీ

రాష్ట్రాభివృద్ధికి ఊతమిచ్చే కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్ర మంత్రి సానుకూలత

ఎన్‌హెచ్ 65 విస్తరణ పనులకు నవంబర్‌లో టెండర్ ప్రక్రియ పూర్తి

హైదరాబాద్, అక్టోబర్ 13 (మనం న్యూస్): తెలంగాణలో రహదారి ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడం, ప్రజల ప్రయాణ సమయాన్ని తగ్గించడం, మెరుగైన రహదారులు,రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రానికి అవసరమైన కీలక రహదారులు, వంతెనలు, ఎలివేటెడ్ కారిడార్‌లు,రూప్‌వేలు సహా పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెలంగాణలో రహదారి కనెక్టివిటీని మెరుగుపరిచి, ప్రజల ప్రయాణ కష్టాలను తగ్గించడంతో పాటు రాష్ట్ర ఆర్థిక, పర్యాటక అభివృద్ధికి దోహదపడే పలు ప్రతి పాదనలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించి, పలు ప్రాజెక్టులకు ఆమోదం తెలపడంతో పాటు సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లో వేగంగా విస్తరిస్తున్న ప్రాంతాల్లో ఒకటైన ఎల్‌బీనగర్-హయత్‌నగర్ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం దిశగా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి వార్షిక ప్లాన్ లో చేర్చి కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారు.

తగ్గనున్న దూరం..

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా, వాణిజ్య కార్యకలాపాలకు కీలకమైన హైదరాబాద్- విజయవాడ-మచిలీపట్నం ఎన్ హెచ్ 65 విస్తరణ పనులకు నవంబర్ లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి 2027 జనవరిలో పనులు ప్రారంభిస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు. అలాగే ఎన్‌హెచ్-167కేపై కృష్ణా నదికి సోమశిల వద్ద ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణ శంకుస్థాపనకు సంబంధించిన ప్రతిపాదనకు కేంద్ర మంత్రి అంగీకారం తెలిపారు. ఈ వంతెన ద్వారా తిరుపతి వెళ్లే వారికి సుమారు 80 కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు పర్యాటకం విశేషంగా అభివృద్ధి చెందనుంది. హైదరాబాద్-శ్రీశైలం ఎన్‌హెచ్-765పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి కొత్త డీపీఆర్ సిద్ధం చేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు.తెలంగాణలో పర్యాటక అభివృద్ధికి పర్వతమాల పథకం కింద ఐదు రోప్‌వేల ఏర్పాటుకు, సేతు బంధన్ పథకం కింద మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారు. హైదరాబాద్-అమరావతి గ్రీప్‌ఫీల్ హైవే ప్రతిపాదనపైనా సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో 34 రహదారి పనులకు సీఆర్ఐఎఫ్ నిధులు మంజూరు చేయాలని మంత్రి వెంకట్ రెడ్డి కోరగా గడ్కరీ సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పలు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలన్న ప్రతిపాదనపై కూడా నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. నవంబర్ 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరగనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరగా, కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందిస్తూ హాజరవుతానని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కేంద్ర, రాష్ట్ర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోస్టుమెట్రిక్ విద్యార్థులకు రూ.204.40 కోట్ల భరోసా

(మొదటి పేజీ తరువాయి)

అర్హత ఉన్న విద్యార్థులకు దశలవారీగా స్కాలర్‌షిప్ మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా, స్కాలర్‌షిప్‌ల చెల్లింపులు సకాలంలో జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఏ ఒక్క ఎస్సీ విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందని ఆయన వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్కాలర్‌షిప్ ప్రక్రియలో జాప్యాన్ని తగ్గించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రభుత్వ సహాయం అందేలా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని మంత్రి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.14.68 కోట్లను విడుదల చేసింది. విద్యార్థుల విద్యకు సంబంధించిన ఫీజు బకాయిలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని మంత్రి తెలిపారు. విద్యార్థుల విద్య, సంక్షేమానికి అవసరమైన నిధులను సమకూర్చడంతో పాటు, అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా తెలంగాణ ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు.

కరీంనగర్‌లో సీఎంఆర్ షాపింగ్ మాల్ బాగోతం

(మొదటి పేజీ తరువాయి)

జనాలను ఆకర్షించింది. ఈ ఆశతో నమ్మి వెళ్లిన ఎంతోమంది వినియోగదారులు ఆ మాల్‌లో గంటల తరబడి బట్టలు ఎంపిక చేసుకుని, వేలాది రూపాయలు బిల్లు చెల్లించారు.

మిగిలింది రూపాయి కూపనే!

అంతా షాపింగ్ అయిపోయి.. ఆఫర్ ప్రకారం సిల్వర్ కాయిన్ ఇవ్వాలని కస్టమర్‌లు కౌంటర్ వద్దకు వెళ్తేనే అసలు నాటకం బయటపడింది. చేతిలో వెండి నాణెం పెట్టాల్సింది పోయి.. తూతూమంత్రంగా ఒక 'రూపాయి కూపన్'ను చేతిలో పెట్టి సిబ్బంది చేతులు దులుపుకున్నారు! తాము మోసపోయామని గ్రహించిన కస్టమర్లు ఖంగుతిన్నారు. పండుగ పూట షాపింగ్ చేద్దామని వస్తే.. ఇలా నిలువునా మోసం చేస్తారా అంటూ మాల్ నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.'ఐదు వేలు ఖర్చు పెట్టి షాపింగ్ చేస్తే మాకు చివరికి మిగిలింది రూపాయి కూపనేనా?' అంటూ కస్టమర్లు మాల్ వద్ద మండిపడుతున్నారు. నమ్మించి మోసం చేసే ఇలాంటి వ్యాపార దందాలపై వినియోగదారుల వేదిక స్పందించాలని, మోసపూరిత ఆఫర్‌లతో ప్రజలను దోచుకుంటున్న సీఎంఆర్ మాల్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.వినియోగదారుల ఫిర్యాదు మేరకు పోలీసులు భారతీయ న్యాయ సంహిత 318(4), 115(2), 292(2), 351(2) రీడ్ విత్ 3(5) సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు.

ఎన్ని చేసినా 2029లో మీరు ఓడిపోవడం గ్యారంటీ

రాహుల్ గాంధీకి అమిత్‌షా కౌంటర్

ఢిల్లీ, అక్టోబర్ 13: కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఆ పార్టీ వైఖరిపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికల్లో వరుస ఓటములకు ఇతర అంశాలను నెపం చూపుతూ కాంగ్రెస్ నిరంతరం సాకులు వెతుక్కుంటోందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ఓటములపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం మాని, 2029 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఎదురయ్యే భారీ ఓటమికి సిద్ధంగా ఉండాలని రాహుల్ గాంధీకి అమిత్ షా సూచించారు.

బై పోల్, స్థానిక పోరులో బీజేపీ ప్రభంజనం..

ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన పలు ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలను ఈ సందర్భంగా అమిత్ షా మీడియా వేదికగా ప్రస్తావించారు. బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బోణీ కొట్టలేకపోయిందని, ఒక్క సీటు కూడా గెలవలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఇక కాంగ్రెస్ సిట్టింగ్ సీటైన నగాల్లో బీజేపీ అభ్యర్థి 1,42,000 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించి కాంగ్రెస్ నుంచి ఆ స్థానాన్ని కైవసం చేసుకున్నారని గుర్తు చేశారు. నందిగ్రామ్లో 76 శాతం ఓట్లతో, 1,22,000 పైచిలుకు ఓట్ల భారీ మెజారిటీతో బీజేపీ విజయం సాధించిందని, రెజీ నగర్లో టీఎంసీ నుంచి ఈ సీటును చేజిక్కించుకున్న బీజేపీ అభ్యర్థి 75 వేలకు పైగా ఓట్ల తేడాతో విజయం సాధించారని పేర్కొన్నారు. ఇక పుదుచ్చేరిలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన ఏఐఎన్ఆర్సీ అభ్యర్థి 8,482 ఓట్లతో విజయం సాధించగా, కాంగ్రెస్ కేవలం 22 శాతం ఓట్లకే పరిమితమైందని సెటైర్

ఆమ్రపాలి పిటిషన్‌పై
హైకోర్టు తీర్పు రిజర్వ్

హైదరాబాద్, అక్టోబర్ 13 : ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి దాఖలు చేసిన పిటిష్ను తెలంగాణ హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. ఆమ్రపాలిని తెలంగాణకు బదిలీ చేయడాన్ని కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) సమర్థించింది. ఈ తీర్పుపై హైకోర్టు స్టే విధించింది. ఉన్నత న్యాయస్థానం తీర్పును.. అదే కోర్టులో ఆమ్రపాలి సవాల్ చేశారు. తాజాగా వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆమ్రపాలిని ఏపీ క్యాడర్కు కేటాయించగా.. ఆమెను తెలంగాణ క్యాడర్కు కేటాయించాలంటూ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి క్యాట్లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై క్యాట్ విచారణ చేపట్టి తీర్పు వెలువరించింది. ఆమ్రపాలిని ఏపీకి కేటాయిస్తూ కేంద్రం జారీ చేసిన ప్రొసీడింగ్స్ను రద్దు చేస్తూ ఆమెను తెలంగాణకు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై గతంలో హైకోర్టు స్టే విధించింది.

దసరా, బతుకమ్మ పండుగకు
750 ప్రత్యేక రైళ్లు

3వ వంతు అదనపు ఛార్జీల వసూలు
అవసరమైతే రైళను ఇంకా పెంచుతరు

హైదరాబాద్, మనం ప్రతినిధి : పండుగ సీజన్ దృష్ట్యా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. దసరా, దీపావళి పండుగల సందర్భంగా 750కి పైగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే మార్గాల్లో ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. ఈ వివరాలను దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ఓ శ్రీధర్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. ప్రయాణికుల అవసరాలు, రద్దీకి అనుగుణంగా రైళ్ల సంఖ్యను మరింత పెంచేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన వివరించారు. పండుగల వేళ ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అదనపు టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు, భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల ద్వారా నిఘాను కట్టుదిట్టం చేసినట్లు పేర్కొన్నారు. అయితే, ఈ ప్రత్యేక రైళ్లలో ప్రయాణించే వారు సాధారణ ఛార్జీల కంటే కొంత అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ రైళ్లలో 3వ వంతు మేర అదనపు ఛార్జీని వసూలు చేయనున్నట్లు రైల్వే శాఖ స్పష్టం చేసింది. పండుగలకు సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికులు ఈ మార్పును గమనించి, అందుకు అనుగుణంగా తమ ప్రయాణాల ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

రోడ్ల నిర్మాణంలో వేగం పెంచాలె
నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

హైదరాబాద్,అక్టోబర్13 (మనం న్యూస్): రోడ్ల నిర్మాణానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని, ప్రజా సంక్షేమం, సుపరిపాలన అందించడంలో భాగంగా అధికారులు, యంత్రాంగం మరింత వేగంగా పనిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో 7,448 కిలోమీటర్లకు పైగా హామ్ రోడ్లను నిర్మిస్తున్నామని మంత్రి వెల్లడించారు. మంగళవారం ఖైరతాబాద్‌లో నిర్వహించిన ఇనిస్టిట్యూషనల్ స్ట్రెంతెనింగ్ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నెల్సన్ మండేలా తమకు స్ఫూర్తిదాయక లీడర్ అని మంత్రి పేర్కొంటూ, మహాత్మా గాంధీ కూడా దక్షిణాఫ్రికాలో రైలులో అవమానాలు ఎదుర్కొన్న స్థలాలను తాను ఇటీవల దక్షిణాఫ్రికాలో పర్యటించిన సందర్భంగా సందర్శించినట్లు మంత్రి గుర్తుచేసుకున్నారు. ఆఫ్రికా అంటే కేవలం చీకటి అనుకుంటామని, కానీ అక్కడ కొన్ని పట్టణాలలో రహదారులను ఎంతో అద్భుతంగా నిర్మించుకుంటున్నారని సీతక్క తెలిపారు. ఏ దేశంలోనైనా బయటి ప్రాంతాలతో కనెక్టివిటీ ఉండాలంటే రోడ్లు అత్యంత కీలకమని, రోడ్డు సౌకర్యం లేని గ్రామాలు ఈ దేశంలో ఎన్నో ఉన్నాయని ఆమే ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మనిషి ప్రాణం కాపాడాలన్నా, హాస్పిటల్‌కు వెళ్లాలన్నా, అంబులెన్స్ రావాలన్నా ముందుగా మంచి రోడ్లు ఉండాలని, అలాంటి అత్యంత ప్రాముఖ్యత ఉన్న శాఖలో పనిచేయడం గర్వకారణమని ఆమే అధికారులకు తెలిపారు.

రహదారుల తోనే రాష్ట్రాభివృద్ధి..

గ్రామీణ ప్రాంతాలలో ఉద్యోగులు పనిచేయడానికి ఇష్టపడకపోవడానికి ప్రధాన కారణం అక్కడ రోడ్లు సరిగ్గా లేకపోవడమేనని,అందుకే ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రాష్ట్రాన్ని కలుపుతూ రోడ్ల నిర్మాణాన్ని ఒక్క సంవత్సరంలో పూర్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆమే తెలిపారు. ఏ దేశం లేదా రాష్ట్రం అభివృద్ధి చెందిందనేది అక్కడి రోడ్ల స్థితిగతుల ఆధారంగానే అంచనా వేస్తారని, పరిశ్రమలు రావాలన్నా ముందుగా రవాణా సౌకర్యాలు ఎంత ముఖ్యమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదన్నారు. కాబట్టి, సమయాన్ని దృష్టిలో పెట్టుకొని యుద్ధ ప్రాతిపదికన ఈ కార్యక్రమాలన్నింటిని వేగంగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.గ్రామ పంచాయతీ బిల్డింగ్‌లకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన నేపథ్యంలో వాటితో పాటు ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణాలను కూడా ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేయాలని, వచ్చే నెల19న ఇందిరా గాంధీ జయంతి నాటికి ఆ పనులన్నీ పూర్తయ్యేలా కృషి చేయాలని స్పష్టం చేశారు.

గ్రామం మనకు తల్లి లాంటిది.. అంగన్వాడీ భవనాల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని, ఒకవేళ ఎవరైనా కాంట్రాక్టర్‌లు పనులు చేయమని మొండికేస్తే వెంటనే ఆ పనులను వేరేవారికి కేటాయించాలని, లేదా కాంట్రాక్ట్ రద్దు చేసే దిశగా ఆలోచించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాన్ని దృష్టిలో పెట్టుకొని రోడ్లు వేయాల్సి ఉంటుందని, పనులు ఎక్కువగా ఉండి నిధులు తక్కువగా ఉన్నప్పటికీ బాధ్యతతో పనిచేయాలని మంత్రి సూచించారు.'గ్రామం పిలుస్తుంది.. పట్టణం పొమ్మంటుంది' అంటుంటారని, గ్రామం మనకు తల్లి లాంటిదని, మనం ఎక్కడ ఉన్నా మన సొంతూరిలోనే ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటామని మంత్రి భావోద్వేగంగా అన్నారు.

గతంలో 5, 6 వేల మంది సర్పంచులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎంత వీలైతే అంతగా ప్రజల ఆస్తుల సృష్టి చేసిన సందర్భాలను గుర్తుచేశారు. ఈ పనులన్నీ ప్రజలందరికీ ఒక తృప్తిని ఇచ్చే విధంగా ఉండాలని, ఎక్కడా నాణ్యతలో రాజీ పడకుండా పనులు పూర్తి చేయాలని సీతక్క స్పష్టం చేశారు. భవిష్యత్‌లో ఎప్పుడైనా ఆ దారిలో వెళ్తే 'ఈ రోడ్డు నేనే వేయించాను, ఈ భవనం నేనే కట్టించాను' అనే గొప్ప తృప్తిని ప్రతి అధికారి సాధించాలన్నారు.

సమన్వయం చేసుకొని..

వర్క్ ఏజెన్సీలతో సమన్వయం చేసుకొని వారు తగిన మెషినరీ, ఇతర సామగ్రిని తెచ్చారో లేదో ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు.అక్టోబర్ నుండి జూన్ వరకు క్షేత్రస్థాయిలో ఉండి పనిచేసే కీలకమైన వర్కింగ్ సీజన్ ఇదని, ఈ సమయం వృథా అయితే మళ్లీ రాదని ఆమే అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వ ఆశయాలకు, ఆలోచనలకు అనుగుణంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని మంత్రి కోరారు. అభివృద్ధి అనేది వికేంద్రీకరణ జరగాలని, ప్రజలు ఎక్కడ ఉంటే అక్కడ అభివృద్ధి ఫలాలు అందాలని పేర్కొన్నారు. మనం పల్లెలకు ప్రతినిధులమని, కరోనా సమయంలో పల్లెలే మనలను కాపాడాయని గుర్తుచేశారు. మనది 'ఊరు శాఖ' అని, పట్టణాలకు తీసిపోని రీతిలో పల్లెలను తీర్చిదిద్దాలని, పల్లెలు-పట్టణాలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కుటుంబాలు జీవించడానికి అవసరమైన అన్ని సదుపాయాలను గ్రామాల్లోనే కల్పించాలని, మన నిధుల ద్వారా ఆ లక్ష్యాన్ని సులభంగా సాధించవచ్చని తెలిపారు. అధికారులు అందరూ అంకితభావంతో బాగా పనిచేసి ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిస్తూ.. మంత్రి సీతక్క అందరికీ బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

అప్పడిచ్చిండ్రు? ఇప్పడియ్యాల్సిందే

ఏజెన్సీ కానిస్టేబుల్ పోస్టుల్లో ఎస్‌టీలకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలె
ప్రభుత్వం జారీ చేసిన 2026 పోలీస్ నోటిఫికేషన్‌పై కవిత అభ్యంతరం

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ ఏజెన్సీ ప్రాంతాల్లోని కానిస్టేబుల్ పోస్టులలో షెడ్యూల్ తెగల (ఎస్‌టీ)కు 75 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత డిమాండ్ చేశారు. అయితే, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆమె కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1988లో జారీ చేసిన జీవో 109, తెలంగాణ ఏర్పడిన తర్వాత 2018లో విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ 49 ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లోని కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఎస్‌టీలకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని కవిత పేర్కొన్నారు. అయితే, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల జారీ చేసిన 2026 పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో ఈ నిబంధనను అమలు చేయలేదని ఆమె ఆరోపించారు. దీనివల్ల ఆదివాసీ, గిరిజన యువత కానిస్టేబుల్ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు.

గతంలో 2015, 2018, 2022 సంవత్సరాల్లో విడుదలైన కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లలో ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ, గిరిజన యువతకు 75 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తుచేశారు. కానీ, 2026 నోటిఫికేషన్‌లో ఎందుకు అమలు చేయడం లేదని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ నిర్ణయంతో ఆసిఫాబాద్, నాగర్ కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని గిరిజన యువత 400కు పైగా కానిస్టేబుల్ పోస్టులను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంతో పాటు హోంమంత్రిత్వ శాఖను సైతం పర్యవేక్షిస్తున్న రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, 2026 కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో అవసరమైన సవరణలు చేసి ఆదివాసీ, గిరిజన యువతకు పూర్తి న్యాయం చేయాలని కవిత ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ఉచిత విద్యుత్‌కు ఎసరు?

రైతు డిస్కమ్ ఏర్పాటు చేస్తూ జారీచేసిన జీవో 17 తక్షణమే ఉపసంహరించాలి?
హరీశ్ రావు తీవ్ర అగ్రహం

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కమ్' ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 17పై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను దూరం చేసే కుట్ర అని ఆయన ఆరోపించారు. ఈ జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, ఇతర రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, విద్యుత్ రంగ నిపుణులు, రైతుల అభ్యంతరాలను కాంగ్రెస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని హరీశ్ విమర్శించారు.

'రైతు డిస్కమ్ ఏర్పాటు జీవో జారీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, దుర్మార్గ వైఖరికి నిదర్శనం అని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్ సరఫరాకు పాతరేసి, అన్నదాత మెడకు ఊరేసేందుకేనా ఈ కుట్ర?' అని హరీశ్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. అయితే, ఈ జీవో ప్రకారం 30,60,861 వ్యవసాయ కనెక్షన్లు, 512 ఎత్తిపోతల పథకాలతో పాటు హెచ్ఎండబ్లుఎస్ఎస్‌బీ, మిషన్ భగీరథ కనెక్షన్లు కలిపి మొత్తం 30,62,853 కనెక్షన్లను కొత్త డిస్కమ్‌కు బదిలీ చేస్తున్నారని హరీశ్ రావు తెలిపారు. ఇంత పెద్ద వ్యవస్థను కేవలం 2,000 మంది సిబ్బందితో ఎలా నిర్వహిస్తారని ఆయన ప్రశ్నించారు. కొత్త డిస్కమ్‌కు కేవలం 25 శాతం థర్మల్ విద్యుత్‌ను కేటాయించి, 58 శాతం సౌర, మిగిలింది జల విద్యుత్‌పై ఆధారపడటం అవివేకమన్నారు. సౌర విద్యుత్ పగలు మాత్రమే అందుబాటులో ఉంటుందని, జల విద్యుత్ ఏడాదిలో మూడు, నాలుగు నెలలే లభిస్తుందని గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో రైతులకు 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ ఎలా సాధ్యమవుతుందని సందేహం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడే సంస్థపై అప్పులు, బకాయిల భారం మోపడంపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం కొత్త సంస్థలను ఏర్పాటు చేస్తే రైతుల కరెంట్ కష్టాలు తీరవని, వెంటనే జీవో 17ను వెనక్కి తీసుకుని, ఉచిత విద్యుత్ కొనసాగింపుపై రాతపూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలె

- పండుగ విశిష్టతను ప్రతిబింబించేలా కార్యక్రమాలు
- ఎల్‌నినొ ప్రభావంపై బతుకమ్మ పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి
- పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్

హైదరాబాద్, అక్టోబర్ 13(మనం న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను జిల్లాల్లో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బతుకమ్మ వేడుకల నిర్వహణతో పాటు పర్యాటక అభివృద్ధి ప్రాజెక్ట్‌ల అమలు, నిధుల సమీకరణ, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై పలు కీలక అంశాలను ఆమె సమీక్షించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా పాలనాధికారిణీ డాక్టర్ ప్రియాంక అలా, జిల్లా పర్యాటక శాఖ అధికారి ప్రభాకర్, జిల్లా యువజన క్రీడల అధికారి నందకిషోర్ గోకుల్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాణీ ప్రసాద్ మాట్లాడుతూ.. బతుకమ్మ వేడుకలను గ్రామాలు, పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యంతో ఆరోగ్యకర వాతావరణంలో జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, వేడుకలు జరిగే ప్రదేశాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రవాణా, పార్కింగ్, భద్రత వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆమే అధికారులను ఆదేశించారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సేకరించి విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. పండుగ విశిష్టతను ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించాలని వాణీ ప్రసాద్ పేర్కొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలె..

ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయం, పర్యావరణంపై పడే ప్రభావాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బతుకమ్మ పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని అమే అధికారులకు సూచించారు. నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, నీటిని పొదుపుగా వినియోగించడం వంటి అంశాలు పాటల్లో ప్రతిబింబించేలా బతుకమ్మ పాటల పోటీలను నిర్వహించడంలో కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 56 పర్యాటక అభివృద్ధి ప్రాజెక్ట్ లను జిల్లాలకు బదిలీ చేసినట్లు ఆమే వెల్లడించారు. స్థానిక ఇంజినీరింగ్ శాఖలకు పనుల బాధ్యతలు అప్పగించి, పనుల అమలు, నాణ్యత, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, పూర్తయిన పనుల బిల్లులను వెంటనే పర్యాటక కార్పొరేషన్‌కు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పర్యాటక అభివృద్ధి ప్రాజెక్ట్ లకు అవసరమైన సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు (డీపీఆర్) సిద్ధం చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆమే అధికారులకు సూచించారు. ప్రతి జిల్లాలో సంబంధిత ప్రాజెక్ట్‌ల డీపీఆర్ తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా ఇంజినీరింగ్ శాఖలకు లేదా తగిన సంస్థలకు అప్పగించాలని, ప్రాజెక్ట్ పరిధి, భూమి లభ్యత, నిర్మాణ పనులు, అవసరమైన మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, నిధుల సమీకరణ వంటి అంశాలను డీపీఆర్‌లో స్పష్టంగా పొందుపరచాలన్నారు. కొన్ని జిల్లాల్లో హరిత హోటళ్ల నిర్మాణ పనులు పాక్షికంగా పూర్తయిన నేపథ్యంలో, మిగిలిన పనులను పూర్తి చేసి వాటిని నిర్వహణలోకి తీసుకువచ్చేందుకు పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడిదారుల భాగస్వామ్యాన్ని పరిశీలించాలని వాణీ ప్రసాద్ వెల్లడించారు.

ఉపాధి అవకాశాలు..

ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి, చారిత్రక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి అందాలు, వారసత్వ ప్రదేశాలను కలుపుతూ సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని, స్వదేశ్ దర్శన్ పథకం కింద జిల్లాకు అనువైన ప్రాజెక్ట్ లను గుర్తించి నిధులు సమకూర్చుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్‌లకు తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్, వసతి, భద్రత వంటి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని, స్థానిక కళలు, హస్తకళలు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు, స్థానిక ఆహార సంస్కృతిని పర్యాటకంతో అనుసంధానం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించాలన్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటూ, అవసరమైన చోట ఔట్‌సోర్సింగ్ విధానంలో భద్రతా సిబ్బందిని నియమించే ప్రక్రియను చేపట్టాలని ఆమే అధికారులను ఆదేశించారు.అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా మాట్లాడుతూ.. జిల్లాలో బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడంతో పాటు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వివరించారు. నిర్దేశిత గడువులోగా పర్యాటక ప్రాజెక్ట్ లకు సంబంధించిన డీపీఆర్‌ను సమర్పిస్తామని పాలనాధికారిణీ ప్రియాంక వెల్లడించారు.

స్థానిక వెండర్లకే సరుకుల సరఫరా టెండర్లు ఇవ్వాలె

పీఎంయూ టెండర్లు రద్దు చేయాలి?
కమీషన్ల కోసమే బ్లాక్ లిస్ట్ సంస్థలకు టెండర్ ఇచ్చిండ్రు?
మాజీ మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు సరకుల సరఫరా చేసే విధానంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సరకుల సరఫరా కోసం నూతనంగా ప్రవేశపెట్టిన పీఎంయూ (ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్) టెండర్లను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విధానం స్థానిక చిరు వ్యాపారుల ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆరోపించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో మాదిరిగానే పాఠశాలను ఒక యూనిట్‌గా పరిగణించి, డీపీసీ (జిల్లా కొనుగోలు కమిటీ) ద్వారా స్థానిక వ్యాపారులకే సరఫరా బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశారు. అప్పుడే చిరు వ్యాపారులకు భరోసా ఉంటుందని, విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందుతాయని పేర్కొన్నారు. స్థానిక వ్యాపారులకు అవకాశం ఇవ్వకుండా ఒకే సంస్థకు టెండర్లు అప్పగించడం వెనుక భారీగా కమీషన్ల ప్రయోజనాలు ఉన్నాయని ఆయన విమర్శించారు. 'కేవలం కమీషన్‌ల కోసం కక్కుర్తిపడి, ఇప్పటికే బ్లాక్ లిస్ట్‌లో ఉన్న ఒక సంస్థకు టెండర్లు కట్టబెట్టడం అత్యంత దుర్మార్గమైన చర్య' అని హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకుని, పాత విధానాన్ని మళ్లీ పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవేళ తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోని పక్షంలో, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని ఈ సందర్భంగా రేవంత్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

జీవో 134 భూరీ కుట్ర

- అది ఓ కక్ష సాధింపు.. కేవలం బీఆర్ఎస్ నేతలే లక్ష్యంగా తెచ్చిన జీవో
- సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి భూములపైనా విచారణ జరపాలని డిమాండ్

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 134 రాజ్యాంగ విరుద్ధమని, రాజకీయ కక్ష సాధింపు చర్య అని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా ఆరోపించారు. ఈ అంశంపై అసెంబ్లీలో ఏకపక్షంగా చర్చ జరిగిందని ఆయన విమర్శించారు. ఈ మేరకు మంగళవారం నాడు తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ప్రవీణ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ జీవో రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తోందని, చట్టం ముందు సమానత్వం అనే సూత్రాన్ని ఇది దెబ్బతీస్తోందని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ ఉత్తర్వుల జాబితాలో కేవలం బీఆర్ఎస్ నాయకుల భూములే ఉన్నాయని, ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన కుట్ర అని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర మంత్రులు ముందే ప్రణాళిక వేసుకుని ఈ జీవోను తీసుకొచ్చారని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే సెప్టెంబర్ 7న ఉద్దేశపూర్వకంగానే తమ పార్టీ నేతలను అసెంబ్లీలోకి రాకుండా అడ్డుకున్నారన్నారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం మొదటి రోజునే చర్చలో పాల్గొనకుండా అసాధారణ రీతిలో సస్పెండ్ చేశారని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు సమస్యలపై మాట్లాడేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమైనా, వారికి అవకాశం ఇవ్వలేదని వాపోయారు. భూవివాదాలను పరిశీలించే కమిటీ.. రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు ఇతర కాంగ్రెస్ నేతల భూములపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూకు లేఖ రాసినట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు.

కరెంట్, నీళ్లిచ్చే దమ్ములేదు?

బుల్లెట్ ట్రైన్ల గురించి మాట్లాడుతున్నరు?
రేవంత్ ప్రభుత్వంపై మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఫైర్

హైదరాబాద్, మనం ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా అలైన్‌మెంట్ ఖరారు చేయని బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపట్టడం పూర్తిగా చట్టవిరుద్ధమని ఆమె మండిపడ్డారు. ఈ మేరకు

కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటనను మాజీ మంత్రి సబితా ప్రస్తావిస్తూ.., బుల్లెట్ ట్రైన్ రూట్ మ్యాప్ ఇంకా ఖరారు కాలేదన్నారు. మరి అలాంటప్పుడు బహదూర్ గూడలో పోలీసుల రక్షణతో రైతుల భూములను ఎందుకు తీసుకున్నారని ఆమె ప్రశ్నించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాలను ప్రభుత్వం అనవసరంగా సేకరిస్తోందని, సీఎం రేవంత్ రెడ్డికి ఇంత భూదాహం ఎందుకో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

అధికారంలోకి రాకముందు ఒకలా? ఇప్పుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను పంటలు వేయవద్దని సలహా ఇస్తోందని ఆమె తీవ్రంగా దుయ్యబట్టారు. ఈ దుష్ట కాంగ్రెస్ మూడేళ

అదే ఫ్రేమ్

ఎప్పుడూ నన్నే చూస్తూ
నాతో మాట్లాడుతూ ఉంటుంది
చెప్పాల్సిన మాటలు

రోజు కొన్ని చెబుతూ
చటుక్కున ఫ్రేమ్ లోకి
వెళ్లిపోతుంటారు

ఎందుకిలా అలసిపోరు
ఋతువులు చల్లిపోయే
రేణువులు ఏ దోసిలి నింపేనో

ఏమిటి ఈ కాసింత కాలానికే
ఇన్ని దాగుడు మూతలు
ఎన్ని పాటలు పాడిపోయారో

ఎన్ని పూలు జల్లిపోయారో
అలా మెల్లగా గోడపై నుంచి
చూస్తూ ఉంటారు

వారికి ఇక ఏమి కాదు
ఎండ తీవ్రత లేదు

చలికాటు తెలవదు
వాన పోరు లేదు

ఇల్లంతా తిరిగి
కాస్తా

అలజడి రేపి పోతారు
ఒక రోజు నేను మీలో కలుస్తా

- డా. సుంకర రమేశ్
9492180764

ఎడిట్ పేజీ కోసం మీ
సామాజిక విశ్లేషణలు,
సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు

ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్

మూఢ నమ్మకం కూడా అనారోగ్యమే!

దేశ జనాభాలోని ఎక్కువ శాతం మంది ఏదో ఒక జబ్బుతో బాధపడుతూ ఉండడంతో భారత ఆరోగ్య ముఖ చిత్రం ఏ మాత్రం ఆశాజనకంగా లేదు. అనారోగ్యంతో కునారిల్లుతున్న మానసిక దుర్బలులు ఈ దేశాన్ని పరిపాలిస్తుంటే, బలమైన ఆర్థిక వ్యవస్థ నిర్మించబడుతుందా? అభివృద్ధి లక్ష్యాల్ని అందుకో గలమా? ప్రత్యేకించి గ్రామీణ, పట్టణ పేదల స్థితి ఆందోళన కరంగా ఉందన్నది పాలకులు గ్రహిస్తారా? ఇతర ఎన్నెన్నో కారణాలతో పాటు ఆకలి, పోషకాహార లోపం దేశ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూ ఉందన్న విషయంపై దృష్టి సారిస్తారా? వ్యవసాయం పై దృష్టి పెట్టకుండా పేదరికాన్ని, ఆకలిని, పోషకాహార లోపాన్ని తొలగించడం సాధ్యం కాదు. ఒక అమెరికన్ అధ్యయన సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం పట్టణాల మౌలిక సదుపాయాలకు పెట్టే ఖర్చు కంటే వ్యవసాయ రంగానికి పెట్టే పెట్టుబడులు ఏదురెట్లు తక్కువ. అలాంటప్పుడు పేదరికం ఎలా నిర్మూలించబడుతుంది? కనీసం అందరికీ ఆహారం దొరికే పరిస్థితి కూడా లేదుకదా?

మన ఆర్థిక వేత్తలు, విధాన కర్తలు ఒకవైపు మారెట్ సంస్కరణలు తీసుకురావాలనుకుని, వ్యవసాయ రంగానికి ఒక పద్ధతి ప్రకారం ప్రాధాన్యత తగ్గిస్తూ వస్తున్నారు. కాని, దేశంలో ఆకలి కేకలు లేకుండా చేయాలంటే ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెట్టుబడులు కేటాయించాలి.. లేదా తీసుకురావాలి. నూతన సేద్య విధానాల్ని ఆవిష్కరించాలి. 'సబ్ కా సాథ్ సబ్‌కా వికాస్' అనేది నినాద ప్రాయంగా మిగిలిపోకుండా దానికి వాస్తవ రూపమియ్యా గలిగేది ఒక్క వ్యవసాయ రంగం మాత్రమే. ఆహారం అనేది గ్రామీణ ప్రజలకు సంబంధించింది మాత్రమే కాదు. పట్టణ, నగర ప్రజలకు సంబంధించింది కూడా. అన్నం-రొట్టెలకే కాదు పిజ్జా-బర్గర్లకు కూడా ధాన్యం కావాలి. ఆధార్‌కార్డ్ లేనంత మాత్రాన ఆహారం అందించకుండా ఉండకూడదన్న విషయం ఆధార్‌చట్టం స్పష్టంగానే చెప్పింది.

మధ్యాహ్న భోజన పథకం - ప్రత్యేక పోషకాహార కార్యక్రమం - ఇంటి గ్రేటెడ్ చైల్డ్ డవలప్‌మెంట్ సర్వీసెస్-నేషనల్ ప్లాన్ ఆఫ్ ఏక్షన్ నూట్రిషన్- ప్రజా పంపిణీ వ్యవస్థ - జాతీయ ఆహార భద్రతా చట్టం - జాతీయ ఆరోగ్య మిషన్ వంటి అనేక కార్యక్రమాలు మన ప్రభుత్వం వారు అమలు చేశారు. కానీ, వాటిలో ఏ మాత్రం పురోగతి లేదు. ఆకలి సమస్యను అధిగమించాలంటే దేశంలో అనేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అన్నిటికంటే మొదటిది డబ్బు, దైనందిన కార్యకలాపాలకు అవసరమైన శక్తిని పొందాలంటే కావల్సిన తిండి సమకూర్చుకోవాలి. అందుకు తగినంత డబ్బుండాలి. అయితే పేద ప్రజల్లో ఆదాయమే పెద్ద సమస్య. ఉదాహరణకు వ్యవసాయకూలీలు, భవన నిర్మాణ కార్మికులు, అట్టడుగు వర్గాల ప్రజలు, అనధికారరంగ శ్రామికుల విషయం చూద్దాం. వారికి వారి పనికి తగిన ఆదాయం అందడమేలేదు. మంచి ఆహారం ఎలా సంపాదించుకుంటారు. ఇటీవలి పేదరిక గణాంకాల ప్రకారం దేశ జనాభాలో సుమారు 22 శాతం మంది ఇప్పటికీ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. నోట్ల రద్దు తర్వాత అనధికార రంగ శ్రామికుల ఆదాయం దారుణంగా దెబ్బ తిన్న విషయం అందరికీ తెలిసిందే.

దేశంలో నిరుద్యోగం పెరిగిందని, సామాజిక అసమానత్వం పెచ్చరిల్లిందని అంతర్జాతీయ కార్మిక సంస్థ చేపట్టిన 2017 వరల్డ్ ఎంప్లాయిమెంట్ అండ్ సోషల్ ఔట్‌లుక్ రిపోర్ట్ తెలిపింది. ప్రభుత్వాలు వీటిపై దృష్టి పెట్టడం తక్షణం చేయాల్సిన పని.

సాధారణంగా ఏ మనిషైనా కోరుకునేది మంచి ఆరోగ్యం. ఆరోగ్యంగా బతకడం అవసరం. ముఖ్యంగా మనం ఏదైనా సాధించాలని పట్టుదలగా ప్రయత్నిస్తున్నప్పుడు - జబ్బు బారిన పడితే మన అనారోగ్యం మన లక్ష్యానికి ఆటంకం కలిగిస్తే ఆరోగ్యం విలువ అప్పుడు మరింతగా తెలిసొస్తుంది. మంచి ఆరోగానికి కావల్సినవన్నీ పుట్టినప్పటి నుంచీ అందుబాటులో ఉన్న వాళ్ళు తర్వాత కాలంలో కూడా ఎక్కువ కాలం ఆరోగ్యాన్ని, తమ లక్ష్యాల్ని సులభంగా సాధించుకుంటారు. బతుకుతారు. జీవితంలో అలాంటి సదుపాయాలు లేనివాళ్ళు కారణాలేవైనా వెనకబడిపోతారు. అనార్యోగం వల్ల కలిగే దుష్ప్ర భావాలను వ్యక్తులు అర్థం చేసుకున్నట్లుగానే అంతర్జాతీయ సంస్థలు, జాతీయ ప్రభుత్వా లు కూడా తమతమ ప్రజల అనారోగ్యాల గురించి గుణపాఠాలు నేర్చుకుంటూ ఉండాలి.

ఆకలి, పోషకాహార లోపం ప్రజారోగ్యంపై తీవ్రమైన ప్రభావాల్ని చూపుతున్నాయి. మన దేశంలో ఈ సమస్య తీవ్రతకు సంబంధించిన గణాంకాలు భయం గొలుపు తున్నాయి. ఆహార వ్యవసాయ సంస్థ (THE FOOD AND AGRICULTURAL ORGANIZATION) నివేదిక ప్రకారం 2014-2016 వర్ష కాలంలో ప్రపంచంలో ఆకలితో అలమటించిన వారు పోషకాహార లోపం ఉన్నవారు మన దేశంలోనే ఎక్కువ మంది ఉన్నారని తేలింది. దేశ జనాభాలో 15 శాతం మంది అంటే సుమారు పందొమ్మిదిన్నర కోట్ల మంది తగినంత ఆహారం లేక పోవడం వల్ల తీవ్రమైన బాధలకు గురయ్యారు. అలాగే కొన్ని దుష్ప్రభావాలు పిల్లల్లోనూ కనిపించాయి. 2015-16 సంవత్సరంలో దేశ జనాభా స్థితిగతులపై జాతీయ కుటుంబ ఆరోగ్య అధ్యయనం NFHS&4 గణాంకాల ప్రకారం 6-59 నెలల మధ్య వయసు పిల్లల్లో యాభై ఎనమిది శాతం మంది పొరన్, విటమిన్, ఇతర పోషకాల లోపాల వల్ల రక్త హీనత (ANEMIA)తో బాధపడుతున్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల పిల్లల్లో తక్కువ బరువు వయసుకు తగిన శరీరం ఎదగకపోవడం, శుష్టించి పోవాడం ఎక్కువ గా కనిపిస్తున్నాయని జాతీయ ఆహార సంస సర్వే స్పష్టంచేసింది. దాని ప్రకారం ఐదేళ్ళలోపు పిల్లల్లో ఎదగ కుండా ఉన్న వారిలో 39 శాతం దళిత కుటుంబాలకు చెందిన వాళ్ళయితే 34 శాతం మంది గిరిజన కుటుంబాలకు చెందిన వాళ్ళు. మిగతా జనాభాలోని పిల్లల్లో ఇది వరుసగా 28 శాతం.

నిరుపేదలు మాత్రమే కాదు, మధ్య తరగతి, సంపన్న వర్గాల్లోనూ పోషకాహార లోపం విపరీతంగా కనిపిస్తోంది. అయితే అది ఆకలి వల్లకాదు. ఎక్కువ మొత్తంలో రెడీమేడ్ ఆహార పదార్థాల్ని తీసుకోవడం, కదలికలు లేకుండా, తగిన శారీరక శ్రమ, వ్యాయామం లేకపోవడం వల్ల ఊబకాయం వస్తూఉంది. వారి జీవనశైలిలో లోపాలు త లెత్తు న్నాయి. సమతుల ఆహారం లేక సమతులమైన ఆలోచనా విధానమూ లేక, బద్దకం పెరిగిపోయి, భారమంతా ఏదో ఓ దైవశక్తిపై వేసి, బతుకీడుద్దామనుకునేవారు కూడా ఇందులో ఉంటారు.

తలసరి ఆదాయం తక్కువగా ఉన్న కుటుంబాల, నిరక్షరాస్యతగల కుటుంబాలు, శుభ్రత పట్ల అవగాహనలేని కుటుంబాల పిల్లల్లో పోషకాహార లోపం అధికంగా ఉంది. ఇలాంటి కుటుంబాలు వారికి సామాజిక స్పృహ, వైజ్ఞానిక స్పృహ ఉండడం చాలా అరుదు. వీరు సులభంగా మోసపు.. దొంగ బాబాల.. స్వాముల బోధనలకు ఆకర్షితులవు తారు. కొద్దిపాటి డబ్బు అందించిన ఏ చోటా నాయకుడికైనా జైకొడతారు. దుష్ట శక్తులున్నాయని నమ్ముతుంటారు. క్షుద్ర పూజలు చేస్తుంటారు. వివేకవంతులై ఆలోచించ గలిగే శక్తి లేకపోవడం వల్ల సులభంగా మూఢ నమ్మకాలకు ఆకర్షితులవుతారు. సరైన పోషణ, ఆహారం లేక నీరసించి పోయే శరీరాలకు ఏదో ఒక ఆలంబనా, అసరాగా దైవ విశ్వాసాలు పనిచేస్తాయి. పైగా కుటుంబపరంగా, వంశపారం పర్యంగా వచ్చే, అంధ విశ్వా సాలు వారి మీద ఎక్కువ ప్రభావం చూపుతాయి. అట్లని సరైన ఆహారం తీసుకునే వారంతా అంధ విశ్వాసాలకు దూరంగా ఉంటున్నారా ? అంటే అదీ లేదు.. అందుకు మళ్లీ ఎన్నో కారణాలున్నాయి. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో వారు 'లేని శక్తుల్ని' నమ్ము కోవడం జరుగుతోంది. జనాన్ని మభ్య పెట్టడానికి ధనవంతులు, పాలకులు కూడా లేని శక్తుల్ని నమ్ముతుంటారు. నమ్మినట్లు నటిస్తుంటారు.

చదువుకోగలిగినంత చదువుకుని, తినగలిగినంత తిని, నలుగురికి సహాయ పడే స్థితిలో ఉండి కూడా మూఢ నమ్మకాల చుట్టూ, దైవశక్తి చుట్టూ, మత విశ్వాసాల చుట్టూ ప్రదక్షిణలు చేసే ధనికులు కూడా మన సమాజంలో ఉన్నారు. వారిది వేరే పరిస్థితి. వారికీ ఈ అమాయక అనారోగ్య ప్రజానీకానికి, ఆకలితో అలమటించే జనానికీ పోలికలేదు. పేదరికంలో పీకలలోతు కూరుకుపోయిన వారికి ప్రభుత్వాలు అండగా నిలబడితే, వారిలోంచి చైతన్య వంతమైన యువత తయారవుతుంది. ఏమైనా మనిషి ఆరోగ్యంగా ఉంటేనేకదా ఆరోగ్యకరమైన, హేతుబద్ధమైన ఆలోచనలు వచ్చేది. అందువల్ల ఆకలి కేకలకు, పేదరికానికీ అంధ విశ్వాసాలకూ ఉన్న సంబంధాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

- ప్రొ. దేవరాజు మహారాజు
సుప్రసిద్ధ సాహితీవేత్త, బయాలజీ శాస్త్రవేత్త

వాతావరణాన్ని కుదిపేస్తున్న ఎల్‌నినో!

మనం దేశంలో, ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న వాతావరణ పరిస్థితులు అటు అన్నదాతలను, ఇటు ప్రజలను వేధిస్తున్నాయి. తెలంగాణలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని, సుమారు 19 జిల్లాల్లోని 376 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీని ప్రభావంతో ప్రధాన జలాశయాల్లో నీటిమట్టాలు తగ్గిపోతున్నాయి. కృష్ణా, గోదావరి బేసిన్లలో ప్రవాహాలు తగ్గడంతో ప్రాజెక్టులు, నదులు, సరస్సులు, చెరువులు, కాలువలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. భూగర్భ జలమట్టాలు కూడా మరింత లోతుకు పడిపోతున్నాయి.

ఈ పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న ఉపరితల, భూగర్భ జలాలను పొదుపుగా వినియోగించడం, వృథాను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత. అరకొర వర్షాలతో వానకు వానకు మధ్య ఏర్పడే దీర్ఘ విరామాన్ని 'డ్రై స్పెల్' అంటారు. ఇలాంటి పరిస్థితులు సుమారు 327 మండలాల్లో ఏర్పడినట్లు తెలుస్తోంది. దీని ప్రభావంతో సాగు విస్తీర్ణం తగ్గడమే కాకుండా, సాగుచేసిన కొద్దిపాటి పంటలు కూడా నీరు లేక ఎండిపోతుండటంతో అన్నదాతల ఆశలు ఆవిరవుతున్నాయి.

ఈ పరిస్థితిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం కరువు ప్రభావాన్ని అంచనా వేసి, కేంద్ర సహకారం కోరేందుకు చర్యలు చేపట్టడం అభినందనీయం. కరువు పరిస్థితులపై సమగ్ర నివేదిక రూపొందించేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి, కేంద్రం నుంచి ఆర్థిక సహాయం కోరాలని నిర్ణయించడం సరైన అడుగు. అయితే, కరువు ప్రభావాన్ని అధిగమించేందుకు క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు తక్షణమే ప్రారంభించాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం రైతు సమస్య మాత్రమే కాదు. తాగునీరు, సాగునీరు, విద్యుత్, ఆహార భద్రత, ప్రజారోగ్యం, పశుసంవర్ధక రంగం, గ్రామీణ ఆర్థిక

వ్యవస్థతో ముడిపడిన సమగ్ర సంక్షోభం. అందువల్ల ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో సమన్వయ చర్యలు చేపట్టాలి.

ప్రకృతి వైపరీత్యాల మధ్య అన్నదాతకు భరోసా ఎక్కడ? కష్టకాలంలో రైతుకు అండగా నిలబడటం ప్రభుత్వాల బాధ్యత. కరువు పరిస్థితులను కేవలం గణాంకాలుగా కాకుండా రైతు కుటుంబాల జీవన సమస్యగా చూడాలి. కరువు ప్రభావిత మండలాల్లో పంట నష్టాన్ని వెంటనే శాస్త్రీయంగా అంచనా వేయాలి. పంట బీమా పరిహారం, ఇన్పుట్ సబ్సిడీ, రుణాల పునర్వ్యవస్థీకరణ, అవసరమైన చోట రుణ చెల్లింపులకు వెసులుబాటు కల్పించాలి.

కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రానికి అండగా నిలవాలి. కరువు ప్రభావిత ప్రాంతాలకు తగిన ఆర్థిక సహాయం, పంటల నష్టానికి పరిహారం, రైతులకు మద్దతు, పంటలకు కనీస మద్దతు ధరపై కొనుగోలు భరోసా కల్పించాలి. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించేందుకు అవసరమైన నిధులను సకాలంలో విడుదల చేయాలి. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కనీస బాధ్యత. వర్షాభావం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా జలాశయాలు, చెరువులు, కుంటలు, బోర్లలోని నీటి నిల్వలపై ప్రభుత్వం మండలాల వారీగా ముందస్తు అంచనా వేయాలి. అదే సమయంలో సాగు నీటి వినియోగంలో శాస్త్రీయ ప్రణాళిక అవసరం. అందుబాటులో ఉన్న నీటిని పంటల ప్రాధాన్యత ఆధారంగా వినియోగించాలి. చెరువుల పూడిక తీత, కాలువల మరమ్మతులు, వర్షపు నీటిసంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు సంబంధించిన చర్యలను వేగవంతం చేయాలి. నీటి చుక్కను కాపాడితే రేపటి బతుకును కాపాడినట్లే.

వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, ఉక్కపోత ఎక్కువ కావడం వంటి పరిస్థితులు ప్రజారోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, అత్యవసర వైద్య సేవలను అందుబాటులో ఉంచాలి. వర్షాభావం కారణంగా విద్యుత్ వినియోగం కూడా పెరిగే అవకాశం ఉంది. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిన నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని తగిన విద్యుత్ కొనుగోలు, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలి. రైతులు, ప్రజలపై కరువు కరాళనృత్యం చేస్తున్న వేళ తక్షణ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేయడం సమర్థ పాలనకు నిదర్శనం. ప్రభుత్వం ప్రకటించిన కరువు ప్రభావిత మండలాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి.

రైతులకు నష్టపరిహారం ఆలస్యం కాకుండా పారదర్శకంగా అందించాలి. తాగునీటి కొరత ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లు చేయాలి. పశువులకు మేత, నీరు అందించాలి. చెరువులు, కుంటల పరిరక్షణను అత్యవసర కార్యక్రమంగా చేపట్టాలి. వర్షపు నీటిని ఒడిసిపట్టే ప్రతి అవకాశాన్ని వినియోగించాలి.

కరువు ప్రకృతి వైపరీత్యమే కావచ్చు. కానీ దాని ప్రభావాన్ని తగ్గించడం మాత్రం పాలకుల బాధ్యత. ప్రకృతి హెచ్చరికను అవకాశంగా మలిచి, నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టి, రైతు ప్రతి అడుగుకు అండగా నిలిచి, ప్రజల జీవన భద్రతకు పటిష్టమైన పునాది వేయాల్సిన సమయం.

రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రతి రైతు కుటుంబాన్ని కాపాడే చర్యలు ఇప్పుడే ప్రారంభం కావాలి.

- మేకిరి దామోదర్
9573666650

నవదుర్గల ప్రత్యేకతలు

శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గామాత ఆరాధన అనాదిగా ఆచరణలో ఉంది. దేవీ భాగవతం, దుర్గ సప్తశతి, మార్కండేయ పురాణంలో దుర్గాదేవి మహాత్మ్యం వర్ణించ బడింది. 'ప్రథమం శైలపుత్రి ద్వితీయం బ్రహ్మచారిణీ! తృతీయం చంద్రఘంటేతి కూష్మాండేతి చతుర్థకమ్! పంచమం స్కంధ మాతేతి షష్టం కాత్యాయనీతి చ! సప్తమం కాలరాత్రీతి మహా గౌరీతి చాష్టకమ్! నవమం సిద్ధిధాద్రీచ నవర్గా: ప్రకీర్తి తా! ఉక్తాన్యేతాని నామాని బ్రాహ్మణ ఇవ మహాత్మా!! దేవిని తొమ్మిది అవతారాలు తొమ్మిది దినాలు రూపానికి తగిన అలంకారాలతో, ఆ యుధాలతో నవదుర్గలుగా ప్రత్యేకంగా పూజించడం సంప్రదాయం. మొదటి రోజున 'శైలపుత్రి' దుర్గ నంది తన వాహనంగా కుడిచేత త్రిశూలాన్ని, ఎడమచేత పద్మపుష్పాన్ని ధరించి దర్శనమిస్తుంది. రెండోరోజు 'బ్రహ్మచారిణి'గా దేవి తపోదీక్షాధారిణిగా కన్పిస్తుంది. కుడిచేత రుద్రాక్షమాల ఎడమ చేత కమండలం ధరించి ఉంటుంది. మూడో రోజున దేవి 'చంద్రఘంట'గా పిలువ బడుతుంది. ఈ రూపంలో దేవిదశహస్తాలతో, పది చేతులలో పది ఆయుధాలు, సింహవాహనారూఢయై ఉంటుంది. నాలుగో రోజున 'కూష్మాండ దేవి'గా కొలుస్తారు. సృష్టికి మూలమై చిద్విలాసంతో సృజించినది కావున వర్తుల విశ్వాన్ని కూష్మాండం, గుమ్మడికాయతో పోలుస్తూ, కూష్మాండ గా వ్యవహరిస్తారు. ఎనిమిది చేతులు కలిగి ఉండే రూపమైనందున 'అష్టభుజ' అని కూడా అంటారు. ఏడు చేతుల్లోనూ వరుసగా విల్లు, బాణం, పద్మపుష్పం, అమృతకలశం,చక్రం..గద ధరించి, ఎనిమిదో చేతిలో రుద్రాక్షలతో దర్శనమిస్తుంది. ఐదవ రోజున 'స్కందమాత'గా దేవిలోకి ఖ్యాతి చెందింది. కార్తికేయుని తల్లిగా నాలుగు చేతులతో, ఊర్ధ్వ దక్షిణ హస్తంలో స్కంద బాలుడిని, అధోదక్షిణ హస్తంలో పద్మాన్ని, ఊర్ధ్వ వామ హస్తంలో ఆశీర్వాద ముద్రను, అధోదక్షిణ హస్తంలో పద్మాన్ని ధరించి, పద్మంపై కూర్చుని ఉంటుంది. అందుకే పద్మాసనం గా



పిలుస్తారు. సింహవాహనగా దర్శనమిస్తుంది. ఆరవ రూపం 'కాత్యాయని' బంగారు ఛాయతో తళుకులీను తుంటుంది. కుడిచేయి ధైర్యస్థైర్యాలను కలిగించే రీతిలో ఉంటుంది. దిగువనున్న చేయి వరదాయిని ముద్రలో, ఎడమ వైపున ఉన్న పైచేయి ఖడ్గం, దిగువనున్న చేతిలో పద్మం ధరించి, సింహవాహనయై దర్శనమిస్తుంది. దుర్గాదేవి ఏడో రూపం 'కాళరాత్రి' నల్లగా, జుట్టు విరబోసుకుని, మెరుపుల కాంతులు వెదజల్లే గళముతో త్రినేత్రపై, నిప్పులు కక్కుతూ, జ్వాజ్వాల్యమానంగా గార్ధభ వాహనా సీనయై దర్శనమిస్తుంది. కుడివైపు ఒకచేత అభయం కర ముద్ర, మరొక చేత తేజోపరాక్రమ దాయిని ముద్ర, ఎడమ వైపున పైచేత ఛురిక, మరొకచేత కొడవలి ధరించి భయానక కాళరాత్రి రూపేణ చెడుని ధ్వంసించే విలయ కారిణి ఈ మహిమాన్వితమూర్తి. ఎనిమిదవ రూపంలో 'మహాగౌరి' గా ధవళ ధావళ్య విలాసినిగా ప్రశాంతత, పరిశుద్ధతకు ప్రతీకగా, శ్వేతవస్త్రాంబర ధారిణియై నంది వాహనంగా, కుడి వైపు పైచేత సర్వభయ హారిణి దిగువ చేత త్రిశూల ధారిణిగా ముద్రలు కన్పిస్తుంటే, ఎడమ వైపున ఢమరుకం పైచేత, దిగువ చేత వరదాయిని ముద్రతో దేవి దర్శనమిస్తుంది.

తొమ్మిదవదినాన మహర్నవమి నాడు నవదుర్గలలో చివరి రూపమైన 'సిద్ధిధాత్రి'గా దర్శనమిస్తుంది. అష్టసిద్ధులూ ప్రసాదించే సర్వశక్తిమయీ, సాక్షాత్తూ శివుని సాయుజ్యం ప్రసాదించ గలిగిన ఆదిశక్తిగా పూజలందుకునే తల్లి సిద్ధిధాత్రి. కుడివైపు పైచేతి లో ముద్గలం, దిగువ చేతిలో చక్రం, ఎడమవైపు పైచేతిలో పద్మం, దిగువ చేతిలో శంఖం ధరించి, పద్మాసనంలో సింహవాహినిగా దర్శనమి స్తుంది. పార్వతీదేవిని కనకదుర్గగా, అన్నపూర్ణగా, మహాలక్ష్మిగా,గాయత్రిగా,బాలాత్రిపుర సుందరిగా,రాజరాజేశ్వరిగా,మహిషాసురమర్ధినిగా ఆరాధిస్తా రు.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

13 కోట్ల ఓట్లు మాయం.. ఇది సవరణా?

అక్టోబర్ పదో తేదీన దేశ రాజధాని ప్రజాస్వామ్య దేశపు నగరంలా కాక, ముట్టడికి గురైన కోటలా కనిపించింది. కాక్రోచ్ జనతా పార్టీ జంతర్‌మంతర్ వద్ద నిరసన ప్రకటించగానే ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. రైల్వే బోర్డు ఉదయం నాలుగు నుంచి మధ్యాహ్నం రెండు వరకు ఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్లకు రావాల్సిన కొన్ని రైళ్లను రద్దు చేసింది. యువత చేరకుండా ఏభై ఏడు మెట్రో స్టేషన్లను మూసివేయాలని పోలీసులు కోరారు. అంతకుముందు రోజే సుమారు వెయ్యి మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అతిశీ, సామాజిక ఉద్యమకారుడు యోగేంద్రయాదవ్ కూడా ఉన్నారు. ఒక శాంతియుత నిరసనను ఆపడానికి రైళ్లను, మెట్రోలను నిలిపివేసే ప్రభుత్వం ఎవరికి భయపడుతున్నట్లు? 'దేశాన్నంతా మూసేయండి, యువతకు భయపడుతున్నట్లయితే' అని అభిజీత్ దిప్కే విసిరిన సవాలు వ్యంగ్యం కావచ్చు. కానీ అందులోని నిజం పాలకులను చెంపదెబ్బలా తాకాలి.

ఈ ఉద్యమానికి మూలం ఊహాగానం కాదు, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక వెలికితీసిన వాస్తవం. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పదిహేను నెలల వ్యవధిలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి కనీసం పద్నాలుగు సార్లు రాతపూర్వకంగా అభ్యంతరాలు నమోదు చేశారని ఆ పత్రిక రాసింది. తమకు తెలియకుండానే నిర్ణయాలు, ఉత్తర్వులు జారీ అయ్యాయని, ఎన్నికల వివరాల కేంద్రీకరణ, దరఖాస్తు పత్రం ఆరులో మార్పులు నిబంధనల సవరణ లేకుండా చేయడం తగదని వారు పేర్కొన్నట్లు నివేదిక చెబుతోంది. దీనికి ఎన్నికల సంఘం ఇచ్చిన సమాధానం ఏమిటి? అవి భిన్నాభిప్రాయ పత్రాలు కావు, వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే అని. అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవమని. అలా అయితే ఆ అభ్యంతర పత్రాలను బహిరంగపరచడానికి భయమెందుకు? ఎన్నికల కమిషన్ ముగ్గురు సభ్యుల సంస్థ అని, ప్రధాన కమిషనర్ సమానుల్లో మొదటివాడు మాత్రమేనని 1995 నాటి సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేసిందని ప్రతిపక్షం గుర్తు చేస్తోంది. అలాంటప్పుడు ఇద్దరు సభ్యుల అభ్యంతరాలను పక్కనపెట్టి ఒక్కరే ఉత్తర్వులు జారీ చేస్తే అది సంస్థాగత నిర్ణయం ఎలా అవుతుంది? అందుకే కాంగ్రెస్ దీన్ని 'అంతర్గత బుల్డోజర్' అంది. ఇక సంఖ్యల విషయానికి వస్తే, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లెక్క ప్రకారం ముప్పై రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పదమూడు కోట్లకు పైగా పేర్లు ముసాయిదా జాబితాల నుంచి తొలగించారు. బిహార్‌లో ఓటర్ల సంఖ్య 7.89 కోట్ల నుంచి 7.42 కోట్లకు పడిపోయినప్పుడు ప్రధాన కమిషనర్ దాన్ని 'జాబితా శుద్ధీకరణ' అని సంబరపడ్డారు. కానీ మూడో దశలో 6.18 కోట్ల పేర్లు తొలగించి, మరో 5.43 కోట్ల మందిని 'అనుమానాస్పదులు'గా గుర్తించి నోటీసులు ఇచ్చారని కాంగ్రెస్ చెబుతోంది. కాక్రోచ్

జనతా పార్టీ నాయకుడు దీప్కే ఒక లెక్క చెప్పారు. గత లోక్‌సభ ఎన్నికల్లో అధికార కూటమికి, ప్రతిపక్షాలకు మధ్య తేడా సుమారు రెండు శాతమైతే, తొలగించిన పేర్లు ఓటర్లలో పదమూడు, పద్నాలుగు శాతం ఉన్నాయి. మమతా బెనర్జీ పోటీ చేసిన భవానీపూర్‌లోనే యాభై వేల పైచిలుకు పేర్లు పోయాయని ఆయన అన్నారు.కానీ వాటిని నిరూపించాల్సిన బాధ్యత ఆరోపణ చేసినవారిది మాత్రమే కాదు. కోట్ల ఓట్లు తొలగించిన సంస్థ, ప్రతి తొలగింపుకూ కారణం చెప్పి, బాధితులకు ఆ పేర్లు బహిరంగ జాబితాలో చూపించగలగాలి.

ఇదే ప్రభుత్వం ఇంతకు ముందు ఏం చేసిందో గుర్తు చేసుకోవాలి. వైద్యప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం సామాజిక మాధ్యమం ద్వారా బయటకు రావడంతో పరీక్షల మధ్యకాలంలో డజనుకు పైగా విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారు. ముప్పై ఆరు రోజుల యువజన ఉద్యమం, పాతిక రోజులకు పైగా సోనమ్ వాంగ్చుక్ నిరాహార దీక్ష తర్వాత జూలై ఇరవై ఐదున విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఆ వెంటనే నిరసన ప్రదేశంలో నిలిపివేసిన ఇంటర్నెట్‌ను ప్రభుత్వం పునరుద్ధరించింది. అంటే ఇంటర్నెట్ నిలిపివేత శాంతిభద్రతల కోసం కాదు.. ఒత్తిడి పెంచే సాధనం మాత్రమేనని ప్రభుత్వమే రుజువు చేసింది. జూలై ఇరవై మూడున ఎనిమిది గంటల పాటు నిరసన స్థలానికి కిలో మీటరన్నర పరిధిలో అంతర్జాలాన్ని కట్ చేసినప్పుడు, డిజిటల్ చెల్లింపులపై ఆధారపడే సామాన్యులు కూడా ఇబ్బంది పడ్డారు. ఆరు సంవత్సరాల పాటు ప్రపంచంలోనే అత్యధికంగా ఇంటర్నెట్ నిలిపివేసిన దేశంగా భారత్ నిలిచిందని ఇంటర్నెట్ స్వేచ్ఛ సంస్థలు గుర్తు చేస్తున్నాయి. ఈ రికార్డు గర్వకారణం కాదు

బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్

బతుకమ్మ వేడుకల ఫొటోలు, వీడియోలతో విస్తృత ప్రచారం కల్పించాలి

జగిత్యాల అక్టోబర్ 13 (మనం ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో బతుకమ్మ వేడుకల నిర్వహణతో పాటు పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, నిధుల సమీకరణ, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ మాట్లాడుతూ, బతుకమ్మ వేడుకలు గ్రామాలు, పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వేడుకలు జరిగే ప్రదేశాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రవాణా, పార్కింగ్, భద్రత వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను విస్తృతంగా సేకరించి, ప్రచారం చేయాలని కలెక్టర్లకు సూచించారు. బతుకమ్మ పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ప్రజలకు చేరువయ్యే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

బతుకమ్మ పాటల ద్వారా సూపర్ ఎల్నినోపై అవగాహన కల్పించాలి

ప్రస్తుత సూపర్ ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయం, పర్యావరణంపై ప్రభావాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎ. వాణీ ప్రసాద్ సూచించారు. బతుకమ్మ పాటల పోటీలను నిర్వహించి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, నీటిని పొదుపుగా వినియోగించడం వంటి అంశాలు పాటల్లో ప్రతిబింబించేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణమైన సందేశాలతో పాటలు రూపొందించేలా ప్రజలను, మహిళా సంఘాలను, యువతను ప్రోత్సహించాలని తెలిపారు. బతుకమ్మ వేడుకలను సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించే వేదికగా కూడా వినియోగించుకోవాలని సూచించారు.

పర్యాటక అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 56 పర్యాటక అభివృద్ధి

ప్రాజెక్టులను జిల్లాలకు బదిలీ చేసినట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఇందులో నాగర్కర్నూల్ జిల్లాకు 20, ఖమ్మం జిల్లాకు 12, జగిత్యాల జిల్లాకు 2 ప్రాజెక్టులను అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులను సంబంధిత స్థానిక ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో చేపట్టి, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలకు బదిలీ చేసిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల వివరాలను పరిశీలించి, వాటి పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్థానిక ఇంజినీరింగ్ శాఖలకు పనుల బాధ్యతలు అప్పగించి, పనుల అమలు, నాణ్యత, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే సంబంధిత బిల్లులను పర్యాటక కార్పొరేషన్కు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రెండు వారాల్లోగా డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించాలి

పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) సిద్ధం చేసేందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. అవసరమైన చోట కన్సల్టెన్సీ సహకారం కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి జిల్లాలో సంబంధిత ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా ఇంజినీరింగ్ శాఖలకు లేదా తగిన సంస్థలకు అప్పగించాలని ఆదేశించారు. ప్రాజెక్టు పరిధి, భూమి లభ్యత, నిర్మాణ పనులు, అవసరమైన మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, నిధుల సమీకరణ, అమలు గడువు వంటి అంశాలను డీపీఆర్లో స్పష్టంగా పొందుపరచాలని సూచించారు.

హరిత హోటళ్ల పూర్తికి పీపీపీ విధానంలో చర్యలు

కొన్ని జిల్లాల్లో హరిత హోటళ్ల నిర్మాణ పనులు పాక్షికంగా పూర్తయిన నేపథ్యంలో, మిగిలిన పనులను పూర్తి చేసి వాటిని నిర్వహణలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఎ. వాణీ ప్రసాద్ తెలిపారు. ప్రైవేట్ పెట్టుబడిదారుల సహకారంతో నిర్మాణ పనులను పూర్తి చేసి, నిర్దిష్ట కాలం పాటు నిర్వహణ బాధ్యతలను వారికి అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. జిల్లాలలో ఇటువంటి ప్రాజెక్టులకు ఆసక్తి చూపే ప్రైవేట్ పెట్టుబడిదారులు ఉంటే, జిల్లా స్థాయిలో వారిని గుర్తించి ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకోవాలని సూచించారు.

నిధుల వనరులను పరిశీలించి పర్యాటక ప్రణాళిక రూపొందించాలి

ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి, సమగ్ర ప్రణాళికతో పాటు ఆకర్షణీయమైన ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి అందాలు, వారసత్వ ప్రదేశాలను గుర్తించి, వాటి అభివృద్ధికి అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, అమలు విధానం, పర్యాటకుల సౌకర్యాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు. పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం, ప్రైవేట్ పెట్టుబడులు వంటి అన్ని అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. ముఖ్యంగా స్వదేశ్ దర్శన్ పర్యాటక అభివృద్ధి కార్యక్రమం కింద జిల్లాకు అనువైన ప్రాజెక్టులను గుర్తించి, నిధులు సమకూర్చుకునేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్, వసతి, సమాచార బోర్డులు, భద్రత వంటి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్థానిక కళలు, హస్తకళలు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు, స్థానిక ఆహార సంస్కృతిని పర్యాటకంతో అనుసంధానం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించాలన్నారు.

ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా సిబ్బందిని నియమించాలి

రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎ. వాణీ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు జిల్లాలకు పంపిన పర్యాటక ప్రాంతాల జాబితాను పరిశీలించి, అవసరమైన ప్రాంతాల్లో ఔట్సోర్సింగ్ విధానంలో భద్రతా సిబ్బందిని నియమించే చర్యలు జిల్లా స్థాయిలో చేపట్టాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు సురక్షిత వాతావరణం కల్పించడంతో పాటు, సంబంధిత శాఖల సమన్వయంతో పర్యాటక సౌకర్యాలను మెరుగుపరచాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అధికారులతో మాట్లాడుతూ,ఈ జిల్లాలో బతుకమ్మ పండుగకు అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని ఆదేశాలు జారీ చేశారు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ డివిజన్ అధికారులు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

మంథనిలో అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథనిఅక్టోబర్-13(మనం న్యూస్)ః మంథని ప్రాంతంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంథనిలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు, మంథని-రామగుండం రహదారిపై హెలిప్యాడ్ నిర్మాణ పనులు,సమీకృత డివిజన్ కార్యాలయాల భవనం,నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అనంతరం రామగిరి మండలంలోని పన్నూరు క్రాస్ రోడ్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గోదావరి పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి,మరో 10 రోజుల్లోగా కాంక్రీట్ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.రోడ్డు నిర్మాణానికి సంబంధించిన డిజైన్లను నాలుగు రోజుల్లోగా ఖరారు చేయాలని సూచించారు. అవసరమైన నిర్మాణ సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవడంతో పాటు,రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న చెట్లు,పొదలను తొలగించే పనులను వేగవంతం చేయాలని తెలిపారు.పనుల పురోగతికి ఆటంకంగా ఉన్న సమస్యలను ఆర్డీఓ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని పుష్కర ఘాట్ వద్ద నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు.రహదారి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేస్తూ,పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారి నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. మంథని-రామగుండం రహదారిపై ఉన్న హెలిప్యాడ్ను గోదావరి పుష్కరాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి,అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు.రామగిరి మండలంలోని పన్నూరు క్రాస్ రోడ్ వద్ద జరుగుతున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్,మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ,ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.మంథనిలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన పనులను పరిశీలించిన కలెక్టర్,నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు.ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అవసరమైన సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.సమీకృత డివిజన్ కార్యాలయాల భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, మార్చి 2027నాటికి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్పష్టం చేశారు.నిర్మాణ పనులకు అవసరమైన అదనపు నిధుల ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ,నిర్దేశిత గడువులోగా భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మంథని మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, ఇప్పటికే అధిక శాతం పనులు పూర్తయ్యాయని,మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించేందుకు వీలుగా భవనాన్ని వీలైనంత త్వరగా సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ఆర్ అండ్ బి ఈఈ భావ్ సింగ్, ఆర్డీవో సురేష్,మున్సిపల్ కమిషనర్ మనోహర్, సంబంధిత శాఖల అధికారులు,ఇంజినీరింగ్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు

జిల్లాలో ఈ ఏడాది 79 అట్రాసిటీ కేసులు నమోదు

బాధితులకు రూ.6.90 కోట్ల పరిహారం చెల్లింపు

గ్రామస్థాయిలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహణకు చర్యలు తీసుకోవాలి

జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహణ

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల, అక్టోబర్ 13: (మనం న్యూస్): ఎస్సీ, ఎస్టీల పై అఘాయిత్యాల నిరోధక చట్టం అమలులో భాగంగా బాధితులకు సత్వర న్యాయం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాల నిరోధక చట్టం (సవరణ)-2015, పౌర హక్కుల పరిరక్షణ చట్టం-1955 అమలుపై జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం మంగళవారం జగిత్యాల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లోని కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 79 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 20 కేసులు నిరూపితమయ్యాయని, మిగిలిన కేసులు న్యాయస్థానాల పరిధిలో ఉన్నాయని వివరించారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో కలెక్టరేట్ స్థాయిలో ఎలాంటి ప్రతిపాదనలు పెండింగ్లో లేవని తెలిపారు. జిల్లాలో మొత్తం రూ.7.60 కోట్ల పరిహారానికి గాను ఇప్పటివరకు రూ.6.90 కోట్లు చెల్లించామని, మిగిలిన రూ.79 లక్షలు ప్రభుత్వ స్థాయిలో పెండింగ్లో ఉన్నాయని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి నెల గ్రామస్థాయిలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను సకాలంలో పొందేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆలస్యంగా ధ్రువీకరణ పత్రాలు పొందడం వల్ల ఎదురయ్యే సమస్యలను వివరించాలని తెలిపారు. పెండింగ్లో ఉన్న కుల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులకు సకాలంలో పత్రాలు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ బాధితులకు న్యాయం అందించడంలో ఎలాంటి జాప్యం జరగకుండా చట్ట నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన బాధితులు ఫిర్యాదుల కోసం పోలీస్ స్టేషన్లకు వచ్చినప్పుడు అధికారులు సానుకూలంగా స్పందించి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు.

దసరా పండుగ సందర్భంగా జిల్లాలోని ప్రతి గ్రామ అభివృద్ధి కమిటీకి కుల వివక్షకు తావులేకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. పండుగ వేడుకల్లో అన్ని వర్గాల ప్రజలు సమానంగా పాల్గొనేలా చూడాలని, గ్రామాల్లో సామాజిక సామరస్యం, సమానత్వ భావనలను పెంపొందించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతి, బాధితులకు పరిహారం చెల్లింపు, కుల ధ్రువీకరణ పత్రాల జారీ, పౌర హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ చట్టాల అమలును పకడ్బందీగా పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఆర్డీవోలు, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న

మాజీ మున్సిపల్ చైర్పర్సన్

అమ్మవారి కరుణాకటాక్షాలు భక్తులందరిపై ఉండాలని ప్రార్థన

జగిత్యాల, అక్టోబర్ 13(మనం న్యూస్)ః జగిత్యాల పట్టణంలోని గొల్లపల్లి రోడ్డులో ఉన్న ఎల్లమ్మ గుడి వద్ద వనదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వనదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులందరికీ అమ్మవారి ఆశీస్సులు, కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు.దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో వనదుర్గ సభ్యులు మరియు మహిళలు, భగవత్ బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కష్టాలు ఎదురయినా పథకాలు ఆగవు..

రెండున్నరేళ్లలో అనేక సంక్షేమ పథకాలు

విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి

కళ్యాణలక్ష్మి,పంపిణీలో ఎంఎల్ఏ తెల్లం

చర్ల, అక్టోబర్ 13(మనం న్యూస్): ఆర్థికపరమైన కష్టాలు ఎన్ని ఎదురైనా సంక్షేమ పథకాలు ఆగవని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ వెంకటరావు స్పష్టం చేశారు. మంగళవారం చర్ల లోని మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో 36 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. ఏ సంక్షేమ పథకమైన పేదవాడికి చేరాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నామని వెల్లడించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రైతులకు రుణమాఫీ, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, మహిళా సంక్షేమం తో పాటు త్వరలో 14 వేల 83 మందికి స్మార్ట్ కార్డులను మండల వ్యాప్తంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. వీటితో పాటు 926 మంది నూతన లబ్ధిదారులకు ఆసరా పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ ఆవిర్భవించిన ఈ పన్నెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోని రెండున్నరేళ్లలో ఎంతో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తూనే ఇతర సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాపితంగా ఎల్ నినో సమస్య కారణంగా వర్షాలు అనుకున్న స్థాయిలో కురవనందన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న కాలంలో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టి త్రాగునీటి సమస్య ఏర్పడే ప్రమాదం పొంచి ఉందని, దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఈ విషయమై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చర్ల మండలం సత్యనారాయణపురం గ్రామంలో రూ. 11 కోట్ల 50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న తెలంగాణ మోడల్ పాఠశాల జీవో కాపీలను మండల పరిషత్ అధికారి పరిటాల వెంకటరమణకు అందచేసారు. మండలానికి చెందిన ఇద్దరు లబ్దిదారులు నాగమణి, మునేశ్వరావులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేసారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ పరుచూరి రవికుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కనపర్తి ఈదయ్య, సర్పంచ్ లు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాదరావు, డిసిసి ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళీకృష్ణ, పోలిన లంకరాజు తదితరులు పాల్గొన్నారు.

టాస్క్ఫోర్స్ పోలీసుల చాకచక్యంగా దాడి

అక్రమంగా తరలిస్తున్న పశువుల అడ్డగింత

11 ఆవులు,రెండు వాహనాలు స్వాధీనం

మంథని, అక్టోబర్ 13(మనం న్యూస్)ః ములుగు జిల్లా నుంచి కరీంనగర్ ఉమ్మడి జిల్లా పట్టణానికి అక్రమంగా పశువులను తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ టాస్క్ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో పోలీస్ ప్రత్యేక బృందం మంథని మండలం ఆక్కేపల్లి గ్రామం వద్ద వాహనాల తనిఖీలు చేపట్టింది.ఈ సందర్భంగా పశువులను అక్రమంగా తరలిస్తున్న మహేంద్ర క్యాంపర్ టీఎస్05యుఏ 8482,అశోక్ లేలాండ్ బడా దోస్త్ టిఎస్ 30టి5371అనే రెండు వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. వాహనాల్లో తరలిస్తున్న 11 ఆవులను, ఒక మహీంద్రా క్యాంపర్,ఒక అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.ములుగు జిల్లా మల్లంపల్లి నుండి ఇస్లావత్ సోమన్న(45)ఎండి తుఫాన్(37)అనే నిందితుల నుండి ఆవులను, వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పశువులు, వాహనాలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం మంథని పోలీస్ స్టేషన్

ఎస్సైచ్ఓకు అప్పగించారు.అక్రమ కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని,చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

లలిత కళా తోరణంలో వైభవంగా నాలుగో రోజు బతుకమ్మ వేడుకలు

● నానబియ్యం బతుకమ్మతో కళకళలాడిన పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాద్,అక్టోబర్13(మనం న్యూస్)ః తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలు నగరంలో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పబ్లిక్ గార్డెన్స్లోని లలిత కళా తోరణంలో మంగళవారం నాలుగో రోజు వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో తెలంగాణ పుష్ప, సాంస్కృతిక వారసత్వం ప్రతిబింబించింది.

నానబియ్యం బతుకమ్మ వేడుకను పురస్కరించుకుని వేలాదిగా తరలివచ్చిన మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి పూలతో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మలతో ప్రాంగణానికి వన్నెతెచ్చారు. అష్టదిగ్బంధనం చేసినట్లుగా అమర్చిన గౌరమ్మను కొలుస్తూ, సాంస్కృతిక బతుకమ్మ పాటలకు లయబద్ధంగా చప్పట్లు కొడుతూ సామూహిక నత్యాలు చేశారు. ఈ కార్యక్రమం కేవలం పూల పండుగగానే కాకుండా భక్తి, ప్రకతి ప్రేమ, సామాజిక ఐక్యతకు సజీవ రూపంగా నిలిచింది.ఈ ఉత్సవాల్లో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్మెంట్,నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు సైతం ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. వేడుకల్లో భాగమై బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలతో కలిసి నత్యం చేయడంతో ప్రాంగణమంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించి ప్రోత్సహించడంతో పాటు, భవితరాలకు వాటి గొప్పతనాన్ని చాటిచెప్పే లక్ష్యంతో పర్యాటక శాఖ ఈ నెల 10 నుంచి 18 వరకు ఈ రాష్ట్రస్థాయి వేడుకలను నిర్వహిస్తోంది.

అన్నపూర్ణాదేవిగా సాక్షాత్కరించిన అమ్మవారు

వర్గల్ అక్టోబర్ 13 (మనం న్యూస్): సిరులిచ్చే కల్పవల్లి అన్నపూర్ణాదేవిగా భక్తులకు సాక్షాత్కరించిన శ్రీ విద్యా సరస్వతి అమ్మవారు. వర్గల్ విద్యాధరక్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర్ శర్మ సిద్ధాంతి కనుసంధానంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు మంగళవారం విద్యా సరస్వతి అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుండి భారీగా తరలివచ్చి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లను చేసి తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాలను అందజేశారు.

హరీశ్‌రావు మామకు హైకోర్టులో ఊరట

- హనుమంతరావుకు చేందిన 3.22 ఎకరాల భూమిపై చర్యలు వద్దు?.. హైకోర్టు ఆదేశం
- ఆయనను భూమి నుంచి ఖాళీ చేయించవద్దు?.. అంటూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- కౌంటర్ దాఖలు చేయాలని రెవెన్యూ అధికారులకు నోటీసులు
- తదుపరి విచారణను నవంబర్ 2కి వాయిదా వేసిన న్యాయస్థానం

హైదరాబాద్, మనం ప్రతినిధి : మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మామ ఎం. హనుమంతరావు భూవివాదం కేసులో తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని అధికారులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు సిద్దిపేట జిల్లా కొండపాక మండలం వెలికట్ట గ్రామంలోని 3.22 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోనుందంటూ సెప్టెంబర్ 29న రెవెన్యూ అధికారులు హనుమంతరావుకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఈ నోటీసును సవాలు చేస్తూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ పిటిషనర్‌ను ఆ భూమి నుంచి ఖాళీ చేయించడం వంటి చర్యలకు పాల్పడవద్దని ఆదేశించారు. పిటిషనర్ తరఫున సీనియర్ కౌన్సిల్ జె. రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ... తన క్లయింట్ చాలా ఏళ్ల క్రితమే పట్టాదారు నుంచి చట్టబద్ధంగా భూమిని కొనుగోలు చేశారని కోర్టుకు తెలిపారు. ముందుగానే ఒక నిర్ణయానికి వచ్చి ఈ నోటీసులు జారీ చేశారని వాదించారు. వాదనలు విన్న న్యాయస్థానం, ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. అనంతరం కేసు తదుపరి విచారణను నవంబర్ 2వ తేదీకి వాయిదా వేసింది.

దసరా నుండి పత్తి కొనుగోలు

సిద్దిపేట, అక్టోబర్13 (మనం ప్రతినిధి): దసరా నుండి జిల్లాలో పత్తి కొనుగోలు ప్రారంభించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ లక్ష్మీ కిరణ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 9 వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో 23 సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేయాలని అన్నారు. పత్తి కొనుగోలు చేసేందుకు అన్ని కొనుగోలు కేంద్రాలలో తూకం యంత్రాలు, తేమ శాతం యంత్రాలు సిద్ధం చేయాలన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద త్రాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి దుర్గం ప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా తూనికలు మరియు కొలతల అధికారి శివరంజని, సిసిఐ అధికారులు, పత్తి మిల్లర్లు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలి
- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్

సంగారెడ్డి, అక్టోబర్ 13 మనం న్యూస్ ప్రతినిధి : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అన్ని జిల్లాలలో ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బతుకమ్మ పాటల ద్వారా సూపర్ ఎల్నినో ప్రభావాలు, వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, జిల్లాల్లో చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సంబంధిత శాఖల అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ బతుకమ్మ వేడుకల నిర్వహణ, పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల పురోగతి, నిధుల సమీకరణ, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై ఆమె సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వాణీ ప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో బతుకమ్మ వేడుకలను ఆహ్లాదకరమైన వాతావరణంలో, ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బతుకమ్మ పాటల పోటీలు నిర్వహించడంతో పాటు, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు ఉపయోగపడే సందేశాలతో పాటలు రూపొందించేలా మహిళా సంఘాలు, యువతను ప్రోత్సహించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 56 పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను సంబంధిత జిల్లాలకు బదిలీ చేసినట్లు ఆమె తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రాజెక్టుల వివరాలను పరిశీలించి, వాటి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి, సమగ్ర ప్రణాళిక రూపొందించడంతో పాటు సంబంధిత వివరాలతో ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లాలో బతుకమ్మ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వేడుకలు జరిగే ప్రదేశాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, భద్రత తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అడిషనల్ కలెక్టర్ పాండు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు, డీఆర్డీఓ ఏపీడీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

దసరా వేడుకలకు రండి..

మాజీ మంత్రి హరీష్ రావుకు ఆహ్వానం

ఆహ్వాన పత్రిక అందజేసిన మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

అమీన్‌పూర్, అక్టోబర్ 13(మనం న్యూస్) : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమీన్పూర్ గ్రామ పరిధిలోని పెద్ద చెరువు వద్ద నిర్వహించనున్న రావణ దహన మహోత్సవానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.

అమీన్పూర్ గ్రామ పెద్దలతో కలిసి పాండురంగారెడ్డి మాజీ మంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. పెద్ద చెరువు ప్రాంగణంలో తమ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించనున్న దసరా సంబరాలు, రావణ దహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. ఇందుకు మాజీ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ కౌన్సిలర్ కృష్ణ, బిజిలి రాజు, అమీన్పూర్ గ్రామ పెద్దలు, ఉపేందర్ రెడ్డి, కొల్లూరి గోపాల్, కొల్లూరు యాదగిరి, హరినాథ్, స్థానిక ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల ప్రతిభను పెంపొందిస్తున్నప్రాజెక్టు సిద్ధి

అభినందించిన సీపీ రష్మి పెరుమాళ్

సిద్దిపేట, అక్టోబర్ 13 (మనం ప్రతినిధి): 'ప్రాజెక్ట్ సిద్ధి' తో ఏఆర్ (ఆరమ్డ్ రిజర్వ్) కానిస్టేబుళ్లు సరికొత్త నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నారని సిద్దిపేట సిపి రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు. విధి నిర్వహణకే పరిమితం కాకుండా తమలో దాగివున్న ప్రతిభను వెలికితీసేలా ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది అన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఏఆర్ కానిస్టేబుళ్లు క్రీడలు అథ్లెటిక్, కరాటే, యోగా వంటి శారీరక దృఢత్వ శిక్షణలతో పాటు టైలరింగ్, ఆటోమొబైల్ మెకానిక్స్ వంటి సాంకేతిక, వృత్తి విద్యా నైపుణ్యాలలో శిక్షణ పొందుతున్నారన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాలపై నిర్వహించిన ఫీడ్బ్యాక్ సమీక్షలో సిబ్బంది నుంచి విశేష స్పందన లభించిందనీ శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, అంకితభావంతో పనిచేసిన కానిస్టేబుళ్లను గుర్తించి సీపీ అభినందించారు. ప్రతిభ చూపిన సిబ్బందికి ప్రశంసా పూర్వకంగా వాచ్లు, రన్నింగ్ షూస్ అందజేశారు. పోలీస్ సిబ్బంది సమగ్ర వికాసానికి, మానసిక ఉల్లాసానికి ప్రాజెక్ట్ సిద్ధి ఎంతగానో ఉపయోగపడుతోందని కానిస్టేబుళ్లు హర్షం వ్యక్తం చేశారు. పోలీస్ సిబ్బంది శారీరక దృఢత్వంతో పాటు ఆధునిక, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడం చాలా అవసరం. కాగా 'ప్రాజెక్ట్ సిద్ధి' ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది అని రష్మి పెరుమాళ్ తెలిపారు.

నాగిరెడ్డిపల్లిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

ములుగు, అక్టోబర్ 13(మనంన్యూస్): ములుగు మండలం నాగిరెడ్డిపల్లి లో రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలందరూ ఒకే రకమైన చీరలు ధరించి సంబరాలకు ప్రత్యేక వన్నె తెచ్చారు. బొడ్డెమ్మ, బతుకమ్మ పాటలతో గ్రామం మార్మోగింది. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు కొక్కొండ సాయి రెడ్డి మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేకగా నిలిచే బతుకమ్మ సంబరాలు నాగిరెడ్డిపల్లిలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రోటరీ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మహిళల్లో మరింత జోష్ నింపేందుకు బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించామని, అదే స్థాయిలో మహిళలందరూ పాల్గొని విజయవంతం చేయడం బాగుందన్నారు. ఈ సందర్భంగా వైపై సౌండ్ బాక్స్ సిస్టంను గ్రామానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ రోటరీ 3150 చైర్మన్లు కొడాలి చంటి, కర్ణాకర్ రెడ్డి, జగదీశ్వర్, పూర్వ అధ్యక్షులు కడపల్ల నర్సింహా రెడ్డి, సందుగారి నరసింహారెడ్డి, సర్పంచ్ కవిత నర్సింలు, ఉప సర్పంచ్ పుష్పలత, రోటరీ సభ్యులు సంతోష్ కుమార్, నరేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మహేష్ గౌడ్, నర్సింలు గౌడ్, బాల్ రెడ్డి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ దొంగల అరెస్టు

నిందితులిద్దరూ తుమ్కి ఖాల్సా గ్రామస్తులు

పలు ఆలయాల్లో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నా నిందితులు

సిద్దిపేట అక్టోబర్ 13 (మనం ప్రతినిధి): ఆలయాల్లోని విగ్రహాలను, హుండీలోని కానుకలను దొంగలించిన ప్రబుద్ధులు పోలీసులకు పట్టుబడ్డారు. గజ్వేల్, మర్కుక్ మండలాల్లోని పలు ఆలయాల్లో దొంగతనాలు చేసిన ఇద్దరు నిందితులు వర్గల్ మండలం తుమ్కి ఖాల్సా గ్రామానికి చెందినవారుగా గుర్తించారు. మర్కుక్ మండలం పాముల పర్తి గ్రామంలో జరిగిన ఆలయ దొంగతనం కేసు దర్యాప్తులో వీరి బాగోతం బయటపడింది. వర్గల్ మండలం తుమ్కి ఖాల్సా గ్రామానికి చెందిన నర్సగళ్ల నాగరాజు, అదే గ్రామానికి చెందిన మొగుళ్ల మల్లేశం ఈనెల 3వ తేదీన పాములపర్తి గ్రామంలోని ఎల్లమ్మ , పోచమ్మ ఆలయాల్లో దొంగతనం చేశారు. 6 వ తేదీన గజ్వేల్ పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో దొంగతనం చేయగా 9 వ తేదీన పాములపర్తి గ్రామంలోని దుర్గమ్మ ఆలయంలో దొంగతనం చేసినట్లు విచారణలో నిందితులు తెలిపినట్లు గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు తెలిపారు. నిందితుల నుండి శ్రీ ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహం, వెండి కిరీటాలు, రోల్ గోల్ పుస్తెలతాడు, ఆయిల్, ద్విచక్ర వాహనం, దొంగతనంకు ఉపయోగించే పనిముట్లను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరు పరిచారు. కేసు చేదించడంలో కీలక పాత్ర పోషించిన గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు, ఎస్సై యూనుస్ అహ్మద్ అలీలను సిపి రష్మీ పెరుమాళ్ అభినందించారు.

పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఆదర్శ్ రెడ్డి

ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం

రామచంద్రాపురం, అక్టోబర్ 13 (మనం న్యూస్): రామచంద్రాపురం డివిజన్లోని రాయసముద్రం చెరువు సమీపంలోని పోచమ్మ ఆలయంలో నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాల్లో పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి ఆదర్శ్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని, అన్నదాన కార్యక్రమంలో భక్తులకు సేవలందించారు.

ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జగన్నాధ్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, పరమేశ్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, మురళి, జానీ, కుమార్, అప్పల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రం అభివృద్ధి

- మౌళిక సదుపాయాల అభివృద్ధి, పురావస్తు కట్టడాల పరిరక్షణ, పునరుద్ధరణ పనులకు రూ.4.26 కోట్లు మంజూరు
- కంబోడియా, థాయ్లాండ్, భారత దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులతో అంతర్జాతీయ స్థాయిలో బౌద్ధ క్షేత్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌పై చర్చలు
- ఖమ్మం కలెక్టర్ దివాకర టీఎస్

నేలకొండపల్లి, అక్టోబర్ 13(మనం న్యూస్): జిల్లాలోని నేలకొండపల్లిలో చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాచీన బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి బౌద్ధ వారసత్వ, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. మంగళవారం నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రంలో పర్యాటక మౌళిక సదుపాయాల అభివృద్ధి, పురావస్తు కట్టడాల పరిరక్షణ, పునరుద్ధరణపై బౌద్ధ బిక్షువుల సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేలకొండపల్లి తెలంగాణలోని అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన బౌద్ధ పురావస్తు క్షేత్రాలలో ఒకటని తెలిపారు. నేలకొండపల్లి లో గతంలో నిర్వహించిన పురావస్తు తవ్వకాల ద్వారా మహాస్తూపం, బౌద్ధ విహారాలు, సమావేశ మందిరాలు, ఇతర బౌద్ధ నిర్మాణాల అవశేషాలు వెలుగులోకి వచ్చాయన్నారు. పురావస్తు ఆధారాలు ప్రాచీన కాలంలో నేలకొండపల్లి ప్రముఖ బౌద్ధ ధార్మిక, సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లిందని తెలియజేస్తున్నాయని, ఈ చారిత్రక సంపదను శాస్త్రీయ పద్ధతిలో పరిరక్షిస్తూ భావితరాలకు అందించడంతోపాటు, దేశవిదేశాల బౌద్ధ యాత్రికులను ఆకర్షించేలా అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యమని అన్నారు. కేవలం ఒక భవన నిర్మాణంలా కాకుండా, బౌద్ధ ధర్మానికి గౌరవ సూచకంగా, దానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల ప్రణాళిక రూపకల్పన కోసం పురావస్తు శాఖ సంచాలకులతో పాటు బౌద్ధ ధర్మ నిపుణులు శివనాగిరెడ్డి, రిటైర్డ్ ఐపీఎస్ ఉపేంద్ర రెడ్డి, బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్ లక్ష్మయ్య తదితరులతో కూడిన ఒక నిపుణుల కమిటీ (కోర్ టీమ్)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బౌద్ధ భిక్షువులు, నిపుణుల సలహాలు, సూచనలను స్వీకరించి వచ్చే ఒకటిన్నర సంవత్సరంలో నేలకొండపల్లిని అత్యున్నత బౌద్ధ క్షేత్రంగా మారుస్తామని తెలిపారు. జీవనంలో మోహాలు, మాయలు వీడి, గౌతమ బుద్ధుడు చూపిన మధ్యే మార్గం ద్వారానే మానవజాతి శాంతియుతంగా జీవించగలదని, అటువంటి మహోన్నత జ్ఞానాన్ని అందించిన బౌద్ధ ధర్మ ప్రచారానికి ఈ ప్రాజెక్ట్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. భారతదేశంలోని ప్రముఖ బౌద్ధ క్షేత్రాల సరసన నేలకొండపల్లిని టాప్-3 లో నిలపడమే లక్ష్యమని అన్నారు.

కార్యక్రమంలో హెరిటేజ్ తెలంగాణ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి మాట్లాడుతూ తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ. 2.50 కోట్ల వ్యయంతో నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రంలో పర్యాటకులకు అవసరమైన మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో భాగంగా పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు, సందర్శకుల మార్గాలు, ప్రాంగణ సుందరీకరణ, సమాచార సూచికలు, ఇతర మౌళిక సదుపాయాలను కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వనున్నారన్నారు.

రూ. 1.76 కోట్ల వ్యయంతో ప్రాచీన బౌద్ధ విహారాలు, సమావేశ మందిరం, సంబంధిత పురావస్తు నిర్మాణాల పరిరక్షణ, పునరుద్ధరణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులకు అవసరమైన నిధులను వైటీపీఎస్, తెలంగాణ జెన్ కో ద్వారా సమకూర్చుకున్నట్లు అన్నారు. పురావస్తు కట్టడాల అసలు నిర్మాణ స్వరూపం, చారిత్రక ప్రాధాన్యత, నిర్మాణ శైలి దెబ్బతినకుండా శాస్త్రీయ పరిరక్షణ పద్ధతుల్లో పనులను చేపట్టనున్నట్లు హెరిటేజ్ తెలంగాణ శాఖ డైరెక్టర్ తెలిపారు.

కంబోడియా, థాయ్లాండ్, భారత దేశానికి చెందిన బౌద్ధ భిక్షువులు నేలకొండపల్లి ప్రాచీన బౌద్ధ క్షేత్రం చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతపై ఆసక్తి వ్యక్తం చేశారు. నేలకొండపల్లి మహాస్తూపం, బౌద్ధ విహారాలు, ఇతర ప్రాచీన నిర్మాణాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి, ప్రపంచ బౌద్ధ యాత్రికులను ఆకర్షించే ప్రముఖ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించే అంశంపై కార్యక్రమంలో ప్రత్యేక చర్చలు జరిగాయి. ఇట్టి చర్చల్లో హెరిటేజ్ తెలంగాణ శాఖ, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు, పురావస్తు, పర్యాటక రంగ నిపుణులు, కన్సల్టెంట్లతోపాటు ఆంజనేయ రెడ్డి, మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సలహాలు, సూచనలతో మాస్టర్ ప్లాన్ రూపొందించే అంశంపై చర్చించారు. ఈ ప్రణాళికలో మహాస్తూపం పరిరక్షణ, బౌద్ధ విహారాల పునరుద్ధరణ, పర్యాటక మౌళిక సదుపాయాల అభివృద్ధి, సందర్శకుల నిర్వహణ, ప్రాంగణ సుందరీకరణ, బౌద్ధ చరిత్రను వివరించే సమాచార వ్యవస్థ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ కమీషనర్ పివి. శ్రీనివాస రావు, హెరిటేజ్ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ పి.నాగరాజు, ఎన్.నరసింగ్, సూపరింటెండెంట్ ఎ. రాజు, జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి రవి బాబు, నేలకొండపల్లి మండల తహసీల్దార్ రాంప్రసాద్, సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, హైదరాబాద్ ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డా. ఇ. శివనాగిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, అంతర్జాతీయ బౌద్ధ భిక్షువులు, పురావస్తు పరిశోధకులు, పర్యాటక రంగ ప్రతినిధులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

వనజీవి రామయ్య సేవలు చిరస్మరణీయం

- ఆయన సతీమణికి బీజేవైఎం ఘన సత్కారం

ఖమ్మం, అక్టోబర్ 13(మనం న్యూస్): ప్రతి మొక్కనూ తన కుటుంబ సభ్యుడిగా భావించి, తుదిశ్వాస వరకు పర్యావరణ పరిరక్షణకే అంకితమైన మహోన్నత వ్యక్తి పద్మశ్రీ స్వర్గీయ వనజీవి రామయ్య అని పలువురు నాయకులు కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుపరిపాలనను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం రెడ్డిపల్లి గ్రామంలో బీజేవైఎం ఆధ్వర్యంలో రామయ్య సతీమణి జానమ్మను ఘనంగా సత్కరించారు. రామయ్య ఇంటికి వెళ్లిన నాయకులు, ఆయన ప్రకృతికి చేసిన అపారమైన సేవలను స్మరించుకుంటూ జానమ్మను శాలువాతో సన్మానించి గౌరవించారు.ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ.. వనజీవి రామయ్య ఆశయ సాధన కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆయన స్ఫూర్తితో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా బీజేవైఎం ఆధ్వర్యంలో విస్తృతంగా మొక్కలు నాటి, పచ్చదనం పెంపొందించేందుకు విశేష కృషి చేస్తామని జానమ్మకు వివరించి, ఆ మేరకు సంకల్పం తీసుకున్నారు.

గోదావరి పుష్కరాల ఏర్పాట్లను పూర్తి చేయాలి

- ఆలయ అభివృద్ధి, పుష్కర ఘాట్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
- వైకుంఠధామానికి ప్రత్యామ్నాయ రహదారి, ప్రహరీ నిర్మాణానికి ప్రణాళికలు
- పనులను పరిశీలించిన కలెక్టర్ అంకిత్

భద్రాచలం, అక్టోబర్ 13(మనం న్యూస్): గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులు, పుష్కర ఘాట్ల నిర్మాణం, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పనులను భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లతో కలిసి వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి చేరుకున్న కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకోగా, అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. దర్శనానంతరం ఆలయ ఉత్తర ద్వారం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్, ఆలయ ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో చేపట్టిన నిర్మాణాల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్లాబ్ నిర్మాణం, రక్షణ గోడలు, మట్టి నింపే పనులు తదితర నిర్మాణాలను పరిశీలించి, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆలయం నుంచి గోదావరి స్నాన ఘాట్లకు వెళ్లే రహదారిని పరిశీలించిన కలెక్టర్, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రహదారిని విస్తరించాలని ఆదేశించారు. ప్రస్తుతం సుమారు 25 అడుగుల వెడల్పు ఉన్న రహదారిని మరో ఐదు అడుగులు విస్తరించి 30 అడుగులకు పెంచే ప్రతిపాదనపై చర్చించారు. రహదారికి ఇరువైపులా ఉన్న నిర్మాణాలు, మెట్లు, ఇతర అడ్డంకులను పరిశీలించి అవసరమైన చోట్ల మార్కింగ్ చేయాలని సూచించారు. భూమికి సంబంధించిన అంశాలు, అనుమతులు, నిధులు, బిల్లుల పరిష్కారంలో రోడ్లు భవనాలు, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వైకుంఠధామానికి వెళ్లే మార్గాన్ని పరిశీలించిన కలెక్టర్, పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఉన్న రహదారికి ప్రత్యామ్నాయంగా మరో మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు చేపట్టడంతో పాటు వైకుంఠధామం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు.

సారపాక బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్

సారపాక బ్రిడ్జి ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించి చారు. ఐటీసీ నుంచి భద్రాచలం బ్రిడ్జి వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారి సుందరీకరణకు చేపట్టాల్సిన చర్యలపై ఐటీసీ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో చర్చించారు. రహదారి మధ్య విభాజకాలు, ఇరువైపులా పుష్పించే మొక్కలు నాటేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని, బౌగెన్విల్లియా వంటి రంగురంగుల పూల మొక్కలతో సుందరీకరణ చేపట్టాలని సూచించారు. ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రణాళికను వారం రోజుల్లో సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గత మార్చి నెలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన అనంతరం ఇరిగేషన్, దేవాదాయ, రోడ్లు భవనాల శాఖల ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి, పుష్కరాల ఏర్పాట్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆలయ ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో చేపట్టిన పనులను వేగవంతం చేసి ముక్కోటి ఏకాదశి, శ్రీరామనవమి, గోదావరి పుష్కరాల గడువులోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం సుమారు 200 మంది కార్మికులతో పాటు 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు లైటింగ్ సౌకర్యంతో పనులు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

గోదావరి పుష్కరాల కోసం ఉత్తర, దక్షిణ వైపులా మంజూరైన 270 మీటర్లు, 230 మీటర్ల పొడవైన ఘాట్ల నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. భద్రాచలం ప్రధాన పుష్కర క్షేత్రంగా ఉన్నందున భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కిన్నెరసాని పరిసరాలు, అశ్వాపురం, దుమ్ముగూడెం, పర్ణశాల తదితర ప్రాంతాల్లోనూ అవసరమైన సౌకర్యాలు కల్పించే అంశాన్ని ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. భక్తుల వసతి కోసం డార్మిటరీ హాల్ నిర్మాణంతో పాటు గోశాల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. గోదావరి పుష్కరాలకు సమయం తక్కువగా ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మార్చిలో జరిగే శ్రీరామనవమి ఉత్సవాలతో పాటు జూన్ 27 నుంచి జూలై 7 వరకు నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత దృష్ట్యా తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, మరుగుదొడ్లు, రవాణా, పోలీసు భద్రత, వైద్య సేవలు తదితర మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పించాలని తెలిపారు. నవంబర్, డిసెంబర్ నెలల నుంచే అవసరమైన ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా ప్రారంభించి, పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఆర్ అండ్ బి ఈ ఈ నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, తహసిల్దార్ రవికుమార్ ఇన్చార్జి ఎంపీడీవో జిపిఈఓ శ్రీనివాస్ దేవస్థానం డి ఈ రవీందర్‌రావు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలో అవినీతిపై విచారణ జరపాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి
- గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా
- అవినీతి ఆరోపణలపై విచారణ చేసి రిపోర్ట్ అందివ్వాలి
- డిపిఓని ఆదేశించిన సబ్ కలెక్టర్

భద్రాచలం, అక్టోబర్ 13 (మనం న్యూస్): భద్రాచలం గ్రామపంచాయతీలో నెలకొన్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, భద్రాచలం కీర్తి ప్రతిష్టలను పెంచే విధంగా స్వచ్ఛ పాలన అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. గ్రామపంచాయతీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని ప్లే కార్డులను ప్రదర్శించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనులలో అనేక అక్రమాలు జరిగాయి అని ఇటీవల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఉన్నత అధికారులు స్పందించాలని కోరారు. పంచాయతీలో నెలకొంటున్న అక్రమాల ప్రభావంతో పాలకవర్గంలో సైతం చీలికలు వస్తున్నాయని అన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు కూడా అనేక ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు సైతం బలంగా వినిపిస్తున్నాయని, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను ప్రజలకు తెలియజేయాలని నరసారెడ్డి డిమాండ్ చేశారు.

డెవలప్మెంట్ చార్జీలను రద్దు చేయాలి: పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి

డెవలప్మెంట్ చార్జీల పేరుతో ఇంటి యజమానుల వద్ద వసూలు చేస్తున్న చార్జీలను వెంటనే రద్దు చేయాలని సిపిఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి డిమాండ్ చేశారు. నూతనంగా నిర్మించుకున్న ప్రతి ఇంటికి ప్రభుత్వం అధికారులే సర్వే చేసి ఇంటి పనులు వేయాలని కోరారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం డెవలప్మెంట్ చార్జీలు వచ్చి వస్తువులు చేయాల్సిన వస్తే అది కేవలం వాణిజ్య భవనాలకు మాత్రమే పరిమితం కావాలని, నివాస గృహాలకు డెవలప్మెంట్ చార్జీలను వసూలు చేయడం వెంటనే ఉపసంహరించుకోవాలని స్వామి డిమాండ్ చేశారు. అదేవిధంగా నివాస ప్రాంతాలలో పెరిగిపోతున్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. భద్రాచల పట్టణ ప్రజలకు ఇసుకను అందుబాటులో తీసుకొచ్చే విధంగా గ్రామపంచాయతీ తీర్మానం చేయాలని గడ్డం స్వామి కోరారు.

ఆరోపణలపై సమగ్ర రిపోర్టు అందించాలి: డిపిఓకి సబ్ కలెక్టర్ ఆదేశం

గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా అనంతరం సిపిఐఎం శ్రేణులు ప్రదర్శనగా వెళ్లి సబ్ కలెక్టర్ మృణాలు శ్రేష్ఠ వినతి పత్రం అందించారు. సిపిఐఎం ఇచ్చిన వినతి పత్రంపై స్పందించిన సబ్ కలెక్టర్ సమగ్ర రిపోర్టును తనకి ఇవ్వాలని డిపిఓకి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ గ్రామపంచాయతీపై జరుగుతున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి పారదర్శకమైన పాలన అందించేందుకు కృషి చేస్తామని సిపిఎం శ్రేణులకు హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ అవినీతి అక్రమాలపై సబ్ కలెక్టర్ విచారణకు ఆదేశించడం పట్ల సిపిఐఎం శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు సున్నం గంగ,భద్రాచలం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి సీతాలక్ష్మి,, 20వ వార్డు సభ్యురాలు ఇర్సా అనసూయ, పట్టణ కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి, నకిరికంటి నాగరాజు, కొలగాని రమేష్,జీవనజ్యోతి, ఎస్ అజయ్ కుమార్, నకిరేకంటి నాగరాజు, కుంజ శ్రీనివాస్, చుక్క మాధవరావు, సండ్ర భూపేంద్ర, డి కనక శ్రీ, అంబోజిరత్నం,సీనియర్ నాయకులు బీబీజీ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

సిహెచ్‌సి సేవలు అమోఘం

- సౌకర్యాలు లేనిచోట మెరుగైన వైద్యం
- వైద్యులు, సిబ్బంది అభినందనీయులు
- ఐటిడిఏ ద్వారా 5 . 60 లక్షల పరికరాలు అందించడం సంతోషకరం
- భద్రాచలం ఎంఎల్ఏ డాక్టర్ వెంకట్రావు

చర్ల, అక్టోబర్ 13 (మనం న్యూస్): ఎటువంటి కనీస మౌలిక సదుపాయం లేని ఏజెన్సీ ప్రాంతంలోని చర్లలో సామాజిక ఆరోగ్య కేంద్రం రోగులకు చేస్తున్న సేవలు అమోఘమని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావు ప్రశంసించారు. ఐ టి డి ఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ చొరవతో వైద్యశాలకు రూ 5 లక్షల 60 వేల రూపాయల విలువ చేసే రెండు ఏసీలు, ఆక్సిజన్ సిలిండర్లు, ఆపరేషన్ థియేటర్ కు అవసరమైన పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం వైద్యశాల ఆవరణలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రవిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. వైద్యశాలకు ఐటీడీఏ ద్వారా పరికరాలను అందజేసిన ప్రాజెక్టు అధికారి రాహుల్ అభినందనీయులని అన్నారు. జిల్లా కలెక్టర్, డి సి హెచ్ ఎస్ రవిబాబు, ఐటిడిఏ పిఓల కృషి ఫలితంగా వైద్యశాల రోజురోజుకు అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ఇక్కడి వైద్యులు, సిబ్బంది పనితీరు ప్రశంసనీయమని గత నెలలో 46 కాన్పులు వైద్యశాలలో జరగడం ఇక్కడి వైద్యుల పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంత వైద్యరంగ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తోందని వెల్లడించారు. ఏజెన్సీలో గతంలో పేదలకు వైద్యం అందరిని ద్రాక్షగా మిగిలేదని పేర్కొన్నారు. 2000 సంవత్సరంలో తాను చర్లలో ప్రైవేట్ ప్రాక్టీస్ చేసిన సందర్భంలో ఆపరేషన్లను నిర్వహించి అసాధ్యం అనుకున్న దాన్ని సుసాధ్యం చేశామని గతాన్ని గుర్తు చేసుకున్నారు. నాడు పాయిజన్ కేసులను చాలెంజింగ్ తీసుకొని అనేకమందికి ప్రాణం పోసామని వెల్లడించారు. మారుమూల ప్రాంతంలోని రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. భద్రాచలంలోని ఏరియా వైద్యశాలకు ధీటుగా చర్లలో కూడా వైద్య సేవలను అందిస్తున్నట్లు వివరించారు. 9 మంది అర్హులైన వైద్యులను ఇక్కడ నియమించి పేదలకు వైద్య సేవలను అందిస్తున్నామని తెలిపారు. విద్యా, వైద్యంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. రూ 11 కోట్ల వ్యయంతో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందని, మరోవైపు డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేసి 26 మంది రోగులకు అను ప్రతినిత్యం సేవలను అందిస్తున్నామన్నారు. పంటచేలలో అధిక పురుగు మందులు వాడకం కారణంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు ప్రబలుతున్నాయని, మందులు వాడకాన్ని రైతులు తగ్గించాలని సూచించారు. గతంలో ప్రభుత్వం వైద్యంపై నమ్మకం ఉండేది కాదని నేడు ఆ పరిస్థితి మారిందన్నారు. ప్రజలు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచుకొని భరోసాతో వైద్యశాలకు తరలివస్తున్నారని ఇందుకు చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రమే నిదర్శనమని పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రంలో సికిల్ సెల్ ఎనీమియా రోగుల సౌకర్యార్థం త్వరలో బ్లడ్ బ్యాంకు ను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా విశేష సేవలందిస్తున్న గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రావణి, ఎనస్తీసియా డాక్టర్ కృష్ణ ప్రసాద్, రేడియాలజిస్ట్ డాక్టర్ ప్రియాంకలను ఎమ్మెల్యే, పివోలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్ట్ అదికారి బి రాహుల్, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సాయివర్ధన్, పిఏసిఎస్ చైర్మన్ పరుచూరి రవికుమార్, సర్పంచ్ పూజారి సౌమ్రాజ్యం, ఆత్మకమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడివో ఈదయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్య అన్నదాన సత్రం ఆస్తులపై వివాదం..

లెక్కలు బహిర్గతం చేయాలని ఆర్యవైశ్య వర్గాల డిమాండ్

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 13 (మనం న్యూస్): జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య అన్నదాన సత్రం ఆస్తుల నిర్వహణ, సొసైటీ రిజిస్ట్రేషన్ అంశాలపై వివాదం నెలకొంది. సత్రం ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయంటూ కొందరు ఆర్యవైశ్య ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్వీకులు సమాజ సేవ కోసం అందించిన ఆస్తులను పారదర్శకంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం, 1933లో కపిలవాయి సీతయ్య స్థలదానంతో, తూనుగుంట్ల వెంకట్రామయ్య శ్రేష్టి వ్యవస్థాపక బాధ్యతలతో సత్రం ఏర్పాటైంది. సుమారు 1,850 గజాల విస్తీర్ణం కలిగిన స్థలానికి సంబంధించి ఎండోమెంట్స్ గెజిట్ ప్రచురణ, సొసైటీ రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు. సత్రం ఆదాయ, వ్యయాల వివరాలను బహిర్గతం చేయడంతో పాటు గతంలో విరాళాలు అందించిన దాతల పేర్లతో ఏర్పాటు చేసిన శిలాఫలకాలు, జ్ఞాపికల ప్రస్తుత పరిస్థితిని వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. శాశ్వత, జీవిత, సాధారణ సభ్యుల జాబితాను ప్రకటించాలని కోరుతున్నారు. ఈ అంశాలపై సత్రం నిర్వాహకులు సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి సమాధానాలు ఇవ్వాలని ఆర్యవైశ్య ప్రతినిధులు సూచిస్తున్నారు. అవసరమైన రికార్డులను పరిశీలించి ఆస్తుల నిర్వహణపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. అయితే, ఆస్తుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలపై స్వతంత్ర నిర్ధారణ కావాల్సి ఉంది. సత్రం నిర్వాహకుల వివరణ అందుబాటులోకి వస్తే వివాదంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ప్రభుత్వ భూముల ఆక్రమణను రెవెన్యూ అధికారులు అడ్డుకోవాలి

- ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే మరో ఉద్యమం తప్పదు
- ఆళ్లపల్లి సర్వే నంబర్ 484లోని భూములను పరిరక్షించాలి
- ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాయం రమేష్

ఆళ్లపల్లి,అక్టోబర్ 13 (మనం న్యూస్): మండల కేంద్రంలోని 484 సర్వే నెంబర్ లోని ప్రభుత్వ భూముల

మనం Manam Mahabubnagar
మహబూబ్ నగర్

భూములను సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి: కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి అక్టోబర్ 13(మనం ప్రతినిధి): భూపాలపల్లి భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం నాడు ఐడీఓసీ కార్యాలయంలో రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో భూముల రీ-సర్వే, 22-ఏ, జి.ఓ. నెం. 59 తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలంలో రెండు గ్రామాలను ఎంపిక చేసి రీ-సర్వే పనులు చేపట్టాలని, ఇందుకోసం రెండు ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు చేసి సమాంతరంగా సర్వే ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. మండల స్థాయిలో తహశీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్, లైసెన్స్డ్ సర్వేయర్, గ్రామ పంచాయతీ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రీ-సర్వే పనులను పర్యవేక్షించాలన్నారు. నిర్దేశిత కార్యాచరణ ప్రణాళిక ప్రకారం సర్వే పనులు సజావుగా జరిగేలా చూడటంతో పాటు, ప్రతిరోజూ పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. 22-ఏ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల్లో ఉన్న ఓపెన్ ప్లాట్లు, ఇళ్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించేటప్పుడు సంబంధిత రికార్డులు, ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా జి.ఓ. నెం. 59 కింద అందిన దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. సింగరేణి భూముల క్రమబద్ధీకరణతో పాటు జి.ఓ. 59 దరఖాస్తుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా తదుపరి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ వాటి పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ మెమోలు, మార్గదర్శకాలు, నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు సంబంధించిన భూ సమస్యలను సకాలంలో పరిష్కరించడంతో పాటు, చేపట్టిన పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమకుమారి, అన్ని మండలాల తహశీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి శంకుస్థాపనకు గడ్కరీకి ఆహ్వానం

రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయండి

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి కలిసి వినతి అందించిన మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి...

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 14 (మనం బ్యూరో): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య రవాణా అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో పర్యాటకాభివృద్ధికి ఊతమిచ్చేలా కృష్ణా నదిపై నిర్మించనున్న ఐకానిక్ బ్రిడ్జి శంకుస్థాపన కార్యక్రమానికి రావాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆహ్వానించారు. రాష్ట్రానికి అవసరమైన కీలక రహదారులు, వంతెనలు, ఎలివేటెడ్ కారిడార్లు, రోప్‌వేలు సహా పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయి సుదీర్ఘంగా చర్చించారు.

హైబ్రిడ్ బ్రిడ్జితో రెండు రాష్ట్రాల అనుసంధానం బలోపేతం

జాతీయ రహదారి 167కేపై కృష్ణా నదిపై నిర్మించనున్న హైబ్రిడ్ కేబుల్-స్టేయిడ్, సస్పెన్షన్ తరహా ఐకానిక్ వంతెనకు శంకుస్థాపన కార్యక్రమానికి రావాలని కోరగా.. కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా అంగీకారం తెలిపారు. ఈ వంతెన నిర్మాణంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య అంతర్రాష్ట్ర అనుసంధానం మెరుగుపడటంతో పాటు హైదరాబాద్ నుంచి తిరుపతికి మధ్య 80 కి.మీ ప్రయాణ దూరం తగ్గి, సుమారు 3 గంటల ప్రయాణ సమయం తగ్గుతుందని వివరించారు.

సోమశిల ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక శోభ

ఈ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి, ఆర్థిక కార్యకలాపాల విస్తరణకు ఈ వంతెన నిర్మాణం దోహదపడుతుందన్నారు. స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన సోమశిల.. ఆధ్యాత్మిక, పర్యాటక హబ్ గా వృద్ధి చెందని వివరించారు. తెలంగాణలో ఒక మైలురాయిగా నిలవనుందని తెలిపారు. కృష్ణా నది, శ్రీశైలం జలాశయ బ్యాక్వాటర్స్, నల్లమల అటవీ ప్రాంతం మధ్య ఉన్న సోమశిల.. ప్రకృతి పర్యాటకానికి విశేష అవకాశాలున్న ప్రాంతంగా నిలుస్తుందని వివరించారు. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణంతో ఈ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడితే పర్యాటకుల రాక గణనీయంగా పెరుగుతుందన్నారు. బోటింగ్, పర్యాటకాన్ని ప్రోత్సహించడంతోపాటు స్థానికంగా హోటళ్లు, రవాణా, ఆతిథ్య రంగాల్లో ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయని పేర్కొన్నారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతాన్ని సమగ్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు మెరుగైన రహదారి అనుసంధానం కీలకం కానుందని మంత్రులు వివరించారు.

జాతీయ రహదారిగా మార్చండి

రాష్ట్రంలో సుమారు 225 కి.మీ. మేర ప్రతిపాదించిన రహదారి మార్గాన్ని జాతీయ రహదారిగా ప్రకటించి అభివృద్ధి చేయాలని మంత్రులు కోరారు. పుల్లూరు (ఎన్హెచ్-44) నుంచి ఆలంపూర్- జటప్రోలు- పెంట్లవెల్లి - కొల్లాపూర్- లింగాల- అచ్చంపేట- డిండి (ఎన్హెచ్-765) - దేవరకొండ (ఎన్హెచ్-167) - మల్లేపల్లి మీదుగా నల్గొండ (ఎన్హెచ్-565) వరకు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారిగా అప్గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. అందుకు నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారన్నారు. ఈ రహదారి అభివృద్ధితో ఇప్పటికే ఉన్న జాతీయ రహదారులతో అనుసంధానం మెరుగుపడటంతోపాటు ప్రయాణ సమయం, రవాణా వ్యయాలు తగ్గుతాయని వారు వివరించారు. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, వాణిజ్య కార్యకలాపాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్య, వైద్య సేవలను సులభతరం కావడంతోపాటు పర్యాటక ప్రాంతాలకు రాకపోకలు పెరిగేందుకు అవకాశం ఉంటుందని సంపూర్ణంగా వివరించారు.

శ్రీశైలం మార్గంలో ఎలివేటెడ్ కారిడార్కు కొత్త డీపీఆర్

హైదరాబాద్-శ్రీశైలం గ్రీన్-765పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి చేసిన విజ్ఞప్తిపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొత్త డి పి ఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గడ్కరీని కలిసిన వారిలో ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కేంద్ర రోడ్డు రవాణా అదేవిధంగా రహదారుల శాఖ (కొఖిఏ) అధికారులు, రాష్ట్ర అధికారులు ఉన్నారు.

నేడు డిప్యూటీ సీఎం రాక...

డిప్యూటీ సీఎంతో పాటు మంత్రి జూపల్లి పలు అభివృద్ధి పనులపై పర్యటన...

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 14(మనం బ్యూరో): నేడు నాగర్ కర్నూల్ జిల్లాలో పలు అభివృద్ధి పనులు, శంకుస్థాపనల కార్యక్రమానికి బుధవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, అదేవిధంగా మంత్రి జూపల్లి హాజరుకానున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం నాగర్కర్నూల్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు స్థానిక ప్రజలు, రైతులతో ముఖాముఖిగా సమావేశమవుతారు.

ముందుగా నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలో 220/30 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. తదానంతరం అమ్రాబాద్ లో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, పదర మండలం జ్యోతి నాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని రాయలగండి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ గాలి గోపురం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.

అక్కడి నుండి నేరుగా అచ్చంపేట ప్రాంతంలో పలు విద్యుత్ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఇందులో భాగంగా 33/11 కేవీ ఐపీడీఎస్ సబ్‌స్టేషన్ షిఫ్టింగ్, సిద్ధాపూర్లో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం, బల్మూర్ మండలం రామాజిపల్లిలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం, వంగూరు మండలం తిప్పారెడ్డిపల్లిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టునున్నారు.

గాయపడిన గీత కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలి

మోకుదెబ్బ రమేష్ గౌడ్ డిమాండ్

దుగ్గొండి. అక్టోబర్13 మనం ప్రతినిధి: దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామంలో వృత్తి రీత్యా తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవషాత్తు కింద పడి గుండెబోయిన ప్రభాకర్ గౌడ్ గాయపడడం జరిగింది. ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న ప్రభాకర్ గౌడ్ ను గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్‌ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ సోమవారం పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన రాజు ప్రభాకర్ గౌడ్ కు ప్రభుత్వం హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం 25 వేల రూపాయలు,ఎక్స్ గ్రేషియా అందించి ఆదుకోవాలని రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షులు గోపగాని వెంకట్ గౌడ్,రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోడిశాల సదానందం గౌడ్, రాష్ట్ర కార్యదర్శి శీలం వీరన్న గౌడ్,జిల్లా ఉపాధ్యక్షులు కొండి రాము గౌడ్,పట్టణ అధ్యక్షులు తాబేటి శ్రీనివాస్ గౌడ్, చింత రాజు గౌడ్ పాల్గొన్నారు.

జనగణనతోనే అభివృద్ధి ప్రణాళికలకు పునాది

- **డిజిటల్ విధానంలో జనాభా వివరాల సేకరణ**
- **చార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణా తరగతులు ప్రారంభం**
- **నాగర్ కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 13 (మనం బ్యూరో): నాగర్ కర్నూల్ జిల్లా ప్రజల అవసరాలను గుర్తించి, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు జనగణన కీలకమని నాగర్ కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం అన్నారు. జనగణన-2027 నిర్వహణలో భాగంగా మంగళవారం నాగర్కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో చార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు నిర్వహించే రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ దేవ సహాయం ప్రారంభించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ....., జనగణనలో సేకరించే వివరాలు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు, భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు దోహదపడతాయన్నారు. ఈసారి డిజిటల్ విధానంలో మొబైల్ ఫోన్ల ద్వారా జనాభా వివరాలను నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల సంఖ్య, వయస్సు, వృత్తి తదితర వివరాలను నిర్దేశిత ప్రశ్నావళి ప్రకారం సేకరిస్తారని వివరించారు.

జనాభా గణాంకాల ఆధారంగా ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను అంచనా వేయడంతోపాటు విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాల అవసరాలను గుర్తించవచ్చన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికలకు ఈ వివరాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

సమాచార సేకరణలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి, ఎలాంటి తప్పులకు తావులేకుండా వివరాలను నమోదు చేయాలని సూచించారు. వచ్చే ఏడాది జనవరి నుంచి ఫిబ్రవరి 28 వరకు ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి కుటుంబాల వివరాలను సేకరించనున్నట్లు అధికారులు తెలిపారు. జనగణన విధివిధానాలు, డిజిటల్ నమోదు ప్రక్రియ, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెండు రోజుల శిక్షణలో సిబ్బందికి అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జనగణన అధికారులు శివరామకృష్ణ, కె. రిషిత్ రెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిని డి. సుజాత, అదనపు జనగణన అధికారి నరసింహస్వామి, చార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నాటి వివాదంలో 3 పిటిషన్లు డిస్మిస్

డీఎస్సీ 2008 నియామకాలపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు



హైదరాబాద్, మనం ప్రతినిధి : డీఎస్సీ 2008 నియామకాలకు సంబంధించి 3 రిట్ పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఎస్జీటీ పోస్టుల భర్తీలో బీఈడీ, డీఈడీ అభ్యర్థులకు వర్తించే నిబంధనలను ప్రభుత్వం మార్చడంపై కొందరు బీఈడీ అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా జీవో నంబర్ 28, రూల్ 7కు సంబంధించిన మార్పులను సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించారు. మొదట ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారమే ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని వారు కోరారు. రాష్ట్ర విభజన తర్వాత నియామకాలకు సంబంధించిన చర్యలు కొనసాగడం, ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగులు ఇవ్వడం వంటి అంశాల నేపథ్యంలో హైకోర్టు పిటిషనర్ల అభ్యర్థనలను తిరస్కరించింది.

వివాదం ఏంటి?

ఉమ్మడి ఏపీలో చేపట్టిన డీఎస్సీ 2008 ఉపాధ్యాయ నియామకాల వివాదానికి సంబంధించి తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ నియామకాలకు సంబంధించిన న్యాయ వివాదంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉమ్మడి ఏపీ ప్రభుత్వం 2008 డిసెంబర్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 52,655 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా.. వాటిలో 30,558 సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు బీఈడీ, డీఈడీ అర్హతలున్న అభ్యర్థులు పోటీపడే అంశం వివాదానికి ప్రధాన కారణం అయింది. నోటిఫికేషన్ రిలీజ్ అయిన తర్వాత 2009 జనవరి 29వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 28ను జారీ చేసింది. ఈ జీవో నంబర్ 28 ద్వారా ఎస్జీటీ పోస్టుల్లో 30 శాతం పోస్టులను డీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులకు కేటాయిస్తూ.. మిగిలిన 70 శాతం పోస్టులకు బీఈడీ, డీఈడీ అభ్యర్థులు పోటీపడే విధంగా నిబంధనల్లో మార్పులు చేసినట్లు పిటిషనర్లు పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత నియామకాలకు సంబంధించిన నిబంధనలను మార్చడం వల్ల తమకు నష్టం జరిగిందని కొందరు బీఈడీ అభ్యర్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రూల్ 7కు ప్రొవిజన్ జోడించడం.. జీవో నంబర్ 28 ద్వారా తీసుకొచ్చిన మార్పులు న్యాయబద్ధమైనవి కావని వారు వాదించారు. అసలు నోటిఫికేషన్లో పేర్కొన్న నిబంధనల ప్రకారమే ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని కోరుతూ పలువురు అభ్యర్థులు న్యాయపోరాటం ప్రారంభించారు. తొలుత అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ను ఆశ్రయించిన అనంతరం.. ఈ వివాదం న్యాయస్థానాల ముందుకు వెళ్లింది. డీఎస్సీ-2008 ప్రక్రియలో మెరిట్ సాధించినప్పటికీ.. నిబంధనల మార్పుల కారణంగా ఉద్యోగావకాశాలు కోల్పోయామని బీఈడీ అభ్యర్థులు తమ వాదనల్లో పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను రద్దు చేసి.. మొదట ప్రకటించిన విధానం ప్రకారం ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.

తాజాగా ఈ అంశానికి సంబంధించి దాఖలైన 3 రిట్ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం ధర్మాసనం వాటిని కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తర్వాత ఆయా ప్రభుత్వాలు తమ పరిధిలో నియామకాలకు సంబంధించిన చర్యలను కొనసాగించాయి. ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగులు కూడా ఇచ్చిన నేపథ్యంలో.. జీవో నంబర్ 28 సవరణకు సంబంధించి పిటిషనర్లు కోరిన విధంగా ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు వెలువడటంతో జీవో నంబర్ 28 రూల్ 7లోని నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దాఖలైన తాజా 3 పిటిషన్లపై విచారణ ముగిసింది. అయితే ఈ తీర్పు ప్రభావం ఇప్పటికే నియామకాలు పొందినవారి పరిస్థితులు, భవిష్యత్ ప్రయోజనాలు, ఇతర సంబంధిత అంశాలపై ఎలా ఉంటుందన్నది పూర్తి తీర్పు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా నిర్ధారించాల్సి ఉంటుంది. డీఎస్సీ-2008 వివాదం అనేక ఏళ్లుగా కొనసాగుతోంది. నియామక నిబంధనల మార్పులపై అభ్యర్థులు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, వివిధ న్యాయస్థానాల్లో సాగిన విచారణలు ఈ అంశాన్ని సుదీర్ఘ వివాదంగా మార్చాయి. మరోవైపు, అర్హులైన అభ్యర్థులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించే అంశంపై 2 తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వ స్థాయిలో చర్యలు చేపట్టినట్లు గతంలో వార్తలు వచ్చాయి. ప్రస్తుత తీర్పు మూడు రిట్ పిటిషన్ల పరిష్కారానికి సంబంధించింది కాగా.. మొత్తం డీఎస్సీ-2008 వివాదానికి పూర్తిగా ముగింపు పడిందని చెప్పలేంటే.. సంబంధిత ఇతర కేసులు, ప్రభుత్వ ఉత్తర్వులు, తీర్పులోని తుది ఆదేశాలను కూడా పరిశీలించాల్సి ఉంటుంది. మొత్తంగా జీవో నంబర్ 28 సవరణను.. రూల్ 7కు ప్రొవిజన్ జోడించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన మూడు పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేయడం డీఎస్సీ-2008 నియామకాల అంశంలో ముఖ్యమైన పరిణామంగా నిలిచింది. ఈ తీర్పుపై మరిన్ని వివరాలు, అధికారిక ఉత్తర్వులు అందుబాటులోకి వస్తే నియామకాలపై దాని పూర్తి ప్రభావం స్పష్టమయ్యే అవకాశం ఉంది.

తుల్జాపూర్ భవానీ మాతను దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్ బృందం

- **అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు**
- **పాల్గొన్న మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పలువురు నాయకులు**

పటాన్‌చెరు, అక్టోబర్ 13 (మనం న్యూస్): మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తుల్జాపూర్ శ్రీ తుల్జా భవానీ మాత ఆలయాన్ని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) బృందం మంగళవారం దర్శించుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో పాటు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ మేలు జరగాలని, నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు నాలకంటి యాదగిరి యాదవ్, శ్రీశైలం యాదవ్, మాజీ జెడ్పీటీసీ గంగుల సుధాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నందారం నరసింహ గౌడ్, దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రామచంద్ర రెడ్డి, మిద్దెల సుధాకర్ గౌడ్, రాజన్ సింగ్, శివారెడ్డి, బండి శంకర్, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే

ఆ కుంబానికి అండగా వుంటామని హామీ

కుందుర్పి, అక్టోబర్ 12 మనంన్యూస్: కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని కుందుర్పి మండలం తెనగల్లు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సల్మాన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే.అయితే ఈ విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే, అమిలినేని, సురేంద్రబాబు వారు మానవతా హృదయాన్ని ఉదారతను మరోసారి చాటుకున్నారు. నేడు సోమవారం కళ్యాణదుర్గంలోని ప్రజా వేదిక కార్యక్రమంలో మృతుని భార్య షమీమ్ కు రూ. 25,000 ఆర్థిక సాయాన్ని స్వయంగా ఆయన చేతులు మిదుగా అందజేశారు . ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని ఓదార్చి, ఆయన అన్ని విధాలా మికుటుంబంకు అండగా ఉంటానని ఎమ్మెల్యే ఈసందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఉద్యోగులకు దసరా కానుక

- **3,800 మంది ఉద్యోగులకు గ్రాట్యుటీ మంజూరు**
- **రూ.10 లక్షల వరకు గ్రాట్యుటీ రూపంలో ఆర్థిక లబ్ధి**
- **మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో ఇరవై ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి మోక్షం**

హైదరాబాద్,అక్టోబర్13(మనం న్యూస్): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఎఫ్‌టీఈ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా భారీ ఆర్థిక భరోసా కల్పించింది. సుమారు 3,800 మంది ఉద్యోగులకు గ్రాట్యుటీని మంజూరు చేస్తూ ప్రజా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఎఫ్‌టీఈల ఇరవై ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ నిర్ణయంతో రిటైర్‌మెంట్ సమయంలో ఉద్యోగులకు కనీసం రూ.4 లక్షల నుంచి, పదేళ్ల సర్వీసు పూర్తిచేసుకునే వారికి రూ.10 లక్షల వరకు గ్రాట్యుటీ రూపంలో ఆర్థిక లబ్ధి చేకూరనుంది. తమ చిరకాల కలను సాకారం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కలకు ఉద్యోగుల సంఘం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఉద్యోగుల హక్కులు, వారి ఆత్మగౌరవానికి తమ ప్రభుత్వం ఎప్పుడూ పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు ఒక్కొక్కటిగా పరిష్కారం చూపుతున్నామని మంత్రి వెల్లడించారు. రిటైర్‌మెంట్ తర్వాత ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు పడకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన సంకల్పమని సీతక్క వెల్లడించారు. కష్టపడి పనిచేసిన ఉద్యోగులకు జీవిత చరమాంకంలో పూర్తి స్థాయి ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు.

విదేశీ శక్తులతో కమ్యూనిస్టుల కుట్ర

- కాంగ్రెస్‌తో కలిసి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న ఆ పార్టీలు
- వారి ధర్నాల వల్లే ఢిల్లీ మార్కెట్లు దెబ్బతిన్నది?
- పండుగ సీజన్‌లో చిన్న వ్యాపారులను నష్టపరుస్తున్నరు?
- ఢిల్లీ నిరసనలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, మనం ప్రతినిధి : దేశంలో అరాచకం సృష్టించేందుకు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు విదేశీ శక్తులతో కలిసి కుట్ర పన్నుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీలో నిరసనల పేరుతో ఈ పార్టీలు ఉద్దేశపూర్వకంగా దేశ ఆర్థిక వ్యవస్థను, శాంతిభద్రతలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఈ మేరకు ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... కమ్యూనిస్టుల పాత్రపై ప్రత్యేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కాంగ్రెస్, కమ్యూనిస్టులు చేస్తున్న ధర్నాల వల్ల ఢిల్లీ మార్కెట్ పూర్తిగా దెబ్బతిందని ఆయన ఆరోపించారు. దసరా, దీపావళి వంటి పండుగ సీజన్‌లో చిన్న దుకాణదారులు సరుకులు తెచ్చుకోలేని దుస్థితిని కల్పించారు. కుట్రపూరితంగా ఢిల్లీ ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తూ వ్యాపారుల పొట్ట కొడుతున్నారు' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తన స్థాయిని మరిచి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

రాహుల్ గాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య హక్కులను దుర్వినియోగం చేస్తూ దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నారని విమర్శించారు.

ప్రధాని మోడీ, అమిత్ షా, అజిత్ దోవల్‌ను లక్ష్యంగా చేసుకుని బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రాలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా గద్దె దిగమనడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడంలో తప్పులేదని, కానీ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం దారుణమని ఆయన పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు స్వేచ్ఛగా నిరసనలు చేస్తుంటే అనుమతిస్తున్నామని, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం బీజేపీ నేతల నిరసనలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణలో రైతుల సమస్యలు, పోలీసు నియామకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వంటి ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో సహా పలువురు నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రధాని మోదీని, ఎన్నికల సంఘాన్ని, న్యాయవ్యవస్థను, సైన్యాన్ని విమర్శిస్తున్నా ఆయన హక్కులను కేంద్ర ప్రభుత్వం ఎన్నడూ అడ్డుకోలేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలకు ఉన్న ప్రజాస్వామ్య హక్కులు... తెలంగాణలోని బీజేపీ నేతలకు ఎందుకు ఉండవు? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుంటే సరిపోదని, అధికారంలో ఉన్నప్పుడు దానిని ఆచరించాలని హితవు పలికారు. 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రతిపక్ష నేతలను జైళ్లలో పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌ది ఆయన గుర్తుచేశారు.

జంతర్ మంతర్‌లో సీజేపీ నిరసనలు

ఢిల్లీ, అక్టోబర్ 13 : నిరసనలు, అలర్ల నేపథ్యంలో జంతర్ మంతర్ను ధర్నా వేదికగా డీనోటిపై చేస్తూ దిల్లీ పోలీసులు ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. అక్కడ ఎలాంటి ఆందోళనలు చేపట్టరాదని స్పష్టం చేశారు. ఈ క్రమంలో అక్కడ నిరసన చేపట్టేందుకు కాక్రోచ్ జనతా పార్టీ మంగళవారం యత్నించింది. దీంతో నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినందుకు గానూ.. సీజేపీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా, అజింక్య శిందేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

దీనికి సంబంధించిన వీడియోను సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్ లో పోస్ట్ చేశారు. 'మా ప్రతిఘటనను నిషేధించడం మీకు సాధ్యం కాదు' అంటూ వ్యాఖ్యానించారు. ఈ పోస్టుకి ప్రధాని నరేంద్ర మోడీని ట్యాగ్ చేశారు. ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయంటూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతోన్న నేపథ్యంలో దిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. జంతర్ మంతర్, ఈసీ కార్యాలయం, పార్లమెంట్ హౌస్ వంటి ప్రాంతాల్లో కేంద్ర బలగాలను భారీగా మోహరించారు.

గంజాయి స్మగ్లింగ్ గుట్టురట్టు

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా గంజాయి పట్టివేత

గీజర్‌లో దాచి తరలిస్తున్న 7.750 కిలోల గంజాయి సీజ్

పట్టుబడ్డ గంజాయి విలువ రూ. 2.71 కోట్లు అని అంచనా

బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుడిని అరెస్ట్ చేసిన డీఆర్ఐ

హైదరాబాద్, మనం ప్రతినిధి : హైదరాబాద్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు భారీ మొత్తంలో గంజాయిని పట్టుకున్నారు. ఎలక్ట్రిక్ గీజర్‌లో దాచి అక్రమంగా తరలిస్తున్న 7.750 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్లో సుమారు రూ.2.71 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ గంజాయి తరలింపుపై పక్కా సమాచారం అందుకున్న డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు, అక్టోబర్ 12న బ్యాంకాక్ నుంచి వచ్చిన విమానంలో ప్రయాణించిన ఓ భారతీయుడిని అడ్డగించారు. అతని చెక్-ఇన్ బ్యాగేజీని తనిఖీ చేయగా, అందులో ఒక ఎలక్ట్రిక్ గీజర్ కనిపించింది. అనుమానంతో దాన్ని తెరిచి చూడగా, లోపల 73 ప్యాకెట్లలో పచ్చని పదార్థం బయటపడింది. అయితే, ఈ తనికీలలో బాగంగా..

నార్కోటిక్ డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించగా, అది గంజాయి అని నిర్ధారణ అయింది. దీంతో అధికారులు వెంటనే సదరు ప్రయాణికుడిని నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్ స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) యాక్ట్, 1985 ప్రకారం అరెస్ట్ చేశారు. సరుకును మొత్తం సీజ్ చేసి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అంతర్జాతీయ మార్గాల ద్వారా హైదరాబాద్కు అధిక నాణ్యత గల గంజాయి స్మగ్లింగ్‌ను అరికట్టే ప్రయత్నాల్లో భాగంగా ఈ పట్టివేత జరిగిందని అధికారులు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతున్నందున నిందితుడి వివరాలను ఇంకా వెల్లడించలేదు.

కేంద్రమంత్రి పదవికి ఎల్. మురుగన్ రాజీనామా

ఢిల్లీ, అక్టోబర్ 13 : కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యుడు ఎల్.మురుగన్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ప్రధాని మోడీకి లేఖ రాశారు. ప్రస్తుతం ఆయన కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. తమిళనాడులో భాజపా బలోపేతానికి పూర్తి సమయం కేటాయించాలని నిర్ణయించుకున్నట్లు ప్రధానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. 'కూలీ కుటుంబం నుంచి వచ్చి కేంద్రమంత్రి వర్గంలో చోటు సంపాదించాను. ప్రధాని మోడీ నేతృత్వంలో భారత్కు సేవ చేయడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఇది జీవితంలో లభించిన గొప్ప అనుభూతి. ఇప్పుడు సొంత ప్రాంతానికి సేవ చేయాలనుకుంటున్నాను. వచ్చే లోక్సభ ఎన్నికల ముందు పార్టీ కార్యకర్తలతో కలిసి పనిచేయాలని కోరుకుంటున్నా. తమిళనాడులో పార్టీ బలోపేతానికి పూర్తి సమయం కేటాయించాలని నిర్ణయించుకున్నాను'' అని తన లేఖలో రాశారు.

రామ్‌లీలాలో నిరసనలు చేయలేరు

డిసెంబర్ 29, 30, 31 తేదీలు తప్ప ఏడాదంతా బుక్కైన మైదాన్

ఛార్జీ కూడా ఎక్కువే.. రోజుకు రూ.1.21 లక్షలు

ఢిల్లీ, అక్టోబర్ 13 : నిరసనలకు వేదికగా నిలుస్తున్న జంతర్ మంతర్ ను తొలగించి.. రామ్ లీలా మైదానంతో పాటు బురారీ, సీబీడీ మైదానాలను కొత్త నిరసన వేదికలుగా పోలీసులు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే.. రామ్లీలా మైదానం ఈ ఏడాది డిసెంబరు 29, 30, 31 తేదీల్లో మాత్రమే బుకింగ్ కు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. 12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ మైదానంలో దాదాపు 50 వేల మంది కూర్చోవచ్చు. ఒక్కరోజు బుకింగ్ కు రిఫండబుల్ సెక్యూరిటీ డిపాజిట్, పన్నులతో కలిపి రూ.1.21 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. రామ్లీలా మైదానాన్ని దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్డీ) హార్టికల్చర్ విభాగం ద్వారా బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ముందుగా దిల్లీ పోలీసుల నుంచి ఎన్వోసీ తప్పనిసరి. ఈ వేదికను పూర్తిగా ఉచితంగా ఇస్తే మున్సిపల్ కార్పొరేషన్కు నష్టం వాటిల్లుతుందని చెప్పారు.

చెరువు నుంచి ప్రముఖ బహిరంగ వేదికగా..

గతంలో ఇక్కడ చెరువు ఉండేది. 1932లో రామ్లీలా ప్రదర్శనల కోసం దానిని పూడ్చి, చదును చేయడంతో ఆ పేరు వచ్చింది. ఆ తర్వాత రాజకీయ ర్యాలీలు, సభలకు ముఖ్యమైన వేదికగా మారింది. భారత్లో జమ్మూకశ్మీర్ పూర్తిగా విలీనం కావాలని కోరుతూ 1952లో జనసంఘ్ నేత శ్యామాప్రసాద్ ముఖర్జీ ఇక్కడే సత్యాగ్రహం ప్రారంభించారు.

1971లో పాకిస్థాన్ విజయం సాధించాక అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ర్యాలీ నిర్వహించారు. దిల్లీ ముఖ్యమంత్రిగా అరవింద్ కేజ్రీవాల్ మూడుసార్లు ఇదే మైదానంలో ప్రమాణ స్వీకారం చేశారు.

హూతీల దాడితో.. ప్యాలెస్‌లు మార్చుతున్న సౌదీ యువరాజు..!

అబుధాబి, అక్టోబర్ 13 : దశాబ్దకాలంలో ఎన్నడూ లేనివిధంగా సౌదీ అరేబియాపై హూతీ తిరుగుబాటుదారులు విరుచుకుపడుతున్నారు. దీంతో సౌదీ ప్రభుత్వం ఉలిక్కిపడింది. ఈ నేపథ్యంలో యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఎప్పుడు ఏ రాజభవనంలో ఉంటున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రత్యేకంగా ఎంపిక చేసిన భద్రతా బృందం ఆయన్ను రక్షించేందుకు ఎప్పటికప్పుడు బంకర్లు, పటిష్ఠ భద్రత ఉన్న వేర్వేరు ప్యాలెస్‌లకు తరలిస్తోంది.

సౌదీలోని విమానాశ్రయాలు, ఇంధన మౌలిక సదుపాయాలు, నౌకామార్గాలే లక్ష్యంగా హూతీలు దాడులు చేస్తున్నారు. ఇటీవల రియాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన దాడిలో దాదాపు 13 మంది మృతి చెందగా.. 300 మందికిపైగా గాయపడ్డారు. అప్పటి నుంచి యువరాజుకుకు అందిస్తోన్న భద్రతను మరింత పెంచారు. అలాగే బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. గతవారం సౌదీలో రక్తదాన కార్యక్రమం జరిగింది. ఆ తర్వాత నుంచి ఆయన బహిరంగంగా ఎక్కడా కనిపించడం లేదని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. భద్రతాకారణాలరీత్యా ఆయన్ను ఒక రాజభవనం నుంచి మరొక రాజభవనం నుంచి తరలిస్తున్నారు. ఈ ప్యాలెస్‌లలో కట్టుదిట్టమైన భద్రత ఉండటమే గాకుండా.. క్షిపణి దాడులను తట్టుకునేలా బంకర్లు ఉన్నాయి. హూతీల వద్ద బాలిస్టిక్ క్షిపణులతోపాటు ప్రయాణ సమయంలోనే దిశ మార్చుకోగల అధునాతన మిసైల్స్ కూడా ఉన్నాయి. ఇవి సౌదీ అరేబియా ఉపయోగిస్తున్న పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్లు, ఇతర రక్షణ వ్యవస్థలకు సవాల్ విసురుతుండటంతో సౌదీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

హూతీల దాడి మహమ్మద్ బిన్ సల్మాన్‌పై ఒత్తిడి పెంచుతోంది. సౌదీని చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థగానే ఉంచకుండా వైవిధ్యతను తీసుకురావాలని ప్రతిష్టాత్మక ప్రణాళికతో ఆయన ముందుకు సాగుతున్నారు. ఆ ప్రణాళికకు హూతీల దాడులు సవాలు మారాయి. పర్యాటకంగానూ సౌదీ ఆశయాలను, పెట్టుబడి ప్రాజెక్టులను ప్రమాదంలో పడేస్తున్నాయి. ఇలాంటి కాపాడుతుందనుకున్న మిత్రదేశం అమెరికా హ్యాండివ్వడం, మక్కా ఒప్పందం అక్కరకు రాకపోవడంతో సౌదీ పరిస్థితి ఇప్పుడు గందరగోళంగా మారింది.

మళ్లీ దాడులు చేస్తే... కేబుల్స్, డేటా సెంటర్స్‌ను టార్గెట్ చేస్తాం

- అమెరికాకు ఇరాన్ వార్నింగ్

టెహ్రాన్, అక్టోబర్ 13 : టెహ్రాన్ అమెరికా మళ్లీ తమపై దాడులు మొదలుపెడితే, ఈసారి కేబుళ్లు, డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలతోపాటు ఇతర సైట్లను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. పశ్చిమాసియా యుద్ధాన్ని ముగించటానికి హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవటానికి జరుగుతున్న చర్చల్లో అమెరికా చేసిన తాజా ప్రతిపాదనలు ఏమాత్రం సరిపోవని తెలిపింది. ఈ మేరకు ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ చీఫ్, మాజీ కమాండర్ మోహ్సెన్ రెజాయ్ మాట్లాడుతూ.. ఒప్పందం విషయంలో అమెరికా మరికొన్ని అంశాలపై ముందు స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవేళ మళ్లీ యుద్ధం తీవ్రస్థాయికి చేరితే ఈ ప్రాంతంలోని కేబుల్స్, డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలతోపాటు ఇతర సైట్లపై దాడులు చేస్తామని రెజాయ్ హెచ్చరించారు.

హర్మూజ్‌లో నౌకలపై దాడులు

హర్మూజ్ జలసంధి ప్రాంతంలో రెండు వాణిజ్య నౌకలపై జరిగిన దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడుల్లో ఎంటీ పెట్రో డాల్ఫిన్ నౌకలోని ఇద్దరు భారతీయ నావికులు గల్లంతయ్యారు. మరో నౌక ఎంటీ వాల్తేరాపై గుర్తుతెలియని క్షిపణి పడటంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే ఉద్రిక్తతలు తగ్గించాలని విదేశీ వ్యవహారాల శాఖ పిలుపునిచ్చింది. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా కొనసాగుతున్న ఈ ఘర్షణలకు పరిష్కారం కనుగొనాలని తెలిపింది. వాణిజ్య నౌకలు, నావికులు, పౌర మౌలిక సదుపాయాలపై దాడులను తక్షణమే నిలిపివేయాలని స్పష్టం చేసింది.

ట్రంప్‌పై పెట్టుబడి..

మస్క్‌కు రూ.66 లక్షల కోట్ల లాభం

అమెరికా సెనెటర్ బెర్నీ సాండర్స్

వాషింగ్టన్, అక్టోబర్ 13 : భారత్‌లో స్టార్లింక్ ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలకు అనుమతుల జాప్యంపై ప్రపంచకుబేరుడు ఎలాన్ మస్క్ చేస్తోన్న విమర్శలు కలకలం సృష్టిస్తున్నాయి. ఇప్పుడు ఆయనపై అమెరికా సెనెటర్ బెర్నీ సాండర్స్ ఎదురుదాడి చేశారు. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో మస్క్ 290 మిలియన్ డాలర్లు ఖర్చు చేశారని దుయ్యబట్టారు.

''ఆ ఖర్చుకు ఫలితం లభించింది. ఆ తర్వాత ఆయన సంపద 696 బిలియన్ డాలర్లు (రూ.66 లక్షల కోట్లు) పెరిగి ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా మారారు'' అని సాండర్స్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ''కానీ మస్క్ ఇక్కడితో ఆగలేదు. కాంగ్రెస్ (అమెరికా పార్లమెంట్)లో రిపబ్లికన్ల పట్టు కొనసాగించేందుకు మస్క్ 366 మిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నారు. మస్క్‌ను ఆపండి.. కుబేరుల రాజ్యానికి ముగింపు పలకండి'' అని సాండర్స్ మండిపడ్డారు.

భారత దేశంలో తన స్టార్లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించకుండా కొందరు సంపన్నులు అడ్డుకుంటున్నారని మస్క్ ఆరోపించిన సంగతి తెలిసిందే. తద్వారా వారు భారత్‌లో తమ గుత్తాధిపత్యాన్ని కాపాడుకోవాలని చూస్తున్నట్లు విమర్శించారు. బీజేపీ ప్రచారాన్ని సామాజిక మాధ్యమాల్లో ముమ్మరం చేయడానికి అవసరమైన నిధుల్ని రిలయన్స్‌తో సంబంధం ఉన్న కంపెనీ సమకూర్చిందంటూ మీడియా కథనాలను షేర్ చేశారు. ఇప్పుడు మస్క్‌ను ఉద్దేశించి సాండర్స్ అలాంటి విమర్శలే చేయడం గమనార్హం.

నవంబర్ 1న జాతీయ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష

ఈ నెల 12 నుంచే హాల్ టికెట్లు డౌన్‌లోడ్

హైదరాబాద్,అక్టోబర్ 13(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో జాతీయ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షను నవంబర్ 1న నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెల్లడించింది. ఈ పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుందని తెలిపింది. పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సోమవారం నుంచి అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ హాల్‌టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అభ్యర్థులకు సూచించింది.అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో ఉపయోగించిన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా హాల్‌టికెట్‌లను పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులకు ఎటువంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే హాల్‌టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్ష కేంద్రం వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు.



పాకిస్థాన్లో పట్టాలు తప్పిన రైలు..

- ఆరుగురి దుర్మరణం

కరాచీ, అక్టోబర్ 13 : పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్సులో ఘోర రైలు ప్రమాదం జరిగింది. ఓ ప్యాసింజర్ రైలు పట్టాలు తప్పడంతో ఆరుగురు దుర్మరణం చెందారు. సుమారు 30 మంది గాయపడ్డారు. మంగళవారం ఉదయం కరాచీ నుంచి పెషావర్ వెళ్తున్న రెహమాన్ బాబా ఎక్స్‌ప్రెస్.. ముల్తాన్‌లోని షేర్ షా బ్రిడ్జి సమీపంలో పట్టాలు తప్పింది. 14 కోచ్‌లు పట్టాలు తప్పాయని అధికారులు తెలిపారు. రైల్వే ట్రాక్‌ను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నల్లగొండ జిల్లాలో అనువైన స్థలాలను ఫైవ్ స్టార్ హోటల్ కోసం గుర్తించాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి

నల్లగొండ- అక్టోబర్ 13(మనం ప్రతినిధి): నల్గొండ జిల్లాలో ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల వద్ద ఫైవ్ స్టార్ హోటల్ ల నిర్మాణానికి స్థలాలను గుర్తించినట్లు స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ కు తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ హైదరాబాద్ నుండి బతుకమ్మ సంబరాలు, పర్యాటక శాఖ కార్యక్రమాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు ,పర్యాటక , ఇతర సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

నల్గొండ జిల్లాలో పర్యాటక ప్రాంతాలలో టూరిజం హోటళ్ల నిర్మాణానికి గాను స్థలాల వివరాలను అడిషనల్ కలెక్టర్ వివరిస్తూ బుద్ధవనం, దేవరకొండకోట, వైజాగ్ కాలనీ, ఛాయా సోమేశ్వర దేవాలయం, తదితర 5 ప్రాంతాలలో సైట్లను గుర్తించడం జరిగిందని, త్వరలోనే ఇందుకు సంబంధించిన డిపిఆర్ ను సమర్పిస్తామని తెలిపారు. అలాగే దేవరకొండ కోటతో పాటు, వైజాగ్ కాలనీ ఛాయా సోమేశ్వర దేవాలయం, తదితర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవకాశాలు ఉన్నాయని, వైజాగ్ కాలనీలో 5 కోట్ల రూపాయలతో రిసార్ట్ తో పాటు, వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న ఉద్దేశంతో త్వరలోనే డిపిఆర్ సమర్పిస్తామని తెలిపారు. దేవరకొండ కోట,ఛాయా సోమేశ్వర దేవాలయాల వద్ద సెక్యూరిటీ గార్డ్ లను నియమించాలని, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదేశించగా, అందుకు తగ్గట్టుగా ఏర్పాటు చేస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు.

అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాలలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, 18న సద్దుల బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్సవాలు ఉండాలని, బతుకమ్మ ఉత్సవాలకు సంబంధించి ప్రతిరోజు నిర్వహించే వివరాలను రాష్ట్ర స్థాయికి పంపించాలని ఆమె తెలిపారు .రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక ప్రాంతాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని,ఇందులో భాగంగా సబ్ కమిటీ ని కూడా ఏర్పాటు చేయడం జరిగిందని, పర్యాటక ప్రాంతాలలో పెట్టుబడులు పెట్టడం, టూరిజం హోటల్, ఫైవ్ స్టార్ హోటళ్ల నిర్మాణం, వ్యూ సైడ్ ప్రాంతాలు అభివృద్ధి ,అడ్వెంచర్ పార్కులు, వాటర్ స్పోర్ట్స్ ,అటవీ ప్రాంతాలలో ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని ఆమె చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 142 టూరిజం డెస్టినేషన్స్ గుర్తించడం జరిగిందని, పర్యాటక ప్రాంతాలుగా ఉండి అంత ప్రాచుర్యం లేని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అందుకు సంబంధించిన డేటా తో పాటు, వీడియోలు, చిత్రాలు పంపించాలని ఆదేశించారు.

అదనపు ఎస్ పి రమేష్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, ఇన్చార్జి టూరిజం ఆఫీసర్ అక్బర్ అలీ,సమాచార శాఖ సహాయ సంచాలకులు యు.వెంకటేశ్వర్లు, మెప్మా పిడి శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

ప్రజలకు సంక్షేమ పథకాలను చూస్తున్న ప్రజా పాలన

తిరుమలగిరి, అక్టోబర్ 13(మనం న్యూస్): ప్రజలకు సంక్షేమ పథకాలను ప్రజాపాలన ప్రభుత్వాంధిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకరి జనార్ధన్ అన్నారు. మంగళవారం తిరుమలగిరి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, స్మార్ట్ కార్డులు అందిస్తుందని చెప్పారు. గత ప్రభుత్వంలో పేదలకు రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. రేషన్ కార్డుల ద్వారా పేదలకు కడుపునిండా అన్నం పెట్టే సన్నబియ్యాన్ని ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. వెనుకబడిన తుంగతుర్తిని అభివృద్ధి లోకి తీసుకురావడానికి 2300 కోట్ల నిధులను వివిధ పనులకు ఎమ్మెల్యే మంజూరు చేయించారని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యే మందుల సామేలు సాగునీటి కోసం బిక్కేరు వాగు పైన 6 చెక్ డ్యాములు పూర్తి చేయించారని చెప్పారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో దేవాదుల ప్రాజెక్టు కాలువలకు పనుల కోసం భూసేకరణ పూర్తి చేసి పనులు చేయిస్తున్నారని చెప్పారు. చెన్నూరు రిజర్వాయర్ ద్వారా తాటిపాముల, నందాపురం, అనంతారం, తిరుమలగిరి, మాలిపురం, తొండ గ్రామాల రైతుల భూములకు సాగునీరు అందించాలని లక్ష్యంతో కాలువల పనులు పూర్తి చేయించడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే సామేలు గెలవగానే ఎన్నో ఏండ్లుగా పెండింగ్ లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయించారని త్వరలో బిల్డింగ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. 200 కోట్ల రూపాయలతో తొండ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ నిర్మాణం జరుగుతుందని వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులు విద్యను అభ్యసించడానికి అందుబాటులోకి తీసుకురావడానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామాలలో అన్ని ఆరోగ్య కేంద్రాలలో పేద ప్రజలు వైద్యం చేయించుకోవడానికి మందులు డాక్టర్లను నియమించి వైద్యం అందిస్తున్నామని తెలిపారు. తుంగతుర్తి లో 100పడకల ఆసుపత్రిని పూర్తి చేయించి త్వరలో ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అన్ని గ్రామాలకు లింక్ రోడ్లను, అభ్యానంగా ఉన్న ప్రధాన రహదారులలో డబల్ రోడ్డులను ఏర్పాటు చేసి ప్రజా రవాణాకు రోడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులకు సన్నధాన్యానికి క్వింటాల్ కు రూ 3700లు అందుతున్నాయని తెలిపారు.ఎలినినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందని దానివల్ల నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున రైతులు రబీ లో ఆరుతడి పంటలు వేసుకోవాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్ లో ఎక్కడ పంటలు ఎండిపోలేదని హామీలు ఎండిపోకుండా ఉండడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అని తెలిపారు. మహిళలకు స్త్రీ శక్తి భవనాలు నిర్మించాలని తెలిపారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని తుంగతుర్తిలో మౌదుల సామేలు కాంగ్రెస్ అభ్యర్థిగా ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిలాల్, పిఎసిఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, ఆత్మ తుంగతుర్తి కన్వీనర్ పానుగంటి నరసింహారెడ్డి, మీడియా కన్వీనర్ కందుకూరి లక్ష్మయ్య, కౌన్సిలర్లు బత్తుల శ్రీను, కన్నెబోయిన మల్లయ్య, తిరుమణి యాదగిరి, బెట్టూ రాజు, మోహన్, పిఎన్ఆర్, హీరు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

బతుకమ్మ వేడుకల ఫొటోలు వీడియోలతో విస్తృత ప్రచారం కల్పించాలి

సూపర్ ఎల్నినో ప్రభావాలపై బతుకమ్మ పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి

పర్యాటక అభివృద్ధి పనులను స్థానిక ఇంజినీరింగ్ శాఖలతో త్వరితగతిన పూర్తి చేయాలి

రెండు వారాల్లోగా పర్యాటక ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించాలి

హరిత హోటళ్ల పూర్తికి పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలి

ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఔట్సోర్సింగ్ విధానంలో భద్రతా సిబ్బందిని నియమించాలి

సూర్యాపేట, అక్టోబర్ 13 (మనం ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో బతుకమ్మ వేడుకల నిర్వహణతో పాటు పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, నిధుల సమీకరణ, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ బి. హరి సింగ్ సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు.

వేడుకలకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలి

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ మాట్లాడుతూ... బతుకమ్మ వేడుకలు గ్రామాలు, పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వేడుకలు జరిగే ప్రదేశాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రవాణా, పార్కింగ్, భద్రత వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను విస్తృతంగా సేకరించి, ప్రచారం చేయాలని కలెక్టర్లకు సూచించారు. బతుకమ్మ పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ప్రజలకు చేరువయ్యే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు.

పాటలతో సూపర్ ఎల్నినోపై అవగాహన కల్పించాలి

ప్రస్తుత సూపర్ ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయం, పర్యావరణంపై ప్రభావాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎ. వాణీ ప్రసాద్ సూచించారు. బతుకమ్మ పాటల పోటీలను నిర్వహించి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, నీటిని పొదుపుగా వినియోగించడం వంటి అంశాలు పాటల్లో ప్రతిబింబించేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణమైన సందేశాలతో పాటలు రూపొందించేలా ప్రజలను, మహిళా సంఘాలను, యువతను ప్రోత్సహించాలని తెలిపారు. బతుకమ్మ వేడుకలను సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించే వేదికగా కూడా వినియోగించుకోవాలని వెల్లడించారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 56 పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను జిల్లాలకు బదిలీ చేసినట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఇందులో నాగర్కర్నూల్ జిల్లాకు 20, ఖమ్మం జిల్లాకు 12, జగిత్యాల జిల్లాకు 2 ప్రాజెక్టులను అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులను సంబంధిత స్థానిక ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో చేపట్టి, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లాలకు బదిలీ చేసిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల వివరాలను పరిశీలించి, వాటి పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్థానిక ఇంజినీరింగ్ శాఖలకు పనుల బాధ్యతలు అప్పగించి, పనుల అమలు, నాణ్యత, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే సంబంధిత బిల్లులను పర్యాటక కార్పొరేషన్కు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రెండు వారాల్లోగా డీపీఆర్ తయారీ చేసి అందజేయాలి

పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన సమగ్ర ప్రాజెక్ట నివేదికలు (డీపీఆర్) సిద్ధం చేసేందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. అవసరమైన చోట కన్సల్టెన్సీ సహకారం కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రతి జిల్లాలో సంబంధిత ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా ఇంజినీరింగ్ శాఖలకు లేదా తగిన సంస్థలకు అప్పగించాలని ఆదేశించారు. ప్రాజెక్టు పరిధి, భూమి లభ్యత, నిర్మాణ పనులు, అవసరమైన మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, నిధుల సమీకరణ, అమలు గడువు వంటి అంశాలను డీపీఆర్లో స్పష్టంగా పొందుపరచాలని సూచించారు.

హరిత హోటళ్ల పూర్తికి పీపీపీ విధానంలో చర్యలు

కొన్ని జిల్లాల్లో హరిత హోటళ్ల నిర్మాణ పనులు పాక్షికంగా పూర్తయిన నేపథ్యంలో, మిగిలిన పనులను పూర్తి చేసి వాటిని నిర్వహణలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఎ. వాణీ ప్రసాద్ తెలిపారు.ప్రైవేట్ పెట్టుబడిదారుల సహకారంతో నిర్మాణ పనులను పూర్తి చేసి, నిర్దిష్ట కాలం పాటు నిర్వహణ బాధ్యతలను వారికి అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. జిల్లాలలో ఇటువంటి ప్రాజెక్టులకు ఆసక్తి చూపే ప్రైవేట్ పెట్టుబడిదారులు ఉంటే, జిల్లా స్థాయిలో వారిని గుర్తించి ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకోవాలని సూచించారు.

నిధుల వనరులను పరిశీలించి ప్రణాళిక రూపొందించాలి

ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి, సమగ్ర ప్రణాళికతో పాటు ఆకర్షణీయమైన ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి అందాలు, వారసత్వ ప్రదేశాలను గుర్తించి, వాటి అభివృద్ధికి అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, అమలు విధానం, పర్యాటకుల సౌకర్యాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు. పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం, ప్రైవేట్ పెట్టుబడులు వంటి అన్ని అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. ముఖ్యంగా స్వదేశ్ దర్శన్ పర్యాటక అభివృద్ధి కార్యక్రమం కింద జిల్లాకు అనువైన ప్రాజెక్టులను గుర్తించి, నిధులు సమకూర్చుకునేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్, వసతి, సమాచార బోర్డులు, భద్రత వంటి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్థానిక కళలు, హస్తకళలు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు, స్థానిక ఆహార సంస్కృతిని పర్యాటకంతో అనుసంధానం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించాలన్నారు.

ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా సిబ్బందిని నియమించాలి

రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎ. వాణీ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు జిల్లాలకు పంపిన పర్యాటక ప్రాంతాల జాబితాను పరిశీలించి, అవసరమైన ప్రాంతాల్లో ఔట్సోర్సింగ్ విధానంలో భద్రతా సిబ్బందిని నియమించే చర్యలు జిల్లా స్థాయిలో చేపట్టాలని ఆదేశించారు.పర్యాటక ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు సురక్షిత వాతావరణం కల్పించడంతో పాటు, సంబంధిత శాఖల సమన్వయంతో పర్యాటక సౌకర్యాలను మెరుగుపరచాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్ బి. హరి సింగ్ అధికారులతో మాట్లాడుతూ,ఈ జిల్లాలో బతుకమ్మ పండుగకు అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ ప్రేమ్ రాజ్, డిపిఓ యాదగిరి, డిడబ్ల్యూఓ నరసింహారావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనూష, డిఎస్డిఓ వెంకటరెడ్డి, అడిషనల్ పిడి సురేష్, జిఎం ఇండస్ట్రీస్ భారతి, తదితరులు పాల్గొన్నారు రెవెన్యూ డివిజన్ అధికారులు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

టేకుమట్ల అక్టోబర్ 13 మనం న్యూస్ఃి టేకుమట్ల మండలంలోని సుబ్బక్కపల్లి గ్రామంలో భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో, చిట్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ లింగంపెల్లి కిరణ్ రావు ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ నుమంగళవారం నాడు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, స్విచ్ ఆన్ చేసి సెంట్రల్ లైటింగ్ను ప్రారంభించారు. కాలనీలో విద్యుత్ దీపాలు వెలగడంతో స్థానిక ప్రజలు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాచమల్ల సంపత్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తోట ముండయ్య ప్రధాన కార్యదర్శి రాచమల్ల రవీందర్ ఉపాధ్యక్షుడు సముద్రాల తిరుపతి వార్డ్ మెంబర్ రేణికుంట్ల రమణకుమార్ రేణికుంట్ల రాములు రేణికుంట్ల సంపత్ రమేష్ భాస్కర్ కుమార్ అజయ్ శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పశుగ్రాస సాగుకు ముందస్తు చర్యలు

స్వయం సహాయక సంఘాలకు నిర్వహణ బాధ్యతలు

హైదరాబాద్, అక్టోబర్ 13 (మనం న్యూస్): ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి పశుగ్రాస కొరత ఏర్పడే పరిస్థితులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. పశువులకు అవసరమైన మేతను అందుబాటులో ఉంచడంతో పాటు మూగజీవాలకు నీటి ఇబ్బందులు కలగకుండా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ఇందులో భాగంగా నీటి లభ్యత ఉన్న చెరువులు, కుంటల శిఖం భూముల్లో పశుగ్రాసం సాగు చేయాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టి, 45 రోజుల్లో పశుగ్రాసం అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలంబర్తి, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ ఎం. శ్రీనివాస్, నీటిపారుదల, కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖ ఈఎన్సీ రమేష్ బాబు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఈఎన్సీ మధుసూదన్, వీబీజీ రాంజీ తదితర అధికారులు పాల్గొన్నారు.

పది ఎకరాల విస్తీర్ణంలో..

నీటి వసతి ఉన్న చెరువులు, కుంటల పరిధిలోని శిఖం భూములను గుర్తించి, ఒక్కో ప్రాంతంలో ఐదు నుంచి పది ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాసం సాగు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకు అనువైన స్థలాలను గుర్తించే బాధ్యతను నీటిపారుదల,కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖకు అప్పగించారు. గుర్తించిన భూముల్లో సాగుకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేపట్టి, నిర్ణీత గడువులోగా పశుగ్రాసాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సాగుకు అవసరమైన నిధులను ఉపాధి హామీ పథకం నిధుల నుంచి సమకూర్చనున్నారు. సాగుకు అనువైన, అధిక దిగుబడినిచ్చే సీఎస్హెచ్ 24-ఎంఎఫ్ రకం పశుగ్రాసాన్ని ఎంపిక చేయగా, అవసరమైన విత్తనాలను పశుసంవర్ధక శాఖ ఉచితంగా అందించనుంది. దీంతో సాగు ప్రారంభానికి అవసరమైన విత్తనాల ఖర్చు రైతులు, సంబంధిత సంఘాలపై పడకుండా ప్రభుత్వం భరోసానిస్తోంది.

స్వయం సహాయక సంఘాలకు బాధ్యతలు..

ప్రభుత్వం గుర్తించిన భూముల్లో పశుగ్రాసం సాగు, పంట సంరక్షణ, నీటి నిర్వహణ వంటి పనులను పర్యవేక్షించే బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని నిర్ణయించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. భూముల గుర్తింపు, సాగు ఏర్పాట్లు, విత్తనాల సరఫరా, పంట నిర్వహణ వంటి అంశాల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎల్నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకున్నా పశువులకు మేత కొరత రాకుండా ముందుగానే తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.పశుగ్రాసంతో పాటు పశువులకు తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పశువులకు నిరంతరం తాగునీరు అందేలా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని, పశుగ్రాసం సాగు, నీటి తొట్టెల నిర్మాణం వంటి పనులను సమాంతరంగా చేపట్టి, 45 రోజుల్లోగా పశుగ్రాసాన్ని అందుబాటులోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారించారు. పశువుల పోషణకు అవసరమైన పచ్చిమేత, తాగునీరు అందుబాటులో ఉండటం పాడి పరిశ్రమతో పాటు గ్రామీణ కుటుంబాల జీవనోపాధికి అత్యంత కీలకం కావడంతో, ప్రభుత్వం ఈ ముందస్తు చర్యలతో పశుసంపదను పరిరక్షించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది.

దుబాయ్లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు

- **తెలంగాణ వంటకాలతో విందు**
- **ముఖ్య అతిథిగా భారత కాన్సులేట్ జనరల్ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి హాజరు**
- **తెలంగాణ నుంచి మాజీ మంత్రి ప్రశాంత్రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హాజరు**

హైదరాబాద్, మనం ప్రతినిధి : గల్ఫ్ తెలంగాణ ఫోరం (జీటీఎఫ్) ఆధ్వర్యంలో అక్టోబర్ 11న దుబాయ్లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను విదేశీ గడ్డపై ఘనంగా నిర్వహించి తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పారు. దుబాయ్లో నివసిస్తున్న తెలంగాణ ప్రాంత ప్రజలు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత కాన్సులేట్ జనరల్ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి హాజరుకాగా, తెలంగాణ నుంచి మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే గణేశ్ బిగాల, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం అధ్యక్షుడు మహేశ్ బిగాల, రాష్ట్ర నాయకురాలు ఐశ్వ షకీల్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

తెలంగాణ వంటకాలతో విందు..

తెలంగాణలోని పల్లె సంస్కృతిని, సంప్రదాయాలను గుర్తు చేస్తూ చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఆనందోత్సాహాలతో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులు, తెలంగాణ ప్రవాసులు, కుటుంబ సభ్యులందరికీ జీటీఎఫ్ ఆధ్వర్యంలో చక్కటి ఏర్పాట్లు చేసి, రుచికరమైన తెలంగాణ సంప్రదాయ వంటకాలతో విందు భోజనాలు ఏర్పాటు చేశారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆత్మీయ ఆతిథ్యం అందిస్తూ, అందరూ సంతోషంగా వేడుకల్లో పాల్గొనేలా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించడమే జీటీఎఫ్ ప్రధాన లక్ష్యం విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ మన భాష, సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలను భావితరాలకు పరిచయం చేయాలనే లక్ష్యంతో జీటీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు.

ఈ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరూ జీటీఎఫ్ కుటుంబంలో భాగస్వాములేనని, అందరి సమష్టి కృషి, సహకారం, ఆత్మీయత వల్లే ఈ బతుకమ్మ సంబరాలు ఇంతటి ఘనవిజయాన్ని సాధించాయని జీటీఎఫ్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ ఆకుల సురేందర

మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల భరోసా

పెద్దకర్మకు 50 కేజీల బియ్యం, రూ.6 వేల ఆర్థిక సాయం

కన్నాయిగూడెం, అక్టోబరు 13 (మనం న్యూస్): చింతగూడెం గ్రామానికి చెందిన సునార్కని ఇస్తారి (70) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి బాధలో తామూ భాగస్వాములమని భరోసా కల్పించారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, డీసీసీ అధ్యక్షుడు పైడకుల అశోక్ సూచనలతో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి పెద్దకర్మ కార్యక్రమం కోసం 50 కేజీల బియ్యం, రూ.6 వేల నగదును అందజేశారు. కుటుంబానికి అవసరమైన సమయంలో కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని నాయకులు తెలిపారు.

మృతుడి కుమారుడు, కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సునార్కని రాంబాబును పరామర్శించిన నాయకులు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఇలాంటి విషాద సమయంలో కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సర్పంచ్ జాడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండీ అప్సర్ పాషా, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు తాటి రాజబాబు, జిల్లా కార్యదర్శి బొల్లె భాస్కర్, మండల కోఆర్డినేటర్ దుర్గం ప్రభాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చేర్ప పగిడయ్య, చింతగూడెం మాజీ ఉప సర్పంచ్ జంగా కృష్ణ, సర్పంచ్ పొడెం నర్సింహారావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆలం రాంబాబు, పిరీల ప్రేమ్, గోస్కుల నర్సింహా, లాలయ్య, భద్రయ్య, యూత్ నాయకుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

మంగపేట, అక్టోబర్ 13, మనం ప్రతినిధి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ములుగు జిల్లా బీఆర్ఎస్ మాజీ యూత్ ప్రధాన కార్యదర్శి బాడిశ నాగ రమేష్ కోరారు. మంగళవారం రాజుపేటలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు యడ్లపల్లి నర్సింహారావు ఆధ్వర్యంలో మల్లూరు నుంచి అకినేపల్లి మల్లారం వరకు 13 గ్రామాల బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదుపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు యువత, నిరుద్యోగులు, ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో విఫలమైందని నాగ రమేష్ విమర్శించారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, ఉద్యోగులకు కొత్త పీఆర్సీ వంటి హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. ప్రభుత్వంపై యువత, నిరుద్యోగులు, ఉద్యోగుల్లో అసంతృప్తి ఉందన్నారు.గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి ఎదురైందని, ఈసారి ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు అయ్యేలా నాయకులు కృషి చేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి గెలుపు కోసం సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా నాయకురాలు కొమరం ధనలక్ష్మి, సీనియర్ నాయకులు కర్రి శ్యాంబాబు, కోడె రాము, బండ్ల మధు ప్రసాద్, ఎండీ రాయసాహెబ్, కర్రి శ్రీను, చదలవాడ సాంబశివరావు, గుమ్మల వీరస్వామి, పూజారి శ్రీనివాస్తో పాటు వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రాగునీటి కోసం తండ్లాట

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన
- సర్పంచ్ కార్యదర్శి పట్టించుకోవడంలేదని ఆగ్రహం

కాటారం, అక్టోబర్ 13 మనం న్యూస్: కాటారం మండలం గుండ్రాత్ పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో త్రాగునీటి ఇబ్బందులు నెలకొన్నాయి. త్రాగునీటి బోరు మరమత్తు చేయించేవారు లేక కాలనీవాసులు నీటి కోసం తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడంలేదని ఆరోపిస్తూ మంగళవారం ఎస్సీ కాలనీలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజుల క్రితం తాగునీటి బోరు చెడిపోయిందని మరమ్మత్తు చేయించకపోవడంతో త్రాగు నీటి ఎద్దడి నెలకొందని పేర్కొన్నారు. త్రాగునీటి కోసం సమీపంలోని పంట పొలాలు, వాగులోని చెలిమల వద్దకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. త్రాగు నీటి బోరు మరమ్మత్తు చేయించాలని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని కోరగా మీ కాలనీతో మాకు సంబంధం లేదని తేల్చి చెప్పారని అన్నారు. మాకు గ్రామపంచాయతీతో సంబంధం లేదా మా సమస్యలు అధికారులకు, పాలకవర్గానికి పట్టవా అని కాలనీ వాసులు ప్రశ్నించారు. సర్పంచ్ ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తమ చుట్టు తిరిగారని ఇప్పుడు మా సమస్యలను గాలికి వదిలేసారని ఆరోపించారు. ఇప్పటికైనా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి స్పందించి త్రాగునీటి సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని మహిళలు హెచ్చరించారు.

డిసెంబర్ నెలాఖరులోగా రీ సర్వే పూర్తి చేయాలి

- రీ సర్వేకు 19 ప్రత్యేక బృందాలు
- ములుగు జిల్లాలో 21 గ్రామాల్లో రీ సర్వే పూర్తి
- మిగిలిన పనుల్లో వేగం పెంచాలి
- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి

ములుగు, అక్టోబర్ 13, మనం ప్రతినిధి: ములుగు జిల్లాలో రీ సర్వే నిర్వహణకు 19 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, మిగిలిన గ్రామాల్లో పనులను వేగవంతం చేసి డిసెంబర్ 2026 నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి ఆదేశించారు. మంగళవారం ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అధ్యక్షతన రీ సర్వే బృందాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రీ సర్వే విధివిధానాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులు, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, బృందాల మధ్య సమన్వయంపై సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత రీ సర్వే కోసం 70 గ్రామాలను ఎంపిక చేయగా, ఇప్పటివరకు 21 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మిగిలిన 49 గ్రామాల్లో పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ ఆదేశాల మేరకు ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, వెంకటాపురం, వాజేడు, మంగపేట, కన్నాయిగూడెం మండలాలకు రెండేసి బృందాలు, మల్లంపల్లి మండలానికి ఒక బృందాన్ని నియమించినట్లు పేర్కొన్నారు. ప్రతి మండలంలో ఒకేసారి రెండు గ్రామాల్లో రీ సర్వే పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాలన్నింటిలో సర్వే పూర్తయ్యే వరకు బృందాలు నిరంతరంగా పనిచేయాలని ఆదేశించారు. రీ సర్వే బృందాల్లోని రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, కార్యాలయ సహాయకులు, గ్రామ పాలన అధికారులు సమన్వయంతో తమ బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. సంబంధిత తహసీల్దార్లు, మండల సర్వేయర్ల బృందాలకు అవసరమైన రెవెన్యూ రికార్డులు, సర్వే రికార్డులు, పటాలు, ఇతర సంబంధిత పత్రాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి నమోదు పుస్తకాల తయారీ, రికార్డుల నమోదు, పత్రాల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. గ్రామాల వారీగా రీ సర్వే పురోగతిని పర్యవేక్షిస్తూ, మిగిలిన పనుల్లో వేగం పెంచి డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి అల్లం రాజ్కుమార్, పర్యవేక్షకుడు మహేశ్, డివిజనల్ సర్వే పరిశీలకుడు సతీష్ చంద్ర, ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, నాయబ్ తహసీల్దార్లు మల్లేశ్, నితీశ్, అన్ని మండలాల తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ పరిశీలకులు, సీనియర్ సహాయకులు, కనిష్ఠ సహాయకులు, గ్రామ పాలన అధికారులు, సర్వేయర్లు, అనుమతి పొందిన సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

భూపాలపల్లి, అక్టోబర్ 13 మనం న్యూస్: భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పాల్గొని ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు వైద్య సేవలందించిన వారి సేవలను ప్రభుత్వం గుర్తించి, తగిన గౌరవం కల్పించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో నిరంతరం సేవలందిస్తున్న వైద్య సిబ్బంది సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, వారి డిమాండ్లను నెరవేర్చి, ఉద్యోగులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

గత ప్రభుత్వ హయాంలో కొన్ని సమస్యలు పరిష్కారమై ఉండవచ్చని, మరికొన్ని పరిష్కారం కాకపోయి ఉండవచ్చు, గతంలో పరిష్కారం కాని సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వంపై నెపం నెట్టి సమస్యల నుంచి తప్పించుకోవడం సరైన విధానం కాదని హితవు పలికారు.

ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ న్యాయం జరగాలని, వేతనాల్లో ఉన్న వ్యత్యాసాలను పరిశీలించి సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో నిరంతరం సేవలందిస్తున్న వైద్య సిబ్బంది సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, వారి డిమాండ్లను నెరవేర్చి, ఉద్యోగులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా మాజీ స్పీకర్ జన్మదిన వేడుకలు

భూపాలపల్లి, అక్టోబర్ 13 మనం న్యూస్: భూపాలపల్లి పట్టణంలో తెలంగాణ తొలి శాసనసభాపతి, బీఆరెస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు ప్రస్తుత శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు, అభిమానులు మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి పట్టణంలోని మంజూర్ నగర్ క్యాంపు కార్యాలయం నుంచి గణేష్ చౌక్ మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు.

అక్కడ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం సమీపంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పట్టణంలోని రహదారులపై ఎండలో జీవనోపాధి కోసం చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి గొడుగులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధికి,జిల్లా సాధనకు సిరికొండ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత, సేవాభావం ఎందరికో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ప్రజల భద్రతే లక్ష్యం

- నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

భూపాలపల్లి, అక్టోబర్ 13 మనం న్యూస్: భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ జిల్లాలో నేరాల పరిస్థితి, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు పలు కీలక సూచనలు చేస్తూ, నేర నియంత్రణకు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యమని, ప్రతి కేసును బాధ్యతగా తీసుకొని బాధితులకు సత్వర న్యాయం అందించేలా పనిచేయాలని స్పష్టం చేశారు. మిస్సింగ్ కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ తప్పిపోయిన వ్యక్తుల ఆచూకీ గుర్తించేందుకు సమన్వయంతో పనిచేయాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను తీవ్రంగా పరిగణించాలని, పోక్సో కేసుల్లో దర్యాప్తు, ఆధారాల సేకరణ, కోర్టు విచారణకు సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. జిల్లాలో దొంగతనాల నివారణకు రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని, నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. గతంలో నమోదైన దొంగతనాల కేసులను సమీక్షిస్తూ నిందితులను గుర్తించడం, దొంగిలించబడిన సొత్తును రికవరీ చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలను సమర్థవంతంగా వినియోగించుకొని నేరాలను ఛేదించాలని, కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని, సైబర్ నేరాల నియంత్రణకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపడుతూ, గ్రామస్థాయిలో పోలీసింగ్ను బలోపేతం చేయాలని ఎస్పీ తెలిపారు. ప్రతి పోలీస్ అధికారి విధుల్లో జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ, నేరాల నియంత్రణ, కేసుల పరిష్కారం, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీ ఎ. సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ రవీందర్ నాయక్ (చౌకిదర్)కి సన్మానం

మహబూబాబాద్, అక్టోబర్ 13(మనంన్యూస్): ఇటీవల మహబూబాబాద్ ప్రభుత్వ హాస్పిటల్ నుండి ప్రమోషన్ లో భాగంగా వరంగల్ జిల్లాలోని ఎంజీఎంహెచ్ కి విచ్చేసిన డాక్టర్ మాలోతు రవీందర్ నాయక్ (చౌకిధర్) గారిని సామాజిక జాతీయ భావం గల ఉద్యమ నేత , ఉప సర్పంచ్ లా ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షులు తెలంగాణ శ్రీనివాస్ నాయక్ వారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ సన్మానించారు .. అలాగే డాక్టర్ గారి జీవితాలు కల్ముషం లేని మన తత్వాలు చూస్తే ప్రత్యక్షంగా కొలిచే దైవాలుగా కొనియాడ బడుతున్నారని అన్నారు పేదవాళ్ల డాక్టర్లుగా అనేకమంది నిస్వార్థ సేవలందిస్తున్నారు వీరి సేవలను గుర్తించకుండా 'పైరవీ 'లతో ఇతర డాక్టర్లకు పద్మ విభూషణ్ అవార్డులు కేటాయించడం బాధాకరమని తెలంగాణ శ్రీనివాస్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ధారావతు రఘునాయక్, ఈదునూరి మహేందర్, గార్డ్ శ్రీను చంద్య నాయక్, శ్రీమతి దివ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అంత్యక్రియలకు జ్వాలా ట్రస్ట్ ఆర్థిక సాయం



మంగపేట, అక్టోబర్ 13, మనం ప్రతినిధి: గ్రామంలోని పాతూరుకు చెందిన ఇండ్ల రామక్క అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె అంత్యక్రియల నిర్వహణకు జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం అందించింది. నిరుపేద కుటుంబానికి చెందిన రామక్క అంత్యక్రియలకు సైతం డబ్బులు లేని పరిస్థితిని తెలుసుకున్న ట్రస్ట్ సభ్యులు దాతల సహకారంతో రూ.7,100ను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి ప్రతి ఒక్కరూ తమవంతు సహాయం అందించాలని కోరారు. ట్రస్ట్ వాట్సాప్ గ్రూపులో సమాచారం తెలియజేయగానే స్పందించి ఆర్థిక సాయం అందించిన దాతలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మల నరేష్, వేల్పుల శేఖర్, గంగుల చంటి, గోలి నరేష్, సాంబయ్య, బూర సాయి పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరి ఆధార్ నమోదు చేయాలి

భూపాలపల్లి, అక్టోబర్ 13 మనం ప్రతినిధి: జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆధార్ నమోదు ప్రక్రియ పూర్తిచేయడంతో పాటు, పిల్లలకు నిర్దేశిత వయస్సులో తప్పనిసరి బయోమెట్రిక్ అప్డేట్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో ఆధార్ నమోదు పురోగతి, ఆధార్ సేవల విస్తరణ, బయోమెట్రిక్ అప్డేట్లు, ఆధార్కు సంబంధించిన సమస్యలు, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని వయస్సుల వారికి ఆధార్ నమోదు ప్రక్రియను పూర్తి చేసేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఆధార్ నమోదు మరియు అప్డేట్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి, లీడ్ బ్యాంక్ మేనేజర్, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్, జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, పోలీస్ట్కబ్బఅఐ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ ప్రాజెక్ట్ మేనేజర్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్, జిల్లా సి ఎస్ సి ఈ-గవర్నెన్స్ కో-ఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఉదారత

- వార్డు సభ్యుడి కుటుంబానికి చేయూత

కాటారం, అక్టోబర్ 13 మనం న్యూస్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శంకరంపల్లి వార్డు సభ్యుడు వేల్పుల రాజమల్లు కుటుంబానికి సర్పంచ్ అజ్మీర కిషన్ నాయక్ అండగా నిలిచారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో వార్డు సభ్యుడు రాజమల్లు, ఆయన భార్య తీవ్రంగా గాయపడ్డారు. వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న సర్పంచ్ కిషన్ నాయక్ తన పాలకవర్గంతో కలిసి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఇరవై వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. అంతేకాకుండా దసరా పండుగను పురస్కరించుకుని మానవతా దృక్పథంతో పదిహేను వేల విలువైన క్వింటాళ్ల బియ్యం, నిత్యావసర సరుకులను స్వయంగా వారి ఇంటికి వెళ్లి అందజేశారు. ప్రజాప్రతినిధిగా సేవలందించిన తోటి సభ్యుడి కుటుంబం ఇలాంటి విపత్కర పరిస్థితిలో ఉండడం బాధాకరమని, వారు త్వరగా కోలుకోవాలని సర్పంచ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి, అక్టోబర్ 13 మనం ప్రతినిధి: ఎల్నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో వ్యవసాయ రంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.జిల్లాలో వర్షపాతం పరిస్థితులు, పంటల సాగు విస్తీర్ణం, భూగర్భ జలాల లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగు, విత్తనాల సరఫరా, వ్యవసాయ, విద్యుత్తు, మంచినీటి తదితర రంగాలపై ఎల్నినో ప్రభావం తదితర అంశాలపై కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం నాడు ఐడిఓసి కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సీజన్తో పోలిస్తే ప్రస్తుత సీజన్లో జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైనట్లు వివరించారు. ఎల్ నినో వల్ల భూగర్భ జలాలు, చెరువులు, ఇతర నీటి వనరులపై ప్రభావం పడే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి సంబంధిత శాఖలు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు వరి సాగుపైనే ఆధారపడకుండా కంది, మొక్కజొన్న, పెసలు, మినుములు, శనగ, వేరుశనగ, సోయాబీన్, జొన్న, సజ్జ తదితర పప్పుధాన్యాలు, నూనెగింజలు మరియు చిరుధాన్యాల సాగు వైపు మళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. పంటల సాగులో వైవిధ్యీకరణ ద్వారా తక్కువ నీటి వినియోగంతో మెరుగైన ఆదాయం పొందే అవకాశాలను రైతులకు వివరించాలన్నారు. వరి సాగు వల్ల కలిగే లాభనష్టాలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా కలిగే ఆర్థిక ప్రయోజనాలు, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, మద్దతు ధరలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన విత్తనాల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. కంది, పెసర, మినుము, శనగ, వేరుశనగ, సోయాబీన్, జొన్న, సజ్జ తదితర పంటల విత్తనాలకు సంబంధించి సబ్సిడీ వివరాలతో కూడిన సమగ్ర ప్రొఫార్మాను సిద్ధం చేయాలన్నారు.

గ్రామ, మండల స్థాయి అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. మార్క్ఫెడ్ ద్వారా ఏయే పంటలను కొనుగోలు చేస్తారు, వాటికి వర్తించే మద్దతు ధరలు, కొనుగోలు విధానం తదితర అంశాలపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎల్నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయంతో పాటు నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలపై ప్రభావాన్ని అంచనా వేసి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వేసవిలో.మంచినీటి సమస్య రాకుండా సమ్మర్ యాక్షన్ ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. రబీ సాగు కంటే ముందునుండే పంటల సాగుపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, వ్యవసాయ, ఉద్యానవన, విద్యుత్తు, మున్సిపల్ కమిషనర్, జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, నీటిపారుదల డివిజన్ల ఈఈలు, డీఆర్డీఓ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఒక్కటైన పృథ్వీషా.. నటి ఆకృతి

భారత యువ క్రికెటర్ పృథ్వీ షా, నటి ఆకృతి అగర్వాల్ మళ్లీ ఒక్కటయ్యారు. కొన్ని వారాల కిందట నిశ్చితార్థాన్ని రద్దు చేసుకున్న ఈ జంట.. తాజాగా బంధాన్ని కొనసాగించాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని ఆకృతి ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించారు. సన్నిహితుల మాటలు విని తప్పుగా ఆలోచించానని, పృథ్వీతో నేరుగా మాట్లాడకుండా నిశ్చితార్థాన్ని రద్దు చేసుకోవడం తన పొరపాటని అంగీకరించారు. తన నిర్ణయంతో అతడికి కలిగిన బాధకు బాధ్యత వహిస్తున్నట్లు ఆమె రాసుకొచ్చారు.

''ఇటీవల ఇద్దరం మాట్లాడుకున్నాం. పరస్పరం అర్థం చేసుకున్న తర్వాత మళ్లీ కలవాలని నిర్ణయించుకున్నాం. మా వ్యక్తిగత జీవితాన్ని గౌరవించండి. మా నిర్ణయంపై ఊహాగానాలు ప్రచారం చేయొద్దు'' అని ఆకృతి అభిమానులను కోరింది. పృథ్వీ షా సైతం ఆకృతి పోస్టును షేర్ చేశాడు. టాలీవుడ్ నటి ఆకృతి అగర్వాల్తో మార్చి 8న పృథ్వీ షా ఎంగేజ్మెంట్ జరిగింది. అయితే భవిష్యత్తు లక్ష్యాలు ఇద్దరివీ వేరువేరుగా ఉన్నాయని చెబుతూ తాము విడిపోతున్నట్లు ఆకృతి సెప్టెంబరులో ప్రకటించిన విషయం తెలిసిందే.

ఏఐ దుర్వినియోగంపై శ్రియ శరణ్ ఫైర్

గత కొద్ది కాలంగా ఏఐ టెక్నాలజీ హీరోయిన్ల పాలిట శాపంగా మారుతోంది. కొంతమంది కేటుగాళ్లు పలు హాట్ వీడియోలను నెట్టింట షేర్ చేస్తూ సంచలనం సృష్టిస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఎంతో మంది హీరోయిన్లు ఆవేదన వ్యక్తం చేయగా.. తాజాగా, హీరోయిన్ శ్రియా శరణ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సాంకేతికత పేరుతో కొందరు ఆకతాయిలు హీరోయిన్ల ఫోటోలను క్రియేట్ చేస్తూ ఆన్ లైన్ లో వదులుతున్న తీరుపై ఆమె స్పందించారు. తాను కూడా ఈ ఏఐ మార్ఫింగ్ బాధితురాలినేనని చెప్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆన్ లైన్ లో తన మార్ఫింగ్ ఫోటోలు చక్కర్లు కొట్టడంపై శ్రియ మాట్లాడుతూ.. కొన్నిసార్లు ఆ ఫొటోలు చూస్తే అసలు అక్కడ ఉన్నది నేనేనా అని తనకు కూడా నవ్వొస్తుందని సరదాగా అన్నారు.

మన శరీర భాగాల సైజులను ఇష్టమొచ్చినట్లు మార్చేయడం, మనం వేసుకున్న డ్రెస్సులను ఏఐ సాయంతో మాయం చేయడం లాంటివి చేస్తుంటారని తెలిపారు. ఇలాంటి పిచ్చి పనులను చూసి మొదట్లో తేలిగ్గా తీసుకున్నప్పటికీ, రోజురోజుకూ ఇది చాలా విసుగు తెప్పిస్తోందని, అసలు ఇది పద్ధతే కాదని ఆమె మండిపడ్డారు. ఏఐ టెక్నాలజీ వల్ల ఎన్నో లాభాలు ఉన్నప్పటికీ, దానివల్ల జరిగే నష్టాలు కూడా అంతే ప్రమాదకరంగా ఉంటాయని శ్రియ హెచ్చరించారు. టెక్నాలజీ అనేది ప్రతిసారీ ఒకలా ఉండదని, కాలం మారుతున్న కొద్దీ ఇలాంటి సరికొత్త సమస్యలతో ఎలా జీవించాలో లేదా వాటిని ఎలా ఎదుర్కోవాలో మనం నేర్చుకోవాల్సిందేనని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం శ్రియ చేసిన వ్యాఖ్యలు నెట్టింట హాట్ టాపిక్ గా మారాయి.

'నువ్వు నాతో పడుకోవాల్సిందే..'

సౌత్ డైరెక్టర్‌పై నటి సంచలన వ్యాఖ్యలు.!

నటి నీతి టేలర్ తాజాగా తనకు సినీ పరిశ్రమలో ఎదురైన చేదు అనుభవాన్ని ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. ఓ దక్షిణాది దర్శకుడు తనను అసభ్యకరమైన రీతిలో సంప్రదించాడని ఆమె పేర్కొంది. ఆ ఘటన తర్వాత తాను సినిమాల్లో నటించకూడదని నిర్ణయించుకున్నానని తెలిపింది.

'ఆ మాటలు విని షాక్ కు గురయ్యాను'

'దక్షిణాదిలో తాను కేవలం రెండు సినిమాల్లో మాత్రమే నటించాను. మొదటి సినిమాకు దర్శకత్వం వహించిన వ్యక్తే రెండో సినిమాకూ నన్ను సంప్రదించారు. మొదటి సినిమా పూర్తయిన తర్వాత ఆ దర్శకుడు ఫోన్ చేసి.. సినిమాలో నటించాలంటే నాతో లైంగిక సంబంధం పెట్టుకోవాలని.. 'నాతో పడుకోవాలి' అన్నట్లుగా అన్నాడు. ఆ మాటలు విని షాక్ కు గురయ్యాను. ఆ పరిస్థితుల్లో ఎలా స్పందించాలో కూడా అర్థం కాలేదు.

ఆ దర్శకుడిని వెంటనే బ్లాక్ చేశానని తెలిపింది. అనంతరం తన తల్లికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పాను' అని వెల్లడించింది. ఈ ఘటన తర్వాత ఇకపై సినిమాల్లో నటించకూడదని నిర్ణయించుకున్నానని తెలిపింది. కాగా నీతి టేలర్ తెలుగులో 'మేం వయసుకు వచ్చాం' సినిమాలో నటించింది. తాజాగా ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో మరోసారి చర్చకు దారితీశాయి.

సౌతాఫ్రికాను మట్టికరిపించిన ఆస్ట్రేలియా

సౌతాఫ్రికాతో తొలి టెస్టులో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. ఆతిథ్య జట్టును ఏకంగా 214 పరుగుల తేడాతో మట్టికరిపించింది. మ్యాచ్ ఆరంభంలో తడబడ్డా అనూహ్య రీతిలో పుంజుకుని బవుమా బృందానికి ఊహించని షాకిచ్చింది.

కాగా ప్రపంచ టెస్టు చాంపియన్షిప్ 2025-27 సీజన్ లో భాగంగా మూడు టెస్టులు ఆడేందుకు ఆసీస్ జట్టు సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లింది. ఇందులో భాగంగా డిఫెండింగ్ చాంపియన్ ప్రొటీస్-రన్నరప్ కంగారూ జట్ల మధ్య శుక్రవారం తొలి టెస్టు మొదలైంది.

డర్బన్ వేదికగా టాస్ గెలిచిన ఆసీస్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే, ఆరంభంలో ప్రొటీస్ బౌలర్లు నిప్పులు చెరగడంతో కేవలం 124 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయి కంగారూలు కష్టాల్లో పడ్డారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మ్యాట్ రెన్షా వీరోచిత శతకంతో అదరగొట్టాడు. మొత్తంగా 397 బంతులు ఎదుర్కొని 21 ఫోర్లు, ఒక సిక్స్ బాది 190 పరుగులు చేసిన రెన్షా.. తృటిలో డబుల్ సెంచరీ మిస్సయ్యాడు.

ఇక కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (43) రెన్షాకు సహకారం అందించాడు. ఫలితంగా ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 390 పరుగులు చేసి ఆలౌట్ అయింది. సౌతాఫ్రికా బౌలర్లలో వియాన్ ముల్డర్ నాలుగు, మార్కో యాన్సెన్ మూడు వికెట్లతో సత్తా చాటగా.. అన్రిచ్ నోర్జే రెండు, సైమన్ హార్మర్ ఒక వికెట్ తీశారు.

అనంతరం బ్యాటింగ్ మొదలుపెట్టిన సౌతాఫ్రికా.. తొలి ఇన్నింగ్స్ 284 పరుగులకే చాపచుట్టేసింది. డేవిడ్ బెడింగ్హామ్ (49), ట్రిస్టన్ స్టబ్స్ (32), సైమన్ హార్మర్ (35 నాటౌట్), కేశవ్ మహారాజ్ (34), వియాన్ ముల్డర్ (30) చెప్పుకోదగిన స్కోర్లు చేశారు. కంగారూ జట్టు బౌలర్లలో కెప్టెన్ కమిన్స్ మూడు వికెట్లు తీయగా.. మిచెల్ స్టార్క్, జోష్ హాజిల్వుడ్, నాథన్ లియాన్ తలా రెండు.. బ్యూ వెబ్స్టర్ ఒక వికెట్ పడగొట్టారు.

ఇక తొలి ఇన్నింగ్స్ 106 పరుగుల ఆధిక్యం సంపాదించిన ఆసీస్.. రెండో ఇన్నింగ్స్ను 314/6 వద్ద డిక్లేర్ చేసింది. మ్యాట్ రెన్షా (82) రెండో ఇన్నింగ్స్లోనూ ఆకట్టుకోగా.. నిక్ మాడిసన్ (48), బ్యూ వెబ్స్టర్ (39 నాటౌట్) రాణించారు. ఈసారి నోర్జే, మహారాజ్ చెరో రెండు వికెట్లు తీయగా.. మార్కో యాన్సెన్, సైమన్ హార్మర్ తలా ఒక వికెట్ పడగొట్టారు.

చేతులెత్తేసిన ప్రొటీస్ జట్టు

కాగా ఆసీస్ విధించిన 421 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించలేక సౌతాఫ్రికా చేతులెత్తేసింది. ఆసీస్ బౌలర్ల ధాటికి తాళలేక రెండో ఇన్నింగ్స్ 206 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ ఐడెన్ మార్క్రమ్ (75), వన్డెన్ బ్యాటర్ బెడింగ్హామ్ (46) రాణించగా.. ముల్డర్ 29, యాన్సెన్ 35 పరుగులు చేయగలిగారు.

మిగిలిన వాళ్లంతా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. బవుమా, స్టబ్స్, వెరియెన్నె, మహారాజ్ ఒక్కో పరుగు చేయగా.. రియాన్ రికెల్టన్ 2, నోర్జే 4 పరుగులు చేశారు. హార్మర్ డకౌట్ అయ్యాడు.

ఆసీస్ బౌలర్లలో జోష్ హాజిల్వుడ్ ఆరు వికెట్లతో చెలరేగి ప్రొటీస్ బ్యాటింగ్ ఆర్డర్ పతనాన్ని శాసించగా.. మ్యాట్ రెన్షా రెండు, స్టార్క్, కమిన్స్ తలా ఒక వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో ఆసీస్ మూడు టెస్టుల సిరీస్లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ప్రొటీస్-ఆసీస్ మధ్య ఆదివారం మొదలయ్యే రెండో టెస్టుకు గెబెర్హ వేదిక.



రోహిత్, కోహ్లీ మాత్రమే ఆడితే సరిపోదు: మహమ్మద్ కైఫ్

''2027 వన్డే ప్రపంచకప్ లో భారత్ విజయం సాధించాలంటే స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలపైనే ఆధారపడితే సరిపోదు. బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలను పటిష్ఠం చేసుకోవడం చాలా కీలకం'' అని మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ అభిప్రాయపడ్డాడు. వన్డే ప్రపంచకప్ టోర్నీకి రో-కో ఎంపికపై సుదీర్ఘంగా చర్చ జరుగుతోన్న వేళ కైఫ్ ఈ వ్యాఖ్యలు చేశాడు.

''దక్షిణాఫ్రికా లో పరిస్థితులు ఇప్పుడు చాలా మెరుగయ్యాయి, అక్కడ బ్యాటింగ్ కు అనుకూలించే పిచ్ లే ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి.. బౌలర్లు మ్యాచ్ లను శాసిస్తారని అనుకోవడం లేదు. నా ఉద్దేశంలో బ్యాటర్లదే ఆధిపత్యం. అలాంటి పరిస్థితుల్లో అత్యుత్తమ బౌలర్లు ఉన్న జట్టే బాగా రాణించగలదు'' అని కైఫ్ పేర్కొన్నాడు.

రోహిత్, కోహ్లీ జట్టుకు కీలకమైన ఆటగాళ్లని.. అయితే ప్రపంచకప్ గెలవాలంటే వారితో పాటు ఇతర ఆటగాళ్లూ రాణించాలని కైఫ్ తెలిపాడు. 2003 ప్రపంచకప్ టోర్నీలో భారత్ ఫైనల్కు చేరిన సందర్భాన్ని అతడు గుర్తుచేశాడు. ఆ టోర్నీలో సచిన్, యువరాజ్ సింగ్, రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్ బ్యాటింగ్ లో మంచి ప్రదర్శన చేశారని చెప్పారు. బౌలింగ్లో ఆశిష్ నెహ్రా, జహీర్ ఖాన్, శ్రీనాథ్ కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. విదేశాల్లో ప్రపంచకప్ గెలవాలంటే సమష్టి ప్రదర్శన అవసరమని కైఫ్ అభిప్రాయపడ్డాడు.

బాలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్న బేబమ్మ

'ఉప్పెన' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి బాక్సాఫీస్ ను షేక్ చేసి, ఓవర్ నైట్ లోనే కుర్రకారు గుండెల్లో గూడు కట్టుకున్న క్యూట్ బ్యూటీ కృతి శెట్టి. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో పలు చిత్రాల్లో నటించారు. అయితే వరుస అవకాశాలు దక్కించుకున్నప్పటికీ సరైన హిట్ అందుకోలేకపోయింది. ఇక ఇటీవల విష్ణు శివన్ దర్శకత్వంలో 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమాలో నటించిన ఈ ముద్దుగుమ్మ భారీ డిజాస్టర్ ను చవిచూసింది. ప్రస్తుతం జయం రవి సరసన 'జీనీ' అనే భారీ చిత్రంలో నటిస్తున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా, కృతి శెట్టికి సంబంధించిన ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ భామ, ఇప్పుడు బాలీవుడ్ లోకి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నట్లు టాక్. ఒక రొమాంటిక్ లవ్ స్టోరీతో హిందీ ఇండస్ట్రీలో అడుగుపెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ను ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి వద్ద సుదీర్ఘ కాలం పాటు పని చేసిన విధి ఘోడ్గాంకర్ తెరకెక్కించనున్నారట. ఏవీఎస్ స్టూడియోస్ బ్యాన్స అభిషేక్ ఎస్ వ్యాస్ దీనిని నిర్మిస్తుండగా, ఈ ఏడాదే ఈ సినిమా షూటింగ్ పట్టాలెక్కనున్నట్లు సమాచారం. చిత్రంలో కృతి శెట్టిని ఒక సరికొత్త అవతార్లో చూపించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. ఇందులో నిజమెంత అనేది తెలియనప్పటికీ ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు మాత్రం తెలుగు, తమిళంలో కలిసిరాని అదృష్టం.. బాలీవుడ్లో అయినా కలిసొచ్చి సరైన హిట్ పడుతుందా? లేక నిరాశనే ఎదురవుతుందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నేచురల్ స్టార్తో జోడీ కట్టనున్న రుక్మిణి వసంత్!

టాలీవుడ్ నుంచి కోలీవుడ్ వరకు ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా మారిపోయారు కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్. ఇండస్ట్రీకి వచ్చిన తక్కువ కాలంలోనే తన అందం, అభినయంతో వరుస బ్లాక్ బస్టర్లు అందుకుంటూ దూసుకెళ్తున్న ఈ అమ్మడుకి ఇప్పుడు తెలుగులో మరో బంపర్ ఆఫర్ వచ్చినట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు చర్చనీయాంశంగా మారాయి. '96', 'మెయ్యళగన్' వంటి అద్భుతమైన భావోద్వేగ చిత్రాలను తెరకెక్కించిన ప్రముఖ దర్శకుడు ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో నేచురల్ స్టార్ నాని హీరోగా ఒక కొత్త సినిమా తెరకెక్కబోతుండగా.. ఇందులో రుక్మిణి హీరోయిన్ గా ఎంపిక అయినట్లు టాక్. ఇది పూర్తిగా మనసుకు హత్తుకునే సున్నితమైన లవ్ స్టోరీ అని సమాచారం. ఈ చిత్రంలో రుక్మిణి పాత్ర చాలా బలంగా, ఎంతో ప్రాధాన్యతతో ఉండబోతుందట. ఆ పవర్ ఫుల్ పాత్ర కోసం మేకర్స్ రుక్మిణి వసంత్ ను ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన 'డ్రాగన్' ప్రాజెక్ట్ లో నటిస్తున్న ఈ భామ ఖాతాలో.. ఇప్పుడు నాని సినిమా కూడా చేరడం విశేషం. ఏకంగా టాలీవుడ్ స్టార్ హీరోలతో వరుస సినిమాలు చేస్తూ దూసుకెళ్తున్న రుక్మిణి వసంత్ క్రేజ్ చూస్తుంటే తెలుగులో ఆమె హవా త్వరలోనే మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.